www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
వరంగల్

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI
పేజీలు: 14
సంపుటి (Volume) :22
సంచిక (Issue) : 284

శనివారం | 11-1-2025

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం, తిథి: ద్వాదశి ఉ. 8.22 తదుపరి త్రయోదశి తె. 6.33 వరకు, నక్షత్రం: రోహిణి మ.12.29 తదుపరి మృగశిర, వర్జ్యం: సా.5.49-7.21; దుర్ముహూర్తం: ఉ.6.51-8.20, అమృతఘడియలు: ఉ.9.27-10.58, రా.2.59-4.31; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం:6.51; సూర్యాస్తమయం: 5.54

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

కలెక్టర్లూ.. మారండి!

కొందరు క్షేత్ర స్థాయికి వెళ్లడంలేదు.. ఆఫీసుల్లోనే కూర్చుని పని చేయాలనుకుంటున్నారు

- ఇష్టం లేకుంటే చెప్పండి.. వేరేచోటకు పోస్టింగ్
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవు
- ఈ నెల 26 నుంచి 4 ప్రతిష్ఠాత్మక పథకాలు
- 24 లోగా గ్రామ సభలను నిర్వహించాలి
- అర్హులందరికీ 'రైతు భరోసా' సొమ్ము ఇవ్వండి
- భూమిలేని కూలీలకు 'ఆత్మీయ భరోసా'
- గతంలోని అర్హతలతోనే కొత్త రేషన్ కార్డులు
- ముందుగా అత్యంత పేదలకు ఇందిరమ్మ ఇళ్లు
- కలెక్టర్ల సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు
- 26 తర్వాత ఆకస్మిక తనిఖీలు చేస్తానని వెల్లడి



సచివాలయంలో నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాల కలెక్టర్ల పనితీరుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. కొంత మంది కలెక్టర్లు క్షేత్రస్థాయికి వెళ్లడంలేదని, ఆఫీసుల్లోనే కూర్చుని పని చేయాలనుకుంటున్నారని తప్పుబట్టారు. ఇది మంచి పద్ధతి కాదని, వారు మారాలని, ఇక నుంచైనా క్షేత్రస్థాయికి వెళ్లాలని సూచించారు. ఐఏఎస్ అధికారి జిల్లా కలెక్టర్‌గా పనిచేయడం ఓ మధురానుభూతి అని చెప్పారు. "ఒకవేళ ఎవరికైనా కలెక్టర్‌గా పనిచేయడం ఇష్టం లేకపోతే చెప్పండి.. వేరేచోట పోస్టింగ్ ఇస్తా" అని అన్నారు. శుక్రవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో సచివాలయంలో ముఖ్యమంత్రి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్లకు ప్రత్యేకంగా కొన్ని సూచనలు చేశారు. "గతంలో ఉమ్మడి జిల్లాలుగా ఉన్నప్పుడు ఒక జిల్లాకు వెళ్లాలన్నా, ఏదైనా తండాలు, మారుమూల ప్రాంతాలకు వెళ్లి రావాలన్నా కనీసం రెండు రోజుల సమయం పట్టేది. ఇప్పుడు ఆ సమస్య లేదు.. ఏ జిల్లాలోని ఏ మారుమూల ప్రాంతానికి వెళ్లి రావాలన్నా రెండు, మూడు గంటల్లో తిరిగి వచ్చే అవకాశాలున్నాయి. కలెక్టర్లు అందరూ జిల్లాల్లో పర్యటనలు చేయాలి. క్షేత్రస్థాయికి వెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా చర్యలు తీసుకోవాలి. మీరు మంచి పేరు తెచ్చుకుని, ప్రభుత్వానికి

మిగతా 13వ పేజీలో...

పెట్టుబడులు పెట్టండి

- పారిశ్రామికవేత్తలకు సీఎం పిలుపు
- గొప్ప నగర నిర్మాణమే మా లక్ష్యం
- తెలంగాణ రైజింగ్ లక్ష్యంతో ఫోర్త్ సిటీ
- చైనా తరహాలో క్లస్టర్లు సృష్టిస్తాం
- సీఐఐ జాతీయ కౌన్సిల్ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్

13

ఆదివాసీలకు సీఎం కోటాలో ఇళ్లు

- ఎమ్మెల్యే కోటాతోపాటు అదనం
- విద్య, ఉద్యోగ, ఆర్థికంగా అండ
- ఉద్యమ కేసులను ఎత్తివేస్తాం
- గోండు భాషలో ప్రాథమిక విద్య
- సమస్యలు చెప్పండి.. ఆందోళనలు చేయొద్దు.. సంఘాలతో సీఎం

రూ.168 కోట్లతో చేనేత అభయహస్తం!

- కార్మికుల సంక్షేమానికి పథకం అమలు
- తెలంగాణ లేబుల్ వస్త్రాలకు ప్రోత్సాహం

ఆర్‌ఆర్‌ఆర్‌కు రూ.2వేల కోట్లు!



- ఉత్తర భాగం భూ సేకరణ కోసం ఎన్‌హెచ్‌ఏఐకి చెల్లించిన ప్రభుత్వం
- హడ్కో నుంచి రుణం తీసుకున్న సర్కారు.. నిర్వాసితులకు గరిష్ఠ పరిహారం
- జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు.. త్వరలో తేలనున్న పరిహారం లెక్కలు
- ఏప్రిల్-మేలో రోడ్డు పనులు ప్రారంభం!



హైదరాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగు రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) ఉత్తరభాగంలో మరో అడుగు పడింది. రహదారి నిర్మాణం కోసం సేకరించే భూములకు చెల్లించాల్సిన పరిహారంలో తమ వాటా కింద రూ.2వేల కోట్లను జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) వద్ద రాష్ట్ర ప్రభుత్వం డిపాజిట్ చేసింది. హడ్కో నుంచి రుణం తీసుకోవడం ద్వారా సర్కార్.. ఈ నిధులను సమీకరించినట్లు తెలిసింది. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నప్పటికీ.. రాష్ట్రాభివృద్ధిలో రీజినల్ రింగు రోడ్డు కీలక పాత్ర పోషిస్తుందన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఉంది. ఇందులో భాగంగానే భూ పరిహారం కింద చెల్లించాల్సిన రాష్ట్ర వాటాలో సింహభాగాన్ని ఎన్‌హెచ్‌ఏఐకి చెల్లించింది. ప్రస్తుతం రాష్ట్ర వాటా కింద డిపాజిట్ చేసిన సొమ్ము ఎన్‌హెచ్‌ఏఐ దగ్గరే ఉంటుంది. భూ పరిహారం లెక్కలు తేలిన తరువాత రాష్ట్రం తరఫున ఇంకా ఏమైనా చెల్లించాల్సి వస్తే.. ఆ మేరకు ప్రభుత్వం సర్దుబాటు చేయనుంది. ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తరభాగం

మిగతా 13వ పేజీలో...

మహా అప్పు కావాలి!


హైదరాబాద్‌కు ఏడాదిన్నరలో రూ.20 వేల కోట్లు అవసరం



- 4 నెలల్లో కనీసం రూ.5 వేల కోట్లు
- రుణ మార్కెట్ ద్వారా నిధుల సేకరణకు హెచ్ఎండీఏ కసరత్తు
- సలహాదారు లేదా బ్యాంక్ మర్చెంట్ నియామకానికి టెండర్ల ఆహ్వానం
- ప్రభుత్వ గ్యారెంటీ ఉన్నా, లేకున్నా రుణాలు ఇప్పించాలని స్పష్టీకరణ
- పెండింగులో మౌలిక ప్రాజెక్టులు

హైదరాబాద్ సిటీ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరంలో వివిధ పనుల కోసం 'హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ' (హెచ్ఎండీఏ) రూ.20 వేల కోట్ల రుణాలను సేకరించేందుకు సిద్ధమైంది. హైదరాబాద్ నగర విస్తరణలో మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన ప్రాజెక్టులను చేపట్టేందుకు హెచ్ఎండీఏ వద్ద తగినన్ని నిధులు లేవు. దీంతో అప్పులు చేసి మరీ ఆ ప్రాజెక్టులను పట్టాలెక్కించేందుకు హెచ్ఎండీఏ కసరత్తు చేస్తోంది. దీనికోసం ఏడాదిన్నరలోనే రూ.20 వేల కోట్ల రుణాలను సేకరించేందుకు చర్యలు చేపట్టింది. ఈ మేరకు రుణాల ప్రతిపాదనలు సిద్ధం చేసి వాటిని కార్యరూపంలో పెట్టేందుకు అవసరమైన సలహాదారు లేదా బ్యాంకు మర్చెంట్‌ను నియమించేందుకు

మిగతా 12వ పేజీలో...



బెనిఫిట్ షోలు రద్దంటూ.. స్పెషల్ షోకు

అనుమతులా?

- 'గేమ్ చేంజర్' అదనపు షోలు, టికెట్ల రేట్ల పెంపునకు ఎలా అనుమతిస్తారు?
- తెల్లవారు జామున 4 గంటలకు ప్రత్యేక ప్రదర్శనలు అవసరమా..?
- పునఃసమీక్షించాలంటూ హోంశాఖ ముఖ్య కార్యదర్శికి హైకోర్టు ఆదేశాలు
- ఇకనైనా సర్కారు కళ్లు తెరవాలంటూ వ్యాఖ్య
- రాత్రి 12 గంటల తర్వాత సినిమాలు, పబ్బులు ఎందుకని నిలదీత
- పౌరుల జీవించే హక్కును కాపాడేందుకు ఎంత దూరమైనా వెళ్తామని స్పష్టం

14

పట్నం బైలెల్లినాదో!

12

- హైదరాబాద్ నుంచి పల్లెలకు చలో
- సంక్రాంతికి కదిలిన కుటుంబాలు
- రోడ్లు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లలో రద్దీ
- బస్సుల్లో 50% అధిక చార్జీలు
- విమాన టిక్కెట్ల ధరలు మూడు రెట్లు
- ట్రావెల్స్ ఎక్కువ వసూలు చేస్తే బస్సులు సీజ్ చేస్తామని హెచ్చరిక
- నేటి నుంచి మరింత రద్దీ
- టోల్‌ప్లాజాల వద్ద అదనపు సిబ్బంది

నేనూ మనిషినే.. భగవంతుణ్ని కాదు!

- పొరపాట్లు చేసే ఉంటా..
- కానీ, దురుద్దేశంతో ఎన్నడూ తప్పులు చేయలే
- 'దేశం ముందు' అన్నదే నా సిద్ధాంతం
- గాంధీ, సావర్కర్ మార్గాలు వేరు.. స్వాతంత్ర్యం వారి లక్ష్యం
- ప్రజా సేవ చేయాలన్న మిషన్‌తోనే రాజకీయాల్లోకి రావాలి
- అంతే తప్ప వేరే లక్ష్యాలతో కాదు
- ఎన్నికల్లో తప్పనిసరిగా అలా మాట్లాడాల్సి వచ్చింది
- ఎన్నికలు ముగిశాక పాలనపైనే నా దృష్టి: ప్రధాని మోదీ
- 'జెరోదా' నిఖిల్ కామత్‌కు పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూ



న్యూఢిల్లీ, జనవరి 10: ప్రధాని మోదీ తొలిసారి ఓ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. ఇదే ఒక విశేషమైతే.. రెండు గంటల పాటు సాగిన ఈ ఇంటర్వ్యూలో ఆయన తన శైలికి విరుద్ధంగా మాట్లాడి, అందరినీ ఆశ్చర్యపరిచారు. తానూ మనిషినేనని, పొరపాట్లు జరుగుతాయని చెప్పారు. "గుజరాత్ సీఎంగా ఉన్న సమయంలో కష్టపడి పనిచేయడానికి ఉన్న ఏ అవకాశాన్నీ వదలబోనని చెప్పా. నా కోసం ఏమీ చేసుకోలేదు. నేను దురుద్దేశంతో ఎన్నడూ తప్పులు చేయలేదు. ఇదే నా జీవన మంత్రం. తప్పులనేవి అనివార్యమైనవి. నేను కూడా చేసే ఉంటా. ఎందుకంటే నేనూ మనిషినే! నేనేమీ భగవంతుణ్ని కాదు కదా?" అని మోదీ పేర్కొన్నారు. ప్రముఖ వ్యాపారవేత్త,

మిగతా 2వ పేజీలో...

దానం నాగేందర్ స్వరం మారింది

14

- 'ఫార్ములా ఈ'తో హైదరాబాద్ ఇమేజ్ పెరిగింది
- హైడ్రా కారణంగా ప్రజలకు నష్టం కలుగుతోంది
- ఆ డీసీపీతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోంది
- ఖైరతాబాద్ ఎమ్మెల్యే సంచలన వ్యాఖ్యలు
- రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించిన నిఘా వర్గాలు!

కాంగ్రెస్, బీఆర్ఎస్ కుమ్మక్కు రాజకీయాలు

12

- ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలకు కేసీఆర్ కప్పం
- రేవంత్‌రెడ్డి లోపాయికారి ఒప్పందం
- అందుకే కేటీఆర్‌ను ఏమీ చేయడం లేదు
- ఫార్ములా-ఈ కేసులో చర్యలు లేవేం?
- 700 కోట్ల లాభం ఎలా వచ్చింది: బండి

కెనడా ప్రధాని రేసులో కన్నడిగుడు!

» అవకాశం ఇస్తే దేశ ఆర్థికరంగాన్ని గాడిలో పెడతా

» భారత సంతతి ఎంపీ చంద్ర ఆర్య హామీ



కెనడా, జనవరి 10: కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో తన పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించిన నేపథ్యంలో మరో భారత సంతతి పౌరుడు, ఆదేశ పార్లమెంటు సభ్యుడు, కర్ణాటకకు చెందిన చంద్ర ఆర్య ప్రధాని రేసులోకి వచ్చారు. పార్టీ అవకాశం ఇస్తే దేశాన్ని నడిపించే బాధ్యతలు తీసుకుంటానని తెలిపారు. చిన్న, సమర్థవంతమైన ప్రభుత్వంతో దేశాన్ని పునర్నిర్మిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ మేరకు చంద్ర ఆర్య 'ఎక్స్'లో సుదీర్ఘ పోస్టు పెట్టారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలను ఆయన ప్రస్తావించారు. కుంటుపడుతున్న ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడతానన్నారు. దేశం ఎదుర్కొంటున్న ఇతర సమస్యలను కూడా పరిష్కరిస్తానని నొక్కి చెప్పారు. "దేశం ఇప్పుడు అతి పెద్ద తుఫానును ఎదుర్కొంటోంది. పెద్ద నిర్ణయాలు తీసుకునేందుకు భయపడని నాయకుడు అవసరం. దీనికి నేను సిద్ధంగా ఉన్నా" అని చంద్ర ఆర్య పేర్కొన్నారు. భారత సంతతి పౌరుడైన చంద్ర ఆర్య లిబరల్ పార్టీ నాయకుడు. కెనడా పార్లమెంటు(హౌస్ ఆఫ్ కామన్స్) సభ్యుడిగా ఉన్నారు. 2015 నుంచి వరుసగా ఆయన నేపియన్ నియోజకవర్గం నుంచి విజయం సాధిస్తున్నారు. కర్ణాటకలోని తుమకూరు జిల్లా శిరా తాలూకా, ద్వారాలు గ్రామానికి చెందిన ఆర్య గతంలో ఇంజనీర్‌గా పనిచేశారు. స్వదేశంలో ఇంజనీరింగ్, ఎంబీఏ పూర్తి చేసుకున్న ఆర్య 20 ఏళ్ల కిందట తన భార్య సంగీత, కుమారుడు సిద్‌తో కలిసి కెనడాకు వలస వెళ్లారు. మాతృభూమి, మాతృభాష పట్ల ఆయనకు మక్కువ, మమకారం ఎక్కువ. 2022లో కెనడా పార్లమెంటులో కన్నడంలోనే ఆయన ప్రసంగించడం విశేషం. మాతృభాషలో ప్రసంగించడాన్ని గర్వంగా భావిస్తున్నట్టు ఆయన చెప్పుకొన్నారు.

ట్రూడో నిష్క్రమణతో కెనడా వీసాలపై ప్రభావం!

కెనడా, జనవరి 10: కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో తన పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించిన దరిమిలా కొత్తగా ఏర్పడే ప్రభుత్వంలో ఆ దేశ వీసాలపై తీవ్ర ప్రభావం పడనుందని అంతర్జాతీయ నిపుణులు చెబుతున్నారు. ట్రూడో హయాంలో 2015-23 మధ్య అంతర్జాతీయ విద్యార్థులు, ముఖ్యంగా భారత విద్యార్థులకు వీసాల విషయంలో స్వర్ణ యుగమని తెలిపారు. స్వేచ్ఛాయుత వలస విధానాలను ఆయన అమలు చేశారని, దీంతో భారత విద్యార్థులు అధికంగా లబ్ధి పొందారని చెబుతున్నారు. 2015-24 మధ్య కాలంలో 13 లక్షల మంది భారత విద్యార్థులు చదువుకు సంబంధించిన అనుమతులు పొందినట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఒక్క 2015లోనే 31,920 మంది భారత విద్యార్థులు ఈ అనుమతులు పొందారు. ఇది మొత్తం అంతర్జాతీయ విద్యార్థుల్లో 14శాతంగా ఉంది.

దేశంలో మత, కుల వివక్షే పెద్ద సమస్య

» ప్యూ సర్వేలో భారతీయుల అభిప్రాయం

న్యూఢిల్లీ, జనవరి 10: దేశంలో మత వివక్షే పెద్ద సమస్య అని భారతీయులు అభిప్రాయపడుతున్నారు. ప్రజల్లో అసమానతలకు కారణాలపై ప్యూ రీసెర్చ్ సెంటర్ చేసిన తాజా సర్వేలో దాదాపు 70 శాతం మంది భారతీయుల అదే పెద్ద సమస్య అని వెల్లడించారు. ఇక 69% మంది భారతీయులు కుల, జాతి వివక్ష పెద్ద సమస్య అని చెప్పారు. 36 దేశాల్లో చేసిన సర్వే వివరాలతో ప్యూ రీసెర్చ్ సెంటర్ 'ఆర్థిక అసమానతే ప్రపంచానికి పెద్ద సవాల్‌గా కనిపిస్తోంది' అనే శీర్షికతో ఇటీవల ప్రచురించిన నివేదికలో పలు అంశాలు వెల్లడించింది. ఆ నివేదిక ప్రకారం.. మత వివక్షే పెద్ద సమస్య అని భారత్‌తో పాటు బంగ్లాదేశ్, నైజీరియా, ఫ్రాన్స్ శ్రీలంక ప్రజలు తెలిపారు. ధనికులు, పేదల మధ్య ఉన్న అంతరమే పెద్ద సమస్య అని అన్ని దేశాల్లో ఎక్కువ మంది ప్రజలు అభిప్రాయపడ్డారు. రాజకీయాలపై ధనికుల ప్రభావం వల్లే అసమానతలు పెరుగుతున్నాయని 79 శాతం మంది భారతీయులు తెలిపారు. అసమానతలకు విద్యా వ్యవస్థ కూడా కారణం అని 72 శాతం మంది చెప్పగా.. యాంత్రీకరణ కారణం అని 73 శాతం మంది పేర్కొన్నారు.

కుంభమేళా కోసం 'కుంభవాణి' ఎఫ్‌ఎం చానల్

మహాకుంభ నగర్, జనవరి 10: మహా కుంభమేళాకు ప్రయాగ్‌రాజ్ ముస్తాబవుతోంది. ఈ భారీ కార్యక్రమానికి సంబంధించిన సమాచారాన్ని ప్రసారం చేసేందుకు ప్రసార భారతి రేడియో విభాగం ఆకాశవాణి.. 'కుంభవాణి' ఎఫ్‌ఎం చానల్‌ను ప్రత్యేకంగా అందుబాటులోకి తీసుకొచ్చింది. యూపీ సీఎం యోగి తన ప్రయాగ్‌రాజ్ పర్యటనలో భాగంగా శుక్రవారం దీన్ని ప్రారంభించారు. 'మహా కుంభమేళా సమాచారాన్ని ప్రసారం చేసేందుకు ప్రసార భారతి ఓటీటీ ఆధారిత కుంభవాణి అనే ఎఫ్‌ఎం రేడియో చానల్‌ను ప్రారంభించింది. 103.5 మెగాహెడ్జ్ ఫ్రీక్వెన్సీతో ప్రసారమయ్యే ఈ చానల్ ఈనెల 10 నుంచి ఫిబ్రవరి 26వ తేదీ వరకు అందుబాటులో ఉంటుంది. ప్రతిరోజూ ఉదయం 5.55 గంటల నుంచి రాత్రి 10.05 గంటల వరకూ దీనిలో కార్యక్రమాలు ప్రసారమవుతాయి' అని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తెలిపింది.

'హష్ మనీ' కేసులో ట్రంప్ దోషి



న్యూయార్క్, జనవరి 10: హష్ మనీ కేసులో అమెరికా మాజీ-భావి అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ (78) దోషి అని మన్‌హట్టన్ కోర్టు శుక్రవారం తీర్పు చెప్పింది. అయితే ఆయన పది రోజుల్లో అధ్యక్షునిగా ప్రమాణ స్వీకారం చేయనున్న దృష్ట్యా ఎలాంటి శిక్షగానీ, జరిమానాగానీ విధించలేదు. కానీ శిక్ష పడ్డ అధ్యక్షునిగా చరిత్రలో నిలిచిపోతారు. రెండు దశాబ్దాల క్రితం ఆయనకు ఓ నీలి చిత్రాల నటీమణితో సంబంధాలు ఉండేవి. 2016 అధ్యక్ష ఎన్నికల సమయంలో ఆ విషయాన్ని బయట పెట్టకుండా ఉండేందుకు 'హష్ మనీ' రూపంలో ఆమెకు 1.3 లక్షల డాలర్లు (సుమారు రూ.కోటి) ఇచ్చినట్టు కేసు నమోదయింది. ఈ వ్యవహారంలో 34 విధాలుగా నేరం చేసినట్టు అభియోగాలు మోపారు. అవన్నీ రుజువు కావడంతో మామూలుగా అయితే నాలుగేళ్ల జైలు శిక్ష విధించాల్సి ఉంది. కానీ వివిధ రాజ్యాంగపర అంశాలను పరిగణనలోకి తీసుకొని శిక్ష విధించలేదని జడ్జి జువాన్ ఎం మర్చాన్ తెలిపారు.

పరువు నష్టం దావాలో రాహుల్‌కు బెయిల్

పుణె, జనవరి 10: పరువు నష్టం దావాలో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీకి శుక్రవారం ఇక్కడి ఎంపీ/ఎమ్మెల్యేల ప్రత్యేక కోర్టు బెయిల్ మంజూరు చేసింది. కోర్టులో జరిగే విచారణకు వ్యక్తిగతంగా హాజరుకాకుండా కూడా మినహాయింపు ఇచ్చింది. రూ.25,000 పూచీకత్తు చెల్లించాలని ఆదేశించింది. తదుపరి విచారణ ఫిబ్రవరి 18కు వాయిదా పడింది. 2023 మార్చిలో లండన్‌లో జరిగిన కార్యక్రమంలో హిందుత్వ సిద్ధాంతకర్త వి.డి.సావర్కర్‌ను కించపరిచేలా మాట్లాడారంటూ ఆయన మునిమనుమడు రాహుల్‌పై పరువు నష్టం దావా వేశారు.

క్యాన్సర్ ముప్పు పెరుగుతోంది

» 40 ఏళ్ల పైబడిన వారిలోఎక్కువ కేసులు

» 'మెడి అసిస్ట్ వెల్లడి..బీమా క్లెయిమ్‌లపై విశ్లేషణ

ముంబై, జనవరి 10: గత ఏడాది మన దేశంలో క్యాన్సర్ కేసులు అంతకుముందు ఏడాది కంటే 12% పెరిగాయి. క్యాన్సర్ తర్వాత.. గుండె జబ్బులు, శ్వాసకోశ సమస్యలు భారతీయులను అధికంగా వేధించాయి. 2024లో ఆరోగ్య బీమా కంపెనీలకు వచ్చిన క్లెయిమ్‌ల ఆధారంగా 'మెడి అసిస్ట్ హెల్త్‌కేర్ సర్వీసెస్' అనే సంస్థ ఈ వివరాలను వెల్లడించింది. వీటి ప్రకారం.. క్యాన్సర్ క్లెయిమ్‌లు 40 ఏళ్లకు మించిన వయస్సు ఉన్నవారిలో, మహిళల్లో పెరిగాయి. పురుషులతో పోల్చితే స్త్రీలలో క్యాన్సర్‌కు సంబంధించిన క్లెయిమ్‌లు 1.2-1.5 రెట్లు అధికంగా నమోదయ్యాయి. గుండె జబ్బుల విషయంలో మాత్రం.. మహిళలకన్నా పురుషుల్లోనే క్లెయిమ్‌లు ఎక్కువగా (1.3-1.5 రెట్లు) ఉన్నాయి. కాగా, గత ఏడాది కాలంలో క్యాన్సర్ చికిత్స వ్యయం 6.5%, గుండెజబ్బుల చికిత్స వ్యయం 8% చొప్పున పెరిగాయి. సీనియర్ సిటిజన్లు ఎక్కువగా కంటి సమస్యల కారణంగా (కాటరాక్ట్ చికిత్స కోసం) ఆస్పత్రుల్లో చేరుతున్నారు. దీనిపై 'మెడి అసిస్ట్ హెల్త్‌కేర్ సర్వీసెస్' సీనియర్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ విజయ్ శంకరన్ స్పందిస్తూ.. 'ప్రజల్లో ఆయుర్దాయం పెరిగింది కానీ.. ఆరోగ్యం తరిగింది. ఆహార అలవాట్లు మారిపోతున్నాయి. ప్రజల మీద ఒత్తిడి పెరుగుతోంది. మధుమేహం, హైపర్ టెన్షన్ కేసులు పెరుగుతున్నాయి' అని తెలిపారు.

నేనూ మనిషినే.. భగవంతుణ్ని కాదు!

(మొదటి పేజీ తరువాయి)



నిఖిల్ కామత్‌తో పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతున్న ప్రధాని మోదీ

జెరోదా సహ వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్ పాడ్‌కాస్ట్‌లో ప్రధాని మోదీ అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇద్దరూ పలు ఆసక్తికర విషయాలపై మాట్లాడుకున్నారు. ఇంటర్వ్యూ ట్రైలర్‌ను మోదీ తన ఎక్స్ ఖాతాలో పెట్టారు. తొలుత వీడియో ట్రైలర్‌ను పోస్ట్ చేసిన కామత్.. శుక్రవారం పూర్తి వీడియోను విడుదల చేశారు. దాదాపు 2 గంటల పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో రాజకీయాలు, చిన్నతనంలో జరిగిన ఘటనలు, స్నేహితులు, ప్రధానిగా బాధ్యతలు, నాయకత్వ సవాళ్ల వంటి పలు అంశాలపై ఇద్దరూ చర్చించుకున్నారు. ఆరంభంలో నిఖిల్ కామత్ మాట్లాడుతూ.. 'ప్రధానిని ఇంటర్వ్యూ చేస్తున్నానంటే ఒకింత భయంగా ఉంది' అన్నారు. దానికి మోదీ బదులిస్తూ.. 'ఇదే నా తొలి పాడ్‌కాస్ట్. దీన్ని ప్రజలు ఎలా స్వీకరిస్తారో తెలియదు' అనడంతో నవ్వులు విరిశాయి. రాజకీయాల్లోకి రావాలనుకునే యువతకు మీరిచ్చే సూచన ఏంటి? అని నిఖిల్ కామత్ ప్రధానిని అడగ్గా.. "రాజనీతి కలిగిన వ్యక్తులు రావాల్సిన అవసరం ఉంది. ప్రజాసేవ చేయాలన్న మిషన్‌తో రాజకీయాల్లోకి రావాలి కానీ, వేరే యాంబిషన్(లక్ష్యం)తో కాదు" అని సమాధానమిచ్చారు. రాజనీతి కలిగిన నాయకులు ఉన్నారా? అని అడగ్గా.. దేశంలో అలాంటి యువ నాయకులు ఎంతో మంది ఉన్నారని మోదీ చెప్పారు. ఒకరి పేరు చెబితే మిగిలిన వారికి అన్యాయం చేసినట్లవుతుందన్నారు.

అదే నా సిద్ధాంతం

ఆశయాలకు అత్యంత ప్రాధాన్యం ఉంటుందన్న ప్రధాని.. అదేసమయంలో సిద్ధాంతాలకు కూడా అంతే విలువ ఉంటుందన్నారు. సిద్ధాంతాలు లేకుండా రాజకీయాలు కూడా లేవని చెప్పారు. గాంధీ, సావర్కర్‌ల మార్గాలు వేరైనప్పటికీ వారి సిద్ధాంతం మాత్రం ఒక్కటేనన్నారు. అదే 'స్వాతంత్ర్యం' అని మోదీ చెప్పారు. ఇక తన విషయానికి వస్తే.. 'దేశం ముందు' అన్నదే తన సిద్ధాంతమని స్పష్టం చేశారు. ఇందులో భాగంగా పాత ఆలోచనలను పక్కనపెట్టి, ఎప్పటికప్పుడు కొత్తవాటికి చోటిస్తానని తెలిపారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేలా ఒక బృందాన్ని రూపొందించుకోవాలన్నారు. తాను విజయవంతమవడానికి తన బృందమే కారణమని చెప్పారు.

తప్పనిసరిగా మాట్లాడాల్సి వచ్చింది..

తాను విలక్షణ రాజకీయ నాయకుడిని కాదని మోదీ చెప్పారు. పరిపాలనపైనే తాను ఎక్కువ సమయం వెచ్చిస్తానని తెలిపారు. "ఎన్నికల సమయంలో నేను రాజకీయ ప్రసంగాలు చేశా. అది తప్పనిసరి పరిస్థితి. నాకు నచ్చకపోయినా అలా మాట్లాడాల్సి వచ్చేది. ఎన్నికలు అయిపోయిన తర్వాత నా సమయం అంతా పరిపాలన కోసమే వెచ్చిస్తా. ఇక అధికారంలో లేని సమయంలో నా దృష్టి మొత్తం సంస్థాగత పనులపైనే ఉంటుంది" అని మోదీ పేర్కొన్నారు. తానెప్పుడూ సవాళ్లను ఇష్టపడతానని, ఒక గిరి గీసుకొని అందులో హాయిగా గడపడం తనకు నచ్చదని చెప్పారు. తన గురించి ఎప్పుడూ ఆలోచించుకోనని, రిస్క్ తీసుకోవడానికే ప్రాధాన్యమిస్తానని తెలిపారు. తొలి రెండు పర్యాయాలు తాను ప్రారంభించిన అభివృద్ధి పనులను చూసి ప్రధానిగా తన పనితీరును అంచనా వేసుకునేవాడినన్నారు. మూడోసారి బాధ్యతలు స్వీకరించిన తర్వాత తన ఆలోచనలు మారిపోయాయన్నారు. 2047 కల్లా దేశాన్ని వికసిత్ భారత్‌గా మార్చాలన్నదే తన లక్ష్యమని తెలిపారు.

సాధారణ విద్యార్థిని..

మోదీ బాల్యం గురించి కామత్ అడగ్గా.. తానో సాధారణ విద్యార్థినని చెప్పారు. ఏ విషయంపైనా తాను పెద్దగా శ్రద్ధ పెట్టేవాడిని కాదన్నారు. అయితే భేల్జీభాయ్ చౌధరి అనే టీచర్ తనను ఎంతగానో ప్రోత్సహించేవారని మోదీ గుర్తుచేసుకున్నారు. ఆయన ఒక రోజు మా నాన్నతో 'మీ అబ్బాయి చాలా ప్రతిభావంతుడు. కానీ, దృష్టి పెట్టడు' అని చెప్పారని తెలిపారు.

మా గ్రామంలో పర్యటిస్తానని చైనా అధ్యక్షుడు చెప్పారు..

"చైనా తత్వవేత్త షువాన్‌జాంగ్ గుజరాత్‌లోని మా గ్రామం వాద్‌నగర్‌లో చాలా కాలం ఉన్నారు. ఆయనపై ఓ సినిమా తీస్తున్న విషయం తెలిసింది. అప్పుడు సినిమాలో మా గ్రామం గురించి ప్రస్తావించాలని ఎంబసీకి లేఖ రాశా. 2014లో నేను ప్రధానమంత్రిని అయిన తర్వాత ప్రపంచ నేతలు ఫోన్లు చేసి అభినందించారు. అప్పుడు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ కూడా ఫోన్ చేసి అభినందనలు తెలిపారు. అప్పుడే ఆయన భారత పర్యటనకు రావాలనుకుంటున్నట్లు చెప్పారు. ప్రత్యేకించి గుజరాత్‌లోని మీ గ్రామమైన వాద్‌నగర్‌లో పర్యటించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. మీకు, నాకు మధ్య ప్రత్యేక బంధం ఉందని జిన్‌పింగ్ అన్నారు. షువాన్‌జాంగ్ చాలా కాలం మీ గ్రామంలో ఉన్నారు. చైనా తిరిగి వచ్చిన తర్వాత మా గ్రామంలో నివసించారని జిన్‌పింగ్ చెప్పారు. ఈ విధంగా మన ఇద్దరి మధ్య బంధం ఉందని ఆయన అన్నారు" అని మోదీ వెల్లడించారు. కాగా, భారత్ ఎప్పుడూ తటస్థంగా ఉండదని ప్రధాని స్పష్టం చేశారు. మనం ఎప్పుడూ శాంతివైపే ఉంటామన్నారు. రష్యా, ఉక్రెయిన్, ఇరాన్, పాలస్తీనా, ఇజ్రాయెల్.. ఇలా ఏ దేశానికైనా ఇదే విషయం స్పష్టం చేసినట్లు తెలిపారు.

నన్నో సీఎంగానే చూశారు..

బాల్యమిత్రుల గురించి కామత్ ప్రశ్నించగా.. "నేను చాలా చిన్న వయసులోనే ఇంటిని, ఇతర బంధాలను వదిలేశా. జీవితంలో ఎక్కువ భాగం తిరుగుతూనే ఉండడంతో అందరితో సంబంధాలు తెగిపోయాయి. నేను ముఖ్యమంత్రిని అయిన తర్వాత చిన్ననాటి మిత్రులను సీఎం బంగ్లాకు ఆహ్వానించా. ఏళ్ల కిందట ఊళ్లో వారితో ఎలా ఉన్నానో, ఇప్పటికీ అలాగే ఉన్నా చెప్పేందుకే వారిని పిలిచా. దాదాపు 30-35 మంది వచ్చారు. కలిసి భోజనం చేశాం, పాత రోజుల గురించి మాట్లాడుకున్నాం. కానీ, వారితో గడిపిన సమయాన్ని ఆస్వాదించలేకపోయా. ఎందుకంటే నేను స్నేహితుల కోసం చూశా.. వారు మాత్రం నన్నో సీఎంగానే చూశారు" అని మోదీ పేర్కొన్నారు.

నన్ను నేను నియంత్రించుకున్నా..

"ఫిబ్రవరి 24, 2002లో నేను తొలిసారి సీఎంగా గెలిచి అసెంబ్లీలో అడుగు పెట్టా. మూడు రోజుల తర్వాత ఫిబ్రవరి 27న గోధ్రా ఘటన జరిగింది. రైలుకు నిప్పు పెట్టినట్లు తొలుత మాకు సమాచారం వచ్చింది. ఆ తర్వాత అల్లర్లు, మృతుల సమాచారం వచ్చింది. అప్పుడు సభలో ఉన్న నేను ఎంతగానో ఆందోళన చెందా. వెంటనే గోధ్రాలో పర్యటిస్తానని చెప్పా. అప్పుడు ఒక్క హెలికాప్టర్ మాత్రమే ఉంది. అది సింగిల్ ఇంజన్ హెలికాప్టర్ అని, వీఐపీలను అందులో ప్రయాణించడానికి అనుమతించబోమని అధికారులు చెప్పారు. ఏం జరిగినా నాదే బాధ్యత అని వారితో వాదించా. వెంటనే గోధ్రా వెళ్లా. అక్కడ మృతదేహాలు, హృదయవిదారకమైన దృశ్యాలు చూసి చలించిపోయా. కానీ, నేను సీఎం హోదాలో ఉండడంతో భావోద్వేగాలను అదుపులో పెట్టుకోవాల్సి వచ్చింది. నన్ను నేను నియంత్రించుకోవడానికి ఎంతో చేయాల్సి వచ్చింది" అని మోదీ చెప్పారు.

లోకం తీరు



మోదీ.. మనిషి..
నష్టనివారణ చర్యే : కాంగ్రెస్

న్యూఢిల్లీ, జనవరి 10: "నేనూ మనిషినే.. నేను కూడా తప్పులు చేసే ఉంటా" అంటూ నిఖిల్ కామత్‌తో జరిగిన పాడ్‌కాస్ట్‌లో ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ ఎద్దేవా చేసింది. ఎనిమిది నెలల క్రితం తనని తాను దైవ దూతగా ప్రకటించుకున్న వ్యక్తి చేసిన ఈ వ్యాఖ్యలు చూస్తుంటే నష్ట నివారణ చర్యలానే కనిపిస్తుంది.. అంటూ కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ ఎక్స్‌లో ఓ పోస్ట్ చేశారు. 2024 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో మోదీ మాట్లాడుతూ.. దేవుడు ఓ పని మీద తనని భూమి మీదకు పంపాడని భావిస్తున్నానని పేర్కొన్నారు.

పరీక్షలు రాయలేక స్కూళ్లకు బాంబు బెదిరింపులు..

» ఢిల్లీలో 12వ తరగతి విద్యార్థి అరెస్టు

న్యూఢిల్లీ, జనవరి 10: దేశ రాజధాని ఢిల్లీలో కొద్ది వారాలుగా విద్యాసంస్థలకు బాంబు బెదిరింపులు కలకలం సృష్టిస్తున్నాయి. అయితే దీనికి సంబంధించి ఓ మైనర్ విద్యార్థిని పోలీసులు శుక్రవారం తెల్లవారు జామున అరెస్టు చేశారు. ఇటీవల 23 పాఠశాలలకు బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. దీంతో ఆయా స్కూళ్లలో తనిఖీలు చేసిన పోలీసులు.. అవి బూటకపు బెదిరింపులుగా తేల్చారు. ఈ క్రమంలోనే విచారణ జరిపి.. 12వ తరగతి చదివే ఓ విద్యార్థిని అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారించగా అసలు విషయం బయటపడింది. పరీక్షలు రాయడం ఇష్టంలేక వాటిని రద్దు చేస్తారనే ఉద్దేశంతోనే స్కూళ్లలో బాంబులు పెట్టినట్లు మెయిల్స్ పంపినట్లు అంగీకరించాడు. గతంలో ఆరు సార్లు ఇలా బెదిరింపులకు పాల్పడినట్లు ఒప్పుకొన్నాడు.

అత్యాచారం చేస్తే మరణశిక్ష

» మహిళలను వేధిస్తే ఐదేళ్ల వరకు జైలు

» చట్ట ముసాయిదాకు తమిళనాడు ఆమోదం

చెన్నై, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మహిళలపై అత్యాచార ఘటనలను అడ్డుకునేందుకు తమిళనాడులోని స్టాలిన్ ప్రభుత్వం కఠిన చర్యలకు ఉపక్రమించింది. ఇందులో భాగంగా మహిళలపై అత్యాచారానికి పాల్పడే వారికి ఇకపై మరణశిక్ష విధించనున్నారు. ఈ మేరకు స్టాలిన్ శుక్రవారం అసెంబ్లీలో చట్టసవరణ ముసాయిదాను ప్రవేశపెట్టగా అది ఆమోదం పొందింది. ఈ చట్టం అమల్లోకి వస్తే మహిళల వెంటపడినా, వారిని వేధించినా నేరంగా పరిగణించి ఐదేళ్ల వరకు జైలు శిక్ష విధిస్తారు. అత్యాచారాలకు పాల్పడితే గరిష్ఠంగా మరణ శిక్ష విధించేలా ఈ బిల్లును రూపొందించారు. ఈ ముసాయిదా బిల్లు ప్రకారం.. బాలికలు, యువతులు, మహిళలపై అత్యాచారానికి పాల్పడితే మరణశిక్ష, 12 ఏళ్లలోపు బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన జీవిత కారాగార శిక్ష లేదా మరణ శిక్ష విధిస్తారు. 18 ఏళ్లలోపు బాలికలపై సామూహిక వేధింపులకు పాల్పడితే జీవిత కారాగార శిక్ష విధిస్తారు. అత్యాచార కేసుల్లో బాధిత మహిళల వివరాలను బహిర్గతం చేస్తే 3 లేదా 5 ఏళ్ల జైలు శిక్ష, మహిళలను కించపరిచే వ్యాఖ్యలు చేస్తే 3 నుంచి 5 ఏళ్ల వరకు జైలు శిక్ష, యాసిడ్ దాడి వంటి కేసుల్లో నిందితులకు పదేళ్ల జైలు శిక్ష విధించేలా ఈ బిల్లును రూపొందించారు.

ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీలకు జీఎస్టీ నోటీసులపై సుప్రీం స్టే

న్యూఢిల్లీ, జనవరి 10: ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీలు, క్యాసినోలకు జీఎస్టీ అధికారులు జారీ చేసిన షోకాజ్ నోటీసులపై శుక్రవారం సుప్రీంకోర్టు స్టే విధించింది. ఆ కంపెనీలన్నీ సుమారు రూ.లక్ష కోట్ల మేర పన్ను ఎగవేశాయని ఆరోపిస్తూ అధికారులు నోటీసులు పంపించారు. దీనిపై లోతుగా విచారణ జరగాల్సి ఉన్నందున స్టే విధిస్తున్నట్టు ధర్మాసనం తెలిపింది. తదుపరి విచారణను మార్చి 18కి వాయిదా వేసింది. ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్‌పై 28 శాతం పన్ను ఉంటుందని 2023 ఆగస్టు 28న జీఎస్టీ మండలి ప్రకటించింది. బెట్టింగ్ జరిగిన మొత్తం సొమ్మును పరిగణనలోకి తీసుకొని జీఎస్టీ విధిస్తారని తెలిపింది.

శంభల్ మసీదు బావిపై యథాతథ స్థితి



ఎలాంటి జోక్యం చేసుకోవద్దు

» అధికారులకు సుప్రీంకోర్టు ఆదేశాలు

న్యూఢిల్లీ, జనవరి 10: వివాదాస్పదంగా మారిన ఉత్తరప్రదేశ్‌లోని శంభల్‌లో ఉన్న షాహీ జామా మసీదుపై శుక్రవారం సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు ఇచ్చింది. అక్కడ యథాతథ పరిస్థితిని కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వ అధికారులను ఆదేశించింది. అక్కడ ఉన్న 'ప్రయివేటు బావి' జోలికి పోకూడదని, సర్వేలు జరపకూడదని పురావస్తు సర్వే విభాగానికి సూచించింది. అక్కడి శాంతిభద్రతల పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నట్టు పేర్కొంది. శంభల్‌లో జిల్లా అధికారులు జరుపుతున్న తవ్వకాలను సవాలు చేస్తూ షాహీ జామా మసీదు కమిటీ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌ల ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చింది. అక్కడి పరిస్థితులపై రెండు వారాల్లో నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించింది. పురాతన ఆలయాలు, బావులను పునరుద్ధరించాలన్న ఉద్దేశంతో జిల్లా అధికారులు నగరంలో పలు చోట్ల తవ్వకాలు జరుపుతున్నారని మసీదు కమిటీ తన పిటిషన్‌లో తెలిపింది. ఇంతవరకు 32 పురాతన, ఉపయోగంలో లేని ఆలయాలు, 9 బావులను గుర్తించారని పేర్కొంది. వీటి జాబితాలో మసీదుకు చెందిన బావి కూడా ఉందని తెలిపింది. ఆ బావి సగం మసీదు ప్రాంగణంలో, మరో సగం బయట ఉందని పేర్కొంది. దీనిని ఎప్పటి నుంచో మసీదు అవసరాల కోసం వాడుతున్నారని, దీనికి చారిత్రక ప్రాధాన్యం ఉందని తెలిపింది. అది ప్రయివేటు బావి అని, దాని విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోకుండా యథాతథ పరిస్థితి ఉత్తర్వులు ఇవ్వాలని కోరింది. ఈ సర్వేల కారణంగా హింసాత్మక సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని మసీదు కమిటీ తరపున సీనియర్ న్యాయవాది హుపేజా అహ్మదీ చెప్పారు. మసీదు ప్రాంతాన్ని 'హరి మందిర్'గా పేర్కొంటున్నారని, అక్కడ పూజలు జరిపేందుకు సన్నాహాలు చేస్తున్నారని తెలిపారు. దీనిపై సీజేఐ జస్టిస్ ఖన్నా స్పందిస్తూ "అలాంటివాటిని అనుమతించబోం. స్థాయీ నివేదిక సమర్పించండి" అని ఆదేశించారు. హిందూ పక్షం తరఫున న్యాయవాది విష్ణు శంకర్ జైన్ వాదిస్తూ ఆ బావి మసీదు బయట ఉందని, దానిని పూజల కోసం ఉపయోగించేవారని తెలిపారు. దీనిని ముస్లిం పక్షం న్యాయవాది అహ్మదీ ఖండించారు. దాంతో ఆ బావి సమస్యపై యథాతథ స్థితి కొనసాగించాలని ఆదేశించింది. ఈ వ్యవహారంపై ఫిబ్రవరి 21లోగా సమాధానం ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వంతో పాటు, ఇతర పార్టీలను ఆదేశించింది.

సుప్రీంకోర్టును సందర్శించొచ్చు

సామాన్యులకు సుప్రీంకోర్టు ద్వారాలు తెరుచుకున్నాయి. ఇకపై సర్వోన్నత న్యాయస్థానం ప్రాంగణంలోకి వెళ్లి అక్కడి విశేషాలను తిలకించవచ్చు. శనివారం రోజుల్లో సందర్శకులకు ఈ అవకాశం కలిగిస్తున్నామని పేర్కొంటూ సుప్రీంకోర్టు రిజిస్ట్రార్ మహేష్ టి పట్నాకర్ గురువారం సర్క్యులర్ జారీ చేశారు. అయితే రెండు, నాలుగు శనివారాలు కోర్టుకు సెలవు రోజులు కావడంతో ఆ సమయంలో ప్రవేశాలు ఉండవు. ఆ రోజు సెలవు వచ్చినా కూడా సందర్శకులకు అవకాశం ఉండదు. ఆసక్తికల వారు ఆన్‌లైన్‌లో పేర్లను నమోదు చేసుకొని టైమ్ స్లాట్‌ను బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. తప్పకుండా గైడ్ సాయంతోనే ప్రాంగణంలో తిరగాల్సి ఉంటుంది. సుమారు గంట పాటు కోర్టు హాళ్లను తిలకించే అవకాశం కల్పిస్తారు.

సుప్రీంకోర్టు పేరుతో నకిలీ వెబ్‌సైట్లు

న్యూఢిల్లీ, జనవరి10: సుప్రీంకోర్టు పేరిట నకిలీ వెబ్‌సైట్లు సృష్టించి ప్రజల వ్యక్తిగత సమాచారం దొంగిలిస్తున్న సైబర్ దాడుల అంశంపై అత్యున్నత న్యాయస్థానం రిజిస్ట్రీ తాజాగా పబ్లిక్ నోటీసు జారీ చేసింది. నకిలీ వెబ్‌సైట్లను సృష్టించడంతో పాటు యూఆర్‌ఎల్(యూనిఫామ్ సర్వీస్ లోకేటర్)లను జనరేట్ చేస్తున్నారని, అప్రమత్తంగా ఉండాలని సూచించింది. నకిలీ వెబ్‌సైట్ల జాబితాను నోటీసులో ప్రస్తావించింది. రహస్య, వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దని నోటీసులో సూచించింది. సుప్రీంకోర్టు రిజిస్ట్రీ ప్రజల వ్యక్తిగత సమాచారం, రహస్య వివరాలు, ఆర్థిక లావాదేవీల గురించి ఎప్పుడూ కోరదని నోటీసులో స్పష్టం చేసింది.

జేఈఈ-అడ్వాన్స్‌డ్ అభ్యర్థులకు సుప్రీంకోర్టు ఊరట

న్యూఢిల్లీ, జనవరి 10: జేఈఈ-అడ్వాన్స్‌డ్ పరీక్షల విషయంలో అభ్యర్థులకు శుక్రవారం సుప్రీంకోర్టు ఊరట కలిగించింది. 2004 నవంబరు 5 నుంచి 18వ తేదీల మధ్య ఈ పరీక్ష కోసం దరఖాస్తు చేసుకోలేకపోయిన విద్యార్థులకు మరో అవకాశం కలిగించింది. ఈ సమయంలో దరఖాస్తు చేసుకోలేకపోయిన వారు మళ్లీ పరీక్ష రాయవచ్చని తెలిపింది. పరీక్షలు నిర్వహించే జాయింట్ అడ్మిషన్ బోర్డు (జేఏబీ) 2024 నవంబరు 5న ఇచ్చిన నోటిఫికేషన్‌లో ఈ పరీక్ష కోసం అభ్యర్థులు మూడు ప్రయత్నాలు (అటెంప్ట్‌లు) చేయవచ్చని తెలిపింది. కేవలం 13 రోజుల వ్యవధిలోనే నిర్ణయాన్ని మార్చుకొని అభ్యర్థులు 2 అటెంప్ట్‌లకు మించి రాయకూడదని అందులో పేర్కొంది. దీనివల్ల కొందరు పరీక్షకు దరఖాస్తు చేసే అవకాశాన్ని కోల్పోయారు.

కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం 15న కొత్త భవనంలోకి



కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం కొత్త భవనం

» ప్రారంభించనున్న సోనియా గాంధీ

» హాజరు కానున్న సీఎం రేవంత్ రెడ్డి

న్యూఢిల్లీ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయ చిరునామా ప్రస్తుత 24, అక్బర్ రోడ్ నుంచి 9ఏ, కోట్లా మార్గ్‌కు మారనుంది. ఈ నెల 15 ఉదయం 10గంటలకు కాంగ్రెస్ కొత్త కార్యాలయాన్ని సోనియా గాంధీ ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి రాహుల్, ఖర్గే, ప్రియాంక సహా పార్టీ సీనియర్ నేతలు, రేవంత్ సహా కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సీఎంలు హాజరుకానున్నారు. ఈ కొత్త కార్యాలయానికి ఇందిరాభవన్‌గా నామకరణం చేశారు. మొత్తం ఏడు అంతస్తుల్లో(అండర్ గ్రౌండ్‌లో 2 అంతస్తులతో కలిపి) నిర్మించారు. ఇందులో ఐదు అంతస్తులను పార్టీ కార్యకలాపాల కోసం నిర్మించారు. మొదటి అంతస్తులో విజిటర్స్ కూర్చునే ఏర్పాట్లతో పాటు, కొందరి నేతల చాంబర్లు, రెస్టారెంట్‌ను నిర్మించారు. 2, 3, 4వ అంతస్తుల్లో పార్టీ కీలక నేతల చాంబర్లతో పాటు పార్టీ అనుబంధ విభాగాల కార్యకలాపాల కోసం గదులను నిర్మించారు. 5వ అంతస్తులో పార్టీ అగ్రనేతలు సమావేశమయ్యేందుకు రెండు విశాలమైన హాళ్లను నిర్మించారు. అండర్‌గ్రౌండ్‌లో రెండు అంతస్తులను పార్కింగ్ కోసం కేటాయించారు. కాంగ్రెస్ కొత్త కార్యాలయం వాస్తవానికి దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్(డీడీయూ) మార్గ్‌లో ఉంది. అయితే బీజేపీ సిద్ధాంతకర్తల్లో ఒకరైన పండింట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ పేరును పార్టీ కార్యాలయ చిరునామాగా వ్యవహరించడం కాంగ్రెస్‌కు ఇబ్బందికరంగా మారింది. దీంతో ఆఫీసు రెండోవైపున కోట్లా మార్గ్ దారి గుండా రాకపోకలు సాగించేలా ఏర్పాట్లు చేశారు. ప్రధాన ద్వారాన్ని కోట్లామార్గ్ వైపు నిర్మించి, పార్టీ చిరునామాగా కోట్లా మార్గ్ ఉండేలా చూసుకున్నారు. 2004-14 మధ్య తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం సహా యూపీఏ ప్రభుత్వ హయాంలో తీసుకున్న పలు కీలక నిర్ణయాలకు 24, అక్బర్ రోడ్ కీలక వేదికగా నిలిచింది. 47 ఏళ్లగా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంగా ఉంది.

లాస్ ఏంజెలెస్‌లో 10కి పెరిగిన మరణాలు

» మరో రెండు ప్రాంతాల్లో కొత్తగా కార్చిచ్చు

లాస్ ఏంజెలెస్: లాస్ ఏంజెలెస్‌లో కార్చిచ్చు కారణంగా సంభవించిన మరణాల సంఖ్య పదికి పెరిగింది. 10వేలకు పైగా ఇళ్లు, భవనాలు, ఇతర నిర్మాణాలు దగ్ధమయ్యాయి. మరోవైపు, కాలిఫోర్నియాలోనే కొత్తగా మరో రెండు ప్రాంతాల్లో(కెన్నెత్, శాన్ ఫెర్నాండో) కార్చిచ్చు మొదలైంది. గాలులు బలంగా వీస్తున్నందున ఈ కార్చిచ్చు వేగంగా ఇతర ప్రాంతాలకు వ్యాపించే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు. సమీప ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. పసిఫిక్ పాలిసేడ్స్ ప్రాంతంలో 19వేల ఎకరాల్లో కార్చిచ్చు విస్తరించింది. లాస్ ఏంజెలెస్ చరిత్రలోనే ఇది అతి విధ్వంసకరమైన కార్చిచ్చు అని అధికారులు పేర్కొన్నారు.

అవినీతికి తావులేకుండా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు పరిష్కరించండి: కూనంనేని

హైదరాబాద్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ఎల్‌ఆర్‌ఎస్ కింద దరఖాస్తులు చేసుకుని ఇప్పటికే అయిదేళ్లు దాటిపోయిందని, అవినీతికి తావులేకుండా త్వరితగతిన వాటిని పరిష్కరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. తమ ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం మధ్యతరగతి ప్రజలు ఎల్‌ఆర్‌ఎస్ కింద దరఖాస్తు చేసుకున్నారని, ఏళ్ల తరబడి అవి పెండింగ్‌లో ఉన్నాయని శుక్రవారం ఒక ప్రకటనలో ఆయన తెలిపారు.

నిర్మాణంలోని 11 విల్లాలు నేలమట్టం

హైదరాబాద్ నెక్నాంపూర్ పెద్ద చెరువులో కూల్చేసిన హైడ్రా

ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో నిర్మాణం.. హెచ్చరికలు బేఖాతరు

హైదరాబాద్ సిటీ, జనవరి 10(ఆంధ్రజ్యోతి): రాజధాని హైదరాబాద్‌లో హైడ్రా మరోసారి యంత్రాలకు పనిచెప్పింది. చెరువుల ఆక్రమణదారులపై ఉక్కుపాదం మోపింది. మణికొండ మునిసిపాలిటీ పరిధి నెక్నాంపూర్ పెద్ద చెరువులో నిర్మాణంలో ఉన్న విల్లాలను శుక్రవారం నేలమట్టం చేసింది. అనుమతులు రద్దు చేసినా.. చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల పరిధిలో పనులు కొనసాగిస్తుండడంతో చర్యలు తీసుకుంది. అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు రావడంతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ నెక్నాంపూర్ పెద్ద చెరువు ప్రాంతంలో పరిశీలించారు. అనంతరం చర్యలకు ఆదేశించారు. మరునాడే చెరువు వద్దకు చేరుకున్న అధికారులు కూల్చివేతలు ప్రారంభించారు. 13 విల్లాలకు గాను 11 పడగొట్టారు. రెండింటికి సంబంధించి కేసు ఉండడంతో కోర్టు దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని రంగనాథ్ తెలిపారు. కాగా, పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్‌లో 400 చదరపు గజాల విస్తీర్ణంలో ఒక్కో విల్లాను నిర్మిస్తున్నారు. గతంలోనే కొన్నిటిని సాగునీటి, పురపాలక అధికారులు కూల్చేశారు. తదుపరి నిర్మాణం చేపట్టవద్దని నోటీసులిచ్చారు. కొన్నాళ్లు ఆపేసినా.. మళ్లీ పారంభించారు. స్థానిక అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు హైడ్రా దృష్టికి తీసుకెళ్లారు. రంగంలోకి దిగిన అధికారులు పూర్తిగా పరిశీలించి.. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో నిర్మిస్తున్నట్లుగా నిర్ధారించుకుని విల్లాలను నేలమట్టం చేశారు.

4 నెలల్లో దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్‌కు పరిష్కారం

దుర్గం చెరువు పూర్తి నిల్వ సామర్థ్యం (ఎఫ్‌టీఎల్) వివాదానికి నాలుగు నెలల్లో శాశ్వత పరిష్కారం చూపుతామని రంగనాథ్ తెలిపారు. నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్, సర్వే ఆఫ్ ఇండియా, సర్వే ఆఫ్ తెలంగాణ, రెవెన్యూ, సాగునీటి, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ తదితర ప్రభుత్వ శాఖలతో పాటు ఐఐటీ, బిట్స్ పిలానీ, జేఎన్‌టీయూ ఇంజనీర్లనూ ఎఫ్‌టీఎల్ నిర్ధారణలో భాగస్వాములను చేస్తామన్నారు. దుర్గం చెరువు పరిసరాల్లోని ఆరు కాలనీల వాసులతో శుక్రవారం హైడ్రా కార్యాలయంలో రంగనాథ్ సమావేశమయ్యారు. కాగా, దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్‌ను నిర్ణయిస్తూ హెచ్ఎండీఏ ఇచ్చిన ప్రాథమిక నోటిఫికేషన్‌పై స్థానికులు హైకోర్టుకు వెళ్లారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు కాలనీల వాసులతో సమావేశమైన రంగనాథ్.. వారి అభిప్రాయం తెలుసుకున్నారు. వారి వాదనలు రికార్డు చేశారు. ఎఫ్‌టీఎల్‌పై ఒక్కో విభాగం ఒక్కో లెక్క చెబుతోందని, 65.12 ఎకరాలలో చెరువు ఉండగా.. రెండు, మూడు రెట్లు పెరిగినట్లు చూపుతున్నారని, హైదరాబాద్‌లోని ఇతర ప్రాంతాల్లో చెరువులు మాయమైతే ఇక్కడ మాత్రం విస్తీర్ణం పెరుగుతోందని కాలనీల వాసులు తెలిపారు. హుడా అనుమతితో లే అవుట్ వేసినా తమను ఆక్రమణదారులుగా భావిస్తున్నారని, అవసరాల కోసం నివాసాలు అమ్ముకునే పరిస్థితి లేదన్నారు. 2000 సంవత్సరంలో భారీ వర్షాలకు చెరువు నిండి చుట్టుపక్కల నీరు నిలిచినంత మేర ఎఫ్‌టీఎల్‌గా చెబుతున్నారని, దీంతో వివాదం మొదలైందని పేర్కొన్నారు. ఇన్నేళ్లయినా ప్రభుత్వ విభాగాలు పట్టించుకోవడం లేదన్నారు. వారి అభ్యంతరాలు/అభిప్రాయాలు స్వీకరించిన రంగనాథ్.. శాస్త్రీయ అధ్యయనం చేసి ఎఫ్‌టీఎల్ నిర్ధారిస్తామన్నారు.



'తాతల'నాటి బ్యాచ్!

ఆత్మీయ సమ్మేళనం

ఇరవై ఏళ్ల తర్వాతో... ముప్పై ఏళ్ల తర్వాతో పూర్వ విద్యార్థులు కలుసుకుంటే అదే అద్భుతం అంటారు! మరి.. ఏకంగా 64 ఏళ్ల తర్వాత ఓ బ్యాచ్ సమావేశమైతే దాన్ని ఏ మాటలతో వర్ణించగలం? అవును.. వాళ్లందరికీ ప్రస్తుతం దాదాపు 80-82 ఏళ్లు ఉంటాయి. 64 ఏళ్ల తర్వాత మళ్లీ కలుసుకున్నారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ ప్రభుత్వ బాలుర పాఠశాలకు చెందిన 1950-60 విద్యాసంవత్సరానికి చెందిన హయ్యర్ సెకండరీ స్కూల్ (హెచ్ఎస్‌సీ) పూర్వ విద్యార్థులు శుక్రవారం అంకాపూర్‌లో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు! బోసినవ్వులతో పలకరించుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు.

\- ఆర్మూర్ రూరల్

కేటీఆర్.. ఏది లుచ్చా పని?

- సీఎం రేవంత్ గ్యారెంటీలు అమలు చేయడమా?
- లేక మీరు అవినీతికి పాల్పడడమా?: సంపత్‌కుమార్

హైదరాబాద్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): "సీఎంను పట్టుకుని కేటీఆర్ లుచ్చా సీఎం అని మాట్లాడుతున్నడు. ఏది లుచ్చా పని? సీఎం రేవంత్ రెడ్డి ఆరు గ్యారెంటీలను అమలు చేయడం, రైతు రుణమాఫీ చేయడం, మెస్ చార్జీలు పెంచడమనా? లేక కాళేశ్వరం ప్రాజెక్టు, ఫార్ములా ఈ రేసు, ధరణిల్లో కేటీఆర్ అవినీతికి పాల్పడడం, ఫోన్ ట్యాపింగ్, ఔటర్ రింగ్ రోడ్డును అమ్ముకోవడమా? బేరీజు వేసుకుని ఏది లుచ్చాపనో చెప్పాలి" అని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం గాంధీభవన్‌లో మీడియాతో సంపత్‌కుమార్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ కను సైగ చేస్తే కాంగ్రెస్ కార్యకర్తల ఆగ్రహానికి కేటీఆర్ మసైపోతాడని అన్నారు. కేటీఆర్ ఒళ్లు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని హెచ్చరించారు.





ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ

ప్రకృతి హెచ్చరిక!

హిమాలయ దేశాలు టిబెట్, నేపాల్‌ను ఇటీవల కుదిపేసిన భారీ భూకంపం పెద్దసంఖ్యలో ప్రజల ప్రాణాలను హరించింది, తీవ్ర ఆర్థిక నష్టాన్ని మిగల్చింది. టిబెట్‌లో మరణాలసంఖ్య విషయంలో చైనా మీడియా చెబుతున్న నూటయాభైలోపు లెక్కలనే మనం నమ్మాలి కానీ, తీవ్రతను బట్టి చూస్తే ఆ సంఖ్య అనంతరకాలంలో కచ్చితంగా మరింత పెరిగే ఉంటుంది. రిక్టర్ స్కేల్‌మీద 7.1 తీవ్రతతో పదికిలోమీటర్ల లోతున పుట్టిన ఈ భూకంపం నేపాల్‌ను వణికించింది, బిహార్‌ను భయపెట్టింది, చివరకు దేశరాజధాని ఢిల్లీ సైతం ఆ ప్రకంపనలను భరించింది. భూకంప కేంద్రంనుంచి వందలాది కిలోమీటర్ల వరకూ ఆ ప్రభావం కనిపించింది. వెంటవెంటనే సంభవించిన మరో రెండు అతి పెద్ద కుదుపులు సైతం జనాన్ని భయపెట్టాయి. భారతదేశానికి సన్నిహితంగా భూకంప కేంద్రం ఉండివుంటే, ఆర్థిక, ప్రాణనష్టాలు అధికంగా ఉండేవనడానికి సందేహం అక్కరలేదు. ప్రపంచంలో అతిపెద్ద జల విద్యుత్ కేంద్రాన్ని బ్రహ్మపుత్రమీద నిర్మించబోతున్నట్టు ప్రకటించిన వెంటనే టిబెట్‌లో సంభవించిన ఈ భూకంపం చైనా కళ్ళు తెరిపించాలన్నది పర్యావరణ వేత్తల కోరిక.

త్రీగోర్జెస్ డ్యామ్‌కు మూడురెట్ల భారీ జలవిద్యుత్ ప్రాజెక్టు బ్రహ్మపుత్రమీద ప్రకటించి, దానికి 137 బిలియన్ డాలర్లు ఖర్చుచేయబోతున్నట్టు చైనా ఇటీవల చేసిన ప్రకటన భారత్‌కు తీవ్ర ఆందోళన కలిగించింది. దీనిద్వారా అరవై గిగావాట్ల విద్యుత్ చైనాకు చేరవచ్చు, అందులో టిబెట్ వాటాలు కోటాలు ఉండవచ్చు కానీ, మనకు పట్టుమని పాతికకిలోమీటర్ల దూరంలో ఈ డ్యామ్ ఉండటం కచ్చితంగా భయపెట్టే అంశమే. ఈ ప్రాజెక్టు నిర్మించబోతున్న హిమాలయప్రాంతం భూకంపాలకు పుట్టినిల్లని చైనాకు తెలియకపోదు. ఇప్పటికే అక్కడ తాను నిర్మించిన జలవిద్యుత్ ప్రాజెక్టుల్లో కనీసం మూడోవంతు భూకంప ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయని ఆరేళ్ళ క్రితం ఆ దేశం ఆదేశించిన అధ్యయనమే స్పష్టంచేసింది. కానీ, హిమాలయాల్లో ఉన్న అపార జలశక్తిని ఒడిసిపట్టి విద్యుత్‌ను సృష్టించాలన్న తపనతో భారత్, చైనాలు పోటీపడి జలవిద్యుత్ ప్రాజెక్టులను కట్టుకుంటూ పోతున్నాయి.

చిన్నచితకా కట్టడాలను అటుంచితే, భూకంపాలకు నిలయమైన చోట ఒక అతిభారీస్థాయి ప్రాజెక్టు కట్టాలని చైనా ఎలా అనుకుంటోందో అర్థం కాదు. 2015లో నేపాల్‌లో 9వేలమంది ప్రాణాలు హరించిన భూకంపం, దాదాపు ఐదోవంతు జలవిద్యుత్ ప్రాజెక్టులను ధ్వంసం చేసి, సుదీర్ఘకాలం నిరుపయోగంగా మార్చిన విషయం తెలిసిందే. ఇటువంటి గతానుభవాలు అనేకం ఉన్నప్పటికీ ఒక ప్రమాదకరమైన ప్రాంతంలో ఈ అతి భారీ నిర్మాణాన్ని ప్రకటించి, తన కొత్త విద్యుత్ ప్రాజెక్టుతో ఎవరికీ ఏ భయమూ అక్కరలేదని చైనా అభయం ఇవ్వడం ఆశ్చర్యకరం. ప్రాజెక్టును కూల్చేసే స్థాయి భూకంపం వస్తేగిస్తే నష్టపోయేది భారత్, బంగ్లాదేశ్‌లే కదా అని అది అనుకుంటున్నదేమో. ఇప్పటికే ఉన్న రిజర్వాయర్లకు వయసు మీద పడుతున్నందున చైనా కొత్త వాటికోసం వెంపర్లాడుతున్నట్టుంది. కర్బన ఉద్గారాలను తగ్గించాల్సిన లక్ష్యం కూడా దానిని ఈ భారీ ప్రాజెక్టుకు వెంట తరుముతూండవచ్చు. ఇంధన అవసరాలు కాక, ఇతరత్రా ఉద్దేశాలేమీ లేకుంటే ఈ భారీ డ్యామ్ స్థానంలో పలు మధ్యతరహా హైడ్రోప్రాజెక్టులతో చైనా తన విద్యుత్ అవసరాలను సులువుగా తీర్చుకోగలదు. విద్యుత్ సృష్టికే కాక, ప్రతీకారం తీర్చుకోవడానికి కూడా ఈ డ్యామ్ ఉపకరిస్తుందేమోనన్న అనుమానం బ్రహ్మపుత్ర పరీవాహక దిగువదేశాలకు ఉండటంలో తప్పేమీ లేదు.

టిబెట్‌లో 1950లో 8.6 తీవ్రతతో సంభవించిన భూకంపం ఈ ప్రాంతం ఎంత సున్నితమైనదో, ప్రమాదకరమైనదో తెలియచెబుతుంది. ఆధునిక పరిజ్ఞానం ఎంతగా ఉపయోగించినా, ఈ ప్రాంతంలో ప్రాణ నష్టాన్ని, ఆస్తినష్టాన్ని నివారించడం అంతసులభం కాదని ఇప్పుడు టిబెట్‌లో సంభవించిన భారీ భూకంపం హెచ్చరిస్తోంది. భూకంప కేంద్రం, బ్రహ్మపుత్ర, ఈ ప్రాజెక్టు స్థలం సన్నిహితంగా ఉన్నాయంటూ పలుమ్యాప్‌లు తెలియచెబుతున్నాయి. ప్రాజెక్టుమీద భారతదేశం తన అభ్యంతరాన్ని వ్యక్తంచేసినప్పుడు, దాని భద్రత గురించి, ప్రమాణాల గురించి చైనా చాలా కబుర్లుచెప్పింది. ఎట్టిపరిస్థితుల్లోనూ ఎవరికీ నష్టంవాటిల్లనివ్వబోనని హామీ ఇచ్చింది. కానీ, అది ఎంత అద్భుతంగా, బలంగా ఈ ప్రాజెక్టు కట్టినప్పటికీ, కాళ్ళకింద భూమి సులువుగా కదిలిపోవచ్చునని ఈ భూకంపం హెచ్చరిస్తోంది.

విశ్వవిద్యాలయాల జాతీయీకరణ!

అన్ని ప్రభుత్వాలూ వాస్తవంగా గరిష్ఠ అధికారాలను అపేక్షిస్తాయి. తమకు తాము మరిన్ని నియంత్రణాధికారాలను ఇచ్చుకునేందుకు చట్టాలు చేస్తాయి. ప్రభుత్వాలు ఎందుకు ఇలా ఆరాటపడతాయి? దేశానికి, ప్రజలకు ఏది మేలు చేస్తుందో తమకు మాత్రమే తెలుసునని విశ్వసించడమే ఆ ఆరాటానికి కారణం.

కొంతమంది వ్యక్తులకు అటువంటి విశ్వాసమే చాలా గాఢంగా ఉంటుంది. దాన్ని 'రక్షకుడు' లేదా మెస్సయ్య భావం అంటారు. అదొక మానసిక స్థితి. అటువంటి మనస్తత్వం ఉన్నవారు సమస్యలు అన్నిటినీ తానే పరిష్కరించగలనని, ప్రజలను తానే 'రక్షించ'గలనని విశ్వసిస్తారు. ఇది మితిమీరితే తాము జైవికంగా పుట్టలేదని 'భగవంతుడే తనను పంపాడు' అన్న విపరీత ఆలోచన లేదా భ్రాంతికి లోనవుతారు.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

అసలు విషయానికి వస్తాను. వైస్ ఛాన్సలర్ల నియామకాలకు సంబంధించిన నియమ నిబంధనలను యూజీసీ (యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ – విశ్వవిద్యాలయ నిధుల సంఘం) మార్చివేసింది. వీసీల ఎంపిక ప్రక్రియకు సంబంధించిన కొత్త ముసాయిదా నిబంధనలను కూడా జారీ చేసింది. వాటిపై అభిప్రాయాలు, సలహాలు, సూచనలను ఆహ్వానించింది.

ప్రస్తుతం అనేక చట్టాలు ఒకటి లేదా అంతకంటే ఎక్కువ విశ్వవిద్యాలయాల స్థాపనకు అధికారాల నిస్తున్న అనేక చట్టాలు సంబంధిత రాష్ట్ర గవర్నర్‌ను విశ్వవిద్యాలయ ఛాన్సలర్‌గా చేస్తున్నాయి. కేంద్రీయ విశ్వవిద్యాలయాలను నెలకొల్పిన కొన్ని చట్టాలు రాష్ట్రపతిని విజిటర్‌గా నిర్దేశించాయి. సరే, రాష్ట్ర గవర్నర్ క్రియాశీల రాజకీయాల నుంచి నిష్క్రమించిన నాయకుడో లేక ప్రముఖ పౌరుడో అయి ఉండడం కద్దు. గవర్నర్ రాజ్యాంగ బద్ధంగా తన విధులు నిర్వర్తించాలి. వీసీల ఎంపికకు, ప్రస్తుత నిబంధనల ప్రకారం ఒక సెర్చ్ కమ్ సెలక్షన్ కమిటీని నియమిస్తారు. ఈ కమిటీలో గవర్నర్, రాష్ట్ర ప్రభుత్వం, విశ్వవిద్యాలయ సెనేట్, విశ్వవిద్యాలయ సిండికేట్ నామినీ (ప్రతినిధి)లు ఉంటారు. ఈ కమిటీ విస్తృత ప్రాతిపదికన ప్రజాస్వామికంగా ఉంటుంది. అంతిమ ఎంపిక నిర్ణయం ఛాన్సలర్ / గవర్నర్‌దే అయినప్పటికీ గతంలో గవర్నర్ సాధారణంగా రాష్ట్ర ప్రభుత్వ 'సహాయం, సలహా'పై నిర్ణయం తీసుకునేవారు. దురదృష్టవశాత్తు ఈ సదాచరణ గత దశాబ్దంలో అంతరించిపోయింది. గవర్నర్లు తమ వ్యక్తిగత విచక్షణతో వీసీలను నియమించడం ప్రారంభమయింది.

రోజులు మారిపోయాయి –మరింత అధ్వాన్నంగా! ఇప్పుడు గవర్నర్ పదవులలో ఆరెస్సెస్ / బీజేపీ భావజాల విధేయులు లేదా విశ్వసనీయ విశ్రాంత సివిల్ అధికారులు లేదా సైనికాధికారులను మాత్రమే నియమిస్తున్నారు.

ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో కేంద్ర ప్రభుత్వ వైస్రాయ్‌గా వ్యవహరిస్తూ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇబ్బందులకు గురి చేయాలని గవర్నర్‌ను ఆదేశిస్తున్నారు. పర్యవసానంగా రాష్ట్రాలలో ద్వంద్వ ప్రభుత్వం ఉంటోంది: ఎన్నికైన ప్రభుత్వం, ఎన్నిక కాని గవర్నర్. రాష్ట్ర గవర్నర్ రాష్ట్ర ప్రభుత్వ 'సహాయం, సలహా'తో నిర్ణయాలు తీసుకోవాలన్న భారత రాజ్యాంగ నిబంధనను గాలికి వదిలివేస్తున్నారు. శాసనసభ సమావేశాల్లో సంప్రదాయం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ప్రసంగాన్ని చదవడానికి నిరాకరిస్తున్న గవర్నర్లను చూడండి. రాష్ట్ర ప్రభుత్వాన్ని ముఖ్యంగా ముఖ్యమంత్రిని బహిరంగంగా విమర్శిస్తున్న గవర్నర్లను చూడండి. రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి లేదా పోలీస్ చీఫ్‌ను రాజ్‌భవన్‌కు పిలిచి ముఖ్యమంత్రిని ఉపేక్షించి వారికి నేరుగా ఆదేశాలు ఇస్తున్న గవర్నర్లను చూడండి. రాష్ట్ర ప్రభుత్వ సచివాలయానికి తెలియజేయకుండా జిల్లాల్లో పర్యటిస్తూ జిల్లా అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ వారితో చర్చలు జరుపుతున్న గవర్నర్లను చూడండి. ఈ ఉదంతాలు స్పష్టం చేస్తున్నదేమిటి? రాష్ట్రాలలో ముఖ్యంగా ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధంగా ద్వంద్వ ప్రభుత్వం తనకుతానే నెలకొంటోందని కాదూ?



వైస్ ఛాన్సలర్ల నియామకాలకు సంబంధించి యూజీసీ జారీ చేసిన ముసాయిదా నిబంధనలను రాష్ట్రాలు నిర్ద్వంద్వంగా తిరస్కరించాలి. వాటికి వ్యతిరేకంగా రాజకీయంగా, న్యాయమార్గాలలో పోరాడాలి. ఉపాధ్యాయులు, విద్యార్థులు ముందుకువచ్చి నిరసనలు తెలపాలి. ప్రజా పాలన వ్యవస్థలు అన్నిటిలో ద్వంద్వ ప్రభుత్వం అనేది పాదుకుపోతే దాని స్థానంలో ఒక సంపూర్ణ నిరంకుశ పాలకుడు ప్రభవించేందుకు ఎంతో కాలం పట్టదు.

'డిగ్రీ' అంటే యూజీసీ నిర్దేశించిన డిగ్రీయే అవుతుందని, ఒక చట్టం ద్వారా స్థాపితమైన విశ్వవిద్యాలయం దానిని ప్రదానం చేస్తుందని యూజీసీ చట్టంలోని సెక్షన్ 22 పేర్కొంది. కొత్త ముసాయిదా నిబంధనలు సెర్చ్ కమ్ సెలెక్షన్ కమిటీ ఏర్పాటుకు, వీసీల నియామకానికి పద్ధతులను నిర్దేశించింది. ఈ కొత్త పద్ధతి ప్రకారం ఛాన్సలర్, యూజీసీ, అపెక్స్ బాడీ (విశ్వవిద్యాలయ సెనేట్/ సిండికేట్/ బోర్డ్ ఆఫ్ మేనేజ్‌మెంట్) నామినీలతో కూడిన ముగ్గురు సభ్యుల సంఘంగా సెర్చ్ కమ్ సెలక్షన్ కమిటీ ఉంటుంది. ఇది 35 పేర్లతో కూడిన ఒక జాబితాను రూపొందిస్తుంది. ఆ జాబితా నుంచి ఒకరిని వీసీగా ఛాన్సలర్ నియమిస్తారు. ఈ నిబంధనలను ఉల్లంఘించిన విశ్వవిద్యాలయానికి వ్యతిరేకంగా డిగ్రీ ప్రోగ్రామ్‌లు ఆఫర్ చేయకుండా, యూజీసీ కార్యక్రమాలలో పాల్గొనకుండా ఆంక్షలు విధిస్తారు. అసలు యూజీసీ చట్టం కింద విశ్వవిద్యాలయాల జాబితా నుంచి దాన్ని తొలగిస్తారు. ఇతర శిక్షాత్మక చర్యలు కూడా దానికి వ్యతిరేకంగా తీసుకుంటారు.

మరింత స్పష్టంగా చెప్పాలంటే సదరు విద్యాసంస్థ విశ్వవిద్యాలయంగా అస్తిత్వంలో ఉండడం ఆగిపోతుంది. వైస్ ఛాన్సలర్ ఎంపిక, నియమాకంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఎటువంటి పాత్ర ఉండదన్న వాస్తవాన్ని గమనించారా? వైస్ ఛాన్సలర్ యూజీసీ వైస్రాయ్ అవుతాడు. యూజీసీ చైర్‌పర్సన్, ఇతర సభ్యులను కేంద్ర ప్రభుత్వం నియమిస్తుంది వారిని తొలగించే అధికారాలు కూడా దానికే ఉన్నాయి.

ఒక విశ్వవిద్యాలయ పరిపాలనకు ఇద్దరు వైస్రాయ్‌లు ఉంటారు. ఒకరు గవర్నర్ / ఛాన్సలర్ కాగా మరొకరు వైస్–ఛాన్సలర్. ముసాయిదా నిబంధనలను నోటిఫై చేసిన పక్షంలో జరిగేదేమిటి? రాష్ట్ర ప్రజల ప్రయోజనార్థం విశ్వవిద్యాలయాన్ని నెలకొల్పి, సొంత ఆర్థిక వనరుల నుంచి దాని నిర్వహణకు నిధులు కేటాయించే రాష్ట్ర ప్రభుత్వ హక్కులను ఆ నిబంధనలు అపహరిస్తాయి.

మరింత స్పష్టంగా చెప్పాలంటే ముసాయిదా నిబంధనలు విశ్వవిద్యాలయాలను జాతీయీకరణ చేస్తాయి. దేశంలోని సమస్త ఉన్నత విద్యా సంస్థల నిర్వహణను 'మెస్సయ్య' తన నియంత్రణలోకి తీసుకుంటాడు. 'ఒక దేశం–ఒకే ప్రభుత్వం' అన్న భారతీయ జనతా పార్టీ విధానానికి అనుగుణంగా వ్యవస్థల శీఘ్రతర కేంద్రీకరణకు విశ్వవిద్యాలయాల జాతీయీకరణ మరో ఉదాహరణగా నిలుస్తుంది. సమాఖ్య విధానం, రాష్ట్రాల హక్కులపై ఇది చాలా ఘోరమైన దాడి కాదూ?

ఈ ముసాయిదా నిబంధనలను రాష్ట్రాలు నిర్ద్వంద్వంగా తిరస్కరించాలి. వాటికి వ్యతిరేకంగా పోరాడాలి– రాజకీయంగా, న్యాయమార్గాలలో.. విశ్వవిద్యాలయాల జాతీయీకరణను వమ్ము చేసేందుకు ఉపాధ్యాయులు, విద్యార్థులు ముందుకువచ్చి నిరసనలు తెలపాలి. లక్ష్య పరిపూర్తి దాకా నిరంతర జాగరూకతతో ఉండాలి. ప్రజా పాలన వ్యవస్థలు అన్నిటిలో ద్వంద్వ ప్రభుత్వం అనేది సురక్షితమైతే దాని స్థానంలో రాజరికం లేదా ఒక నియంతృత్వ పాలకుడు ఉద్భవించేందుకు ఎంతో కాలం పట్టదు. కనుక ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలి.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

మన్మోహన్: కాంతులు, కళంకాలు

'చరిత్ర తీర్పు తనపై చాలా ఉదారంగా ఉంటుందని' ఇటీవల కీర్తిశేషుడు అయిన డాక్టర్ మన్మోహన్ సింగ్ 2014లో ప్రధానమంత్రిగా తన చివరి పత్రికా గోష్ఠిలో ఉద్ఘాటించారు. ఆయన ఆత్మవిశ్వాసపూరిత వ్యాఖ్యను, అప్పట్లో మీడియా తన పట్ల వ్యవహరిస్తున్న తీరుపై ఒక పరోక్ష ఆక్షేపణగా అర్థం చేసుకోవచ్చు. మరి ఇప్పుడు అదే మీడియా మన్మోహన్ కీర్తిగానం బ్రహ్మాండంగా చేస్తోంది. వివిధ పత్రికలు, పలువురు ప్రముఖులు దివంగత ప్రధాన మంత్రికి అర్పించిన నివాళులు, చేసిన ప్రశంసలు చరిత్రకారుడు అయిన ఈ వ్యాసకర్తను చకితుడిని చేశాయి. ఆ పొగడ్తలు పూర్తిగా యోగ్యమైనవేనా? వాటిలో సత్యాసత్యాలు ఏమిటి? అన్న ప్రశ్నలను లేవనెత్తాయి. మన్మోహన్ నిజంగానే విజ్ఞుడా? సర్వజ్ఞుడా? ఉత్తమ రాజనీతిజ్ఞుడా?



మన్మోహన్ సింగ్ అర్థశాస్త్ర విద్వత్తు ప్రగాఢమైనది. ఆర్థిక సంస్కర్తగా ఆయన సాఫల్యాలు గణనీయమైనవీ, కలకాలం నిలిచేవీ అనడంలో సందేహం లేదు. ప్రధానమంత్రిగా ఆయన పాలనా విజయాలు అనిశ్చితమైనవి. అనుద్దేశపూర్వకంగా ప్రభుత్వంలో నిరంకుశ విధానాలు పెచ్చరిల్లేందుకు; భారతదేశ అతి పురాతన రాజకీయ పార్టీలో విధేయతా సంస్కృతి, కుటుంబ ప్రాధాన్యం తిరుగులేని రీతిలో వర్ధిల్లేందుకు మనఃపూర్వకంగా ఆయన తోడ్పడ్డారు.

మన్మోహన్ సింగ్ తన సుదీర్ఘ జీవితాన్ని ఒక విద్వజ్జుడుగా, ప్రభుత్వంలో ఒక ఆర్థికవేత్తగా, ఒక రాజకీయవేత్తగా గడిపారు. మరణానంతరం ఆయన గురించి వెల్లువెత్తిన ప్రశంసల్లో అత్యధిక భాగం ప్రభుత్వ ఆర్థికవేత్తగా ఉన్న దశపైనే కేంద్రీకృతమయ్యాయి. ముఖ్యంగా కేంద్ర ఆర్థికమంత్రిగా ఆయన నిరుపమాన సేవల గురించి అవి విపులంగా పేర్కొన్నాయి. నిజమే, లైసెన్స్– పర్మిట్– కోటా రాజ్‌ను కూల్చివేయడంలో మన్మోహన్ కీలకపాత్ర వహించారు. రాజ్యవ్యవస్థ శృంఖలాల నుంచి భారత ఆర్థిక వ్యవస్థను విముక్తం చేశారు దరిమిలా మూడు దశాబ్దాలుగా ఆర్థికాభివృద్ధి సుస్థిరంగా సాగుతోంది; పరిశ్రమల వ్యవస్థాపనా సామర్థ్యం ఇతోధికంగా పెరిగింది; కోట్లాది ప్రజలు పేదరికం కోరల నుంచి బయటపడ్డారు.

ఇది నిజంగా విశేష ప్రగతే. మన్మోహన్ దార్శనికత వల్లే అది సాధ్యమయిందని సరిగానే ఆయన్ను ప్రస్తుతిస్తున్నారు. అయితే మన్మోహన్ సాధించిన ఈ బృహత్ విజయం వెనుక ఆయనకు అప్పటి ప్రధాన మంత్రి పీవీ నరసింహారావు అందించిన అచంచల తోడ్పాటు ఉందన్న విషయాన్ని ఎవరూ విస్మరించకూడదు. పార్లమెంటుకు ప్రజలు ఎన్నుకోని ఆర్థికవేత్తను కేబినెట్ మంత్రిగా నియమించిన ఘనత నిస్సందేహంగా పీవీదే. ప్రతిపక్షాల నుంచి, సొంత పార్టీలోని వ్యతిరేకుల నుంచి ఎదురైన కష్టనష్టాలను పీవీ మద్దతుతో మన్మోహన్ అధిగమించారు. మన్మోహన్‌తో కలిసి లేదా ఆయన మార్గదర్శకత్వంలో ప్రతిభావంతులు అయిన కొంతమంది ఆర్థికవేత్తలు, సివిల్ సర్వీస్ అధికారులు మన ఆర్థిక వ్యవస్థలో మౌలిక మార్పులు సాధించారు.

మన్మోహన్ సింగ్ యాదృచ్ఛికంగా ఆర్థికమంత్రి అయ్యారు. 1991లో రాజీవ్ హత్యానంతరం పీవీ ప్రధానమంత్రి అయ్యారు. విదేశీ మారక ద్రవ్య నిల్వలు పూర్తిగా అడుగంటిపోయాయి. ఆ క్లిష్ట పరిస్థితి నుంచి దేశాన్ని గట్టెక్కించేందుకు పీవీ తొలుత రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ ఐ.జి.పటేల్‌ను ఆర్థికమంత్రిగా నియమించేందుకు సంకల్పించారు. అయితే పటేల్ అందుకు నిరాకరించడంతో ఆర్థికమంత్రి అయ్యే అవకాశం మన్మోహన్‌కు లభించింది. విద్వజ్జుడుగా మన్మోహన్ ప్రత్యేకతలు పూర్తిగా ఆయన సొంతం. మన్మోహన్ సాధించిన విజయాల ప్రాముఖ్యతను గుర్తించేందుకు కేంబ్రిడ్జిలో ఆయన సమకాలికులు అయిన అమర్త్యసేన్, జగదీష్ భగవతి మేధో విజయాలతో వాటి తారతమ్యాలను చూడాలి. సేన్, భగవతి కులీన విద్వత్ కుటుంబాలలో జన్మించారు. సేన్ కుటుంబం రవీంద్రనాథ్ టాగోర్‌కు సన్నిహితులైన విద్వజ్జుల కుటుంబం నుంచి వచ్చారు. సేన్‌కు 'అమర్త్య' అని నామకరణం చేసింది కూడా టాగోరే కావడం విశేషం. భగవతి ఒక హైకోర్టు న్యాయమూర్తి కుమారుడు. కులీన సామాజిక నేపథ్యాల కారణంగా సేన్, భగవతి సహజంగానే తమ ఉన్నత విద్యాభ్యాసానికి కేంబ్రిడ్జి వెళ్లారు. మరి మన్మోహన్ ఒక సాధారణ మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. దేశ విభజన పరిణామాలతో ఆయన కుటుంబం బాగా చితికిపోయింది. తీవ్ర ప్రతికూల పరిస్థితులలో ఎంతో కష్టపడి చదువుకున్న మన్మోహన్‌కు ఒక ప్రతిష్ఠాత్మక పాశ్చాత్య విశ్వవిద్యాలయానికి వెళ్లడమనేది ఒక అసాధ్య విషయం. అయితే మన్మోహన్ కేంబ్రిడ్జికి వెళ్లగలిగారు. అక్కడ పట్టభద్రుడైన తరువాత ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో డి.ఫిల్ పట్టా పొందారు.

2009 తొలినాళ్లలో నేను ఒక నెల రోజుల పాటు న్యూఢిల్లీలో ఉన్నాను. ప్రధానమంత్రి మన్మోహన్‌తో సమావేశమయ్యాను. అంతకంటే ముఖ్యంగా ప్రభుత్వంలోను, వెలుపల ఆయనకు సన్నిహితులైన పలువురు అధికారులతో నేను సంభాషించాను. పెద్ద వయస్సు, అందునా, గుండెకు శస్త్ర చికిత్స చేయించుకున్న కారణంగా తదుపరి సార్వత్రిక ఎన్నికలలోగానే మన్మోహన్ సింగ్ గౌరవప్రదంగా రాజకీయాల నుంచి నిష్క్రమించడం శ్రేయస్కరమని ఆ అధికారులు అందరూ అభిప్రాయపడ్డారు. ప్రధాన మంత్రి పదవిలో కొనసాగుదలుచుకుంటే లోక్‌సభకు పోటీ చేసి గెలిస్తే ఆయన విశ్వసనీయత మరింతగా పెరుగుతుందని మన్మోహన్ అభిమాని ఒకరు పేర్కొన్నారు.



■ రామచంద్ర గుహ

గతానుగతం

అదే ఏడాది మన్మోహన్ రెండో పర్యాయం ప్రధాన మంత్రి అయ్యారు. రాజ్యసభలోనే సభ్యుడుగా ఆయన కొనసాగారు. మొదటి పర్యాయం ప్రధానిగా ఉన్నప్పుడే ఆయన తన పార్టీ అధినేత్రి పట్ల మితి మీరిన రీతిలో వినయ విధేయతలు చూపుతున్నారని నిశిత పరిశీలకులు గమనించారు. రెండోసారి ప్రధాన మంత్రి అయిన తరువాత ఆ విధేయత మరింతగా పెరిగింది. అది ఆయన నిర్వహిస్తున్న అత్యున్నత పదవి గౌరవానికి తగని విధంగా ఉండేది. ఇదిలా ఉండగా మన్మోహన్ ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు తీవ్రమయ్యాయి. బహిర్గతమైన వివిధ కుంభకోణాలలో కేంద్ర మంత్రుల పాత్ర ఉన్నట్టు రుజువయింది. వారిపై చర్య తీసుకోవడంలో మన్మోహన్ విఫలమయ్యారు. తనను ధిక్కరిస్తున్న మంత్రులను కూడా ఆయనేమీ చేయలేకపోయారు. మొదటి పర్యాయం ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు కొందరు ప్రముఖ విద్యావేత్తలతో నాలెడ్జ్ కమిషన్‌ను నియమించారు. అయితే మానవవనరుల అభివృద్ధి మంత్రి అర్జున్ సింగ్ ఆ కమిషన్‌కు ఎటువంటి అధికారాలు లేకుండా చేసి నీరుకార్చివేశారు. రెండో పర్యాయం ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు ప్రణబ్ ముఖర్జీని సుదీర్ఘకాలం ఆర్థికమంత్రిగా కొనసాగించారు. ప్రణబ్ హయాంలో అంతర్జాతీయ మార్కెట్లలో భారత్ ప్రాభవం క్షీణించిపోయింది. ఆర్థిక సంస్కరణల అనంతర కాలంలో మొట్టమొదటి 'అధ్వాన్న ఆర్థికమంత్రి' అన్న అప్రతిష్ఠను ప్రణబ్ మూటగట్టుకున్నారు.

వైదుష్యంలో మన్మోహన్‌కు అర్జున్ సింగ్ ఏ మాత్రం సాటి రారు. ఆర్థిక మంత్రిత్వ శాఖను ప్రణబ్ కంటే మన్మోహనే అత్యంత సమర్థతతో నిర్వహించారని మరి చెప్పనవసరం లేదు. అయినప్పటికీ భయపడే స్వభావం కారణంగా, లోక్‌సభకు ఎన్నికైన సహచర మంత్రులు తనను ధిక్కరిస్తున్నప్పటికీ మన్మోహన్ వారిని నియంత్రించలేకపోయారు. బహుశా, పార్టీ అధినేత్రితో సమస్యలు వస్తాయన్న భయంతో ఆయన మిన్నకుండిపోయేవారు. కేబినెట్ తీర్మానం నొకదాన్ని రాహుల్‌గాంధీ బహిరంగంగా చించివేసినప్పటికీ మన్మోహన్ మౌనం వహించారు. రాహుల్‌గాంధీ నాయకత్వంలో పనిచేసేందుకు తాను అమితంగా సంతోషిస్తానని మన్మోహన్ తన రెండో పదవీ కాలం తుదినాళ్లలో ప్రకటించారు. ఇలా బహిరంగంగా విధేయతను ప్రదర్శించడం ద్వారానే పార్టీలోను, ప్రభుత్వంలోను తన స్థానాన్ని పటిష్ఠం చేసుకోగలనని ఆయన భావించారేమో?!

అదొక తప్పుడు నిర్ణయం. అంతే కాదు విషాదకరమైన పొరపాటు కూడా. సోనియాకు మన్మోహన్ ఎంతగా రుణపడి ఉన్నారో సోనియా సైతం ఆయనకు అంతే రుణపడి ఉన్నారని చెప్పి తీరాలి. 2004లో ప్రధానమంత్రి అయ్యేందుకు అవకాశం వచ్చినప్పటికీ ఆమె ఆ అత్యున్నత బాధ్యతను చేపట్టేందుకు నిరాకరించారు. ప్రభుత్వంలో ఏనాడూ పని చేసిన అనుభవం లేని కారణంగా ప్రధాని పదవికి తాను అర్హురాలును కాననే విషయం ఆమెకు తెలుసు. కేబినెట్ సమావేశాల నిర్వహణ దక్షత తనకు లేదని, విధాన నిర్ణయాలు తీసుకోలేనని, విదేశీ ప్రభుత్వాధినేతలతో సమస్థాయిలో వ్యవహరించగల సామర్థ్యం తనకు లేదని ఆమెకు బాగా తెలుసు.

ప్రధానమంత్రి పదవీ బాధ్యతలు చేపట్టడం ద్వారా ఎటువంటి ఇబ్బందులకు లోనవకుండా సోనియాను మన్మోహన్ రక్షించారు. అయితే 2009లో యూపీఏ తిరిగి అధికారంలోకి వచ్చిన తరువాత అర్హతలు ఏ మాత్రం లేని తన తనయుడిని భావి ప్రధానమంత్రిగా చేసేందుకు సోనియా చేయవల్సినవి సంపూర్ణంగా చేశారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలో అత్యంత అనుభవజ్ఞుడు అయిన ప్రభుత్వాధికారి కావడంతో పాటు ప్రధానమంత్రి పదవిలో ఉన్న మన్మోహన్ సింగ్ రాహుల్ విషయంలో సోనియాకు బాసటగా నిలబడ్డారు. ప్రధానమంత్రి అయివుండి కూడా తన అధికారాలను నిర్ణయాత్మకంగా ఉపయోగించలేకపోవడంలో తన నిస్సహాయత్వాన్ని ఆయన బహిరంగంగా కనబరిచారు. మన్మోహన్ నిస్సహాయత్వం ప్రధానమంత్రి పీఠాన్ని అధిష్ఠించడంలో నరేంద్ర మోదీకి ఎంతగా సహకరించిందో భావి చరిత్రకారులే నిర్ణయించాలి. ప్రధాన మంత్రి ఒక బలహీన నాయకుడుగా కనిపించడంతో చాలా మంది ఓటర్లు దేశానికి శక్తిమంతమైన నాయకత్వాన్ని ఇవ్వగలనని నిశ్చితంగా వక్కాణించిన నరేంద్ర మోదీ వైపు మొగ్గారనడం సత్యదూరం కాదు. సామాజికంగా వెనుకబడిన నేపథ్యం నుంచి ప్రభవించిన నేత నరేంద్ర మోదీ. నెహ్రూ– గాంధీ కుటుంబానికి ప్రథమ ప్రాధాన్యమిచ్చే పార్టీగా కాంగ్రెస్‌ను ప్రజలు భావించారు. ఈ అంశాలు నరేంద్ర మోదీ ఉత్థానానికి విశేషంగా దోహదం చేశాయి.

మన్మోహన్ సింగ్ అర్థశాస్త్ర విద్వత్తు ప్రగాఢమైనది, ఆర్థిక సంస్కర్తగా ఆయన సాఫల్యాలు గణనీయమైనవీ, కలకాలం నిలిచేవీ అనడంలో సందేహం లేదు. అయితే ప్రధానమంత్రిగా ఆయన పాలనా విజయాలు, రాజకీయ వారసత్వం అనిశ్చితమైనవి. ద్వితీయ పర్యాయం ప్రధానమంత్రిగా ఆయన అనుద్దేశపూర్వకంగా ప్రభుత్వంలో నిరంకుశ విధానాలు పెచ్చరిల్లేందుకు; భారతదేశ అతి పురాతన రాజకీయ పార్టీలో విధేయతా సంస్కృతి, కుటుంబ ప్రాధాన్యం తిరుగులేని రీతిలో వర్ధిల్లేందుకు మనఃపూర్వకంగా ఆయన తోడ్పడ్డారు.

(వ్యాసకర్త చరిత్రకారుడు)

అలిశెట్టి కవిత పలికిన నగరజీవి వేదన

హైదరాబాద్ నగరాన్ని తమకు కనబడిన కోణంలో, అర్థమైన మేరకు ఎందరో కవులు రచనల్లో ప్రకటించారు. ఇక్కడి నేలకు సొంతమైన భాష, సంస్కృతులు తమ గుండెకు హత్తుకున్న తీరును హృద్యంగా వర్ణించిన వారున్నారు. అయితే నగరంలోని పేదరికం, శ్రమదోపిడి, చేతిలో పైసా లేని వాని పరిస్థితిని తనదైన రీతిలో అలిశెట్టి ప్రభాకర్ వెల్లడించాడు. నమ్మకమైన ఆదాయం లేకుండానే కుటుంబంతో సహా నగరంలో కాలుబెట్టిన అలిశెట్టికి అంతా తనలాంటి భరోసాలేని బతుకులే కంటబడ్డాయి. ఆయన పదేళ్ల నగర జీవితంలో చెప్పినదంతా సామాన్యుడి వెతలే. 19వ ఏట చిట్టి పొట్టి కవితలు రాయడం మొదలుపెట్టిన ప్రభాకర్ పుట్టి పెరిగిన జగిత్యాలలో ఆగకుండా కరీంనగర్ మీదుగా 1983లో హైదరాబాద్‌కు మారాడు. ఆయన చివరి పదేళ్ల జీవితం నగరంలోనే గడిచింది.

అలిశెట్టి ప్రభాకర్ నగరంలో అడుగు పెట్టక ముందే, దాని లక్షణాలను సరిగ్గానే గమనించి, తొలినాళ్ళ కవిత్వంలో వివరించాడు: 'ప్లాస్టిక్ సర్జరీ' అనే కవితలో, "నగరంలో/ కొన్ని నెమళ్ళుంటాయి/ కంటిలో కాదు సూటిగా/ గుండెల్లో పొడుస్తాయి/ మరెన్నో/ తోడేళ్లుంటాయి/ ఇవి మనిషినేం చేయవు/ కేవలం శ్రమను మాత్రమే/ తోడేస్తాయి/ నగరం.../ అర్థం కాని రసాయనశాల/ అందమైన శ్మశానవాటిక/ నగరం.../ చిక్కువిడని పద్మవ్యూహం,/ చెక్కుచెదరని మయసభ" అని అంతా తెలిసినట్లే రాశాడు.



1981–82 కాలంలో కరీంనగర్ నుంచి తన కవితా చిత్రాలు వెంటేసుకొని నెలకు ఒకటీ రెండుసార్లు నగరానికి వచ్చి వాటి ప్రదర్శనలు కాలేజీల్లో ఏర్పాటు చేస్తున్నప్పుడు ఆయనకు నగరం కొత్తగా, వింతగా కనబడింది. తన కళా సృష్టికి తగిన రంగస్థలం ఇదేనని అనిపించింది. అప్పటికే క్షయతో బాధపడుతున్న తాను ఇక్కడెలా బతుకుతాను అనే ముందూ వెనుకా ఆలోచనా లేకుండా అన్నీ సర్దుకొని నగరంలో కాలుపెట్టాడు. ఈతరానివాడు నీళ్లలో దూకినట్లుంది. అయినా కవిత్వమే తప్ప జీవన కష్టాల గురించి పట్టించుకోని ప్రభాకర్ ఆ పదేళ్లు ఇక్కడ తుఫానులో చిక్కుకున్నట్లు బతికాడు. కుటుంబం పడరాని పాట్లు పడింది. అంతా బాగున్న సొంతూరును వదిలిపెట్టి ఇక్కడికి ఎందుకు, వెనక్కి పోదాం అని ఇంటామె వేడుకున్నా వినలేదు.

ఈ విషయాల ప్రస్తావన ఆయన చివరి రోజుల్లో రాసుకున్న 'మరణం నా చివరి చరణం కాదు' ముందుమాటలో చూడవచ్చు: "7 x 14 అడుగుల స్టూడియో గదికి అయిదొందలు, భార్య ఇద్దరు పిల్లలతో ఒంటరి గదికి నూటా ఎనభై పోగా మిగిలేది అబిడ్స్‌లో సెకండ్ హ్యాండ్ పుస్తకం" అనే ఆర్థిక బాధను ఒక చోట, "పుట్టిన గడ్డ నుండి ఇక్కడికి రావడమే పొరపాటయిపోయింది" అనే పశ్చాత్తాపాన్ని మరోచోట రాసుకున్నాడు. నగరంలో కష్టాలను వివరిస్తూ "పగలు రాత్రి ఆస్బెస్టాస్ రేకుల కింద పడి ఎంత వేడెక్కినా, మాడిపోకుండా ఉండగలిగిన మానవాతీతుణ్ణి" అని రాసుకున్నాడు. అయినా అన్ని కష్టాల్లోనూ "నరకప్రాయమైన నగర నాగరికతను నర నరానా జీర్ణించుకున్నవాణ్ణి, రోజుకో రెండు కవితా వాక్యాలు రాయలేనా" అని తన ధీరత్వాన్ని ప్రకటించుకున్నాడు.

అలా నగరం ఆయనకు కొత్త కవితా వస్తువైంది. 1986లో ఆంధ్రజ్యోతి దిన పత్రికలో ప్రభాకర్ డైలీ పోయెమ్ శీర్షిక 'సిటీ లైఫ్' మొదలైంది. రోజుకొక్క కవిత రాయడమంటే మామూలు విషయం కాదు. అయినా దాన్ని ప్రభాకర్ ఛాలెంజ్‌గా తీసుకున్నాడు. అలిశెట్టి చివరి రోజు వరకు ఆ శీర్షిక కొనసాగింది. ఆదాయం కొడికట్టినవేళ ఆ పత్రిక రోజుకి ఇచ్చే ముప్పై రూపాయల పారితోషికమే అన్నం పెట్టింది. ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య పీడనలో కవిత్వమే ఆయనకు ఆసరా అయింది.

ఆంధ్రజ్యోతిలో సిటీ లైఫ్ ఆయన కవిత్వానికి పాఠక విస్తృతిని పెంచింది. రోజు పత్రికను చూసేవారు ఆయన కవితను వదిలిపెట్టేవారు కాదు. ఆయన తీసుకొనే నిత్యజీవన అంశం; రాతలో సరళత, స్పష్టత, సూటిదనం, వ్యంగ్యం అందరిని ఆకట్టుకునేవి. అలా లక్షలాది మందికి 'అలిశెట్టి ప్రభాకర్' పేరు దగ్గరయింది.

సిటీలైఫ్ కవితల్లో ఒక కవితలో– నగరంలో రోజూ ఏదో ఒక దారిలో కనిపించే ఊరేగింపును "సమిష్టి బాధల/ సుదీర్ఘ శ్వాసే/ ఊరేగింపు" అన్నాడు. "నగరంలో రోడ్డుకిరువైపులా/ వేశ్యల్లా ముస్తాబై నిలుచున్న దుకాణాలు/ కన్నుగొట్టి రమ్మన్నా గుండె బిగపట్టుక/ సాగిపోయేవాడు సామాన్యుడు" అన్నాడు. నగరంలో రోడ్లను తన కోణంలో చెబుతూ– "నగరంలో రోడ్లు/ అడపా దడపా/ బాధల బాటసారులను మింగేసే కొండ చిలువలా" ఉన్నాయంటాడు. "హైదరాబాదంతా పిండితే చిక్కని పాలు/ బంజారాహిల్స్" అని శ్రమదోపిడి రూపాన్ని బయటపెట్టాడు. "కాచిగూడా/ కాచి వడబోస్తే/ నువ్వొక నీళ్ల టీ/ నారాయణగూడా/ నీ మీంచి నడిచిపోతే/ నువ్వొక దాల్ రోటీ/ బతకొచ్చిన కష్టజీవీ/ పట్నంలో/ నీకు నీవే పోటా పోటీ..!" అని కష్టజీవి కడుపు నింపేవేమిటో వివరిస్తాడు. "హైదరాబాదనే/ మహావృక్షమ్మీద/ ఎవరికి వారే/ ఏకాకి" అని నగర జీవనం తీరును ఎండగడతాడు. కవిత్వం కోసం కష్టాలొచ్చినా, నష్టాలొచ్చినా వెరవలేదు. అందుకే అలిశెట్టి పట్టిందల్లా 'కవిత్వం' అయింది. ఆయన నడిచిన దారుల్లో వేసిన కవిత్వ పాదముద్రలు ఎన్నటికీ మాసిపోవు.

• బద్రి నర్సన్

(రేపు అలిశెట్టి ప్రభాకర్ జయంతి, వర్ధంతి)

వర్గీకరణ అమలుకై మేధావుల సభ

మన దేశంలో రాజ్యాంగం అమలైన 75 ఏళ్ల కాలంలో ప్రభుత్వాలకు ముందుచూపు లేకపోవడం వల్ల ఎస్సీ రిజర్వేషన్ ఫలాల పంపిణీలో అసమానతలు ఏర్పడ్డాయి. దేశంలో ఉన్న ఎస్సీలలో కొన్ని కులాలే ప్రతి రాష్ట్రంలో రిజర్వేషన్ ఫలాలు సింహభాగం పొందుతూ వస్తున్నాయి. ప్రధాన స్రవంతికి దూరంగా ఉంటున్న ఆశ్రిత కులాలు ఎస్సీ రిజర్వేషన్ల పొందలేకపోయాయి. ఇటీవల సుప్రీంకోర్టు రాజ్యాంగ విస్తృత ధర్మాసనం తమ తీర్పులో ఎస్సీ రిజర్వేషన్‌ను వర్గీకరించి, అందరికీ సమన్యాయం చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాల మీద ఉందని చెప్పింది. ఆర్టికల్ 341ని విస్తృతంగా పరిశీలించిన సుప్రీంకోర్టు, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ రిజర్వేషన్‌ను వర్గీకరించడానికి ఎలాంటి అడ్డంకులూ లేవని స్పష్టం చేసింది. వర్గీకరణ ద్వారానే ఆర్టికల్ 14, 15, 16ల ఉద్దేశం నెరవేరుతుందని కోర్టు అభిప్రాయపడింది. ఈ మూడు దశాబ్దాల కాలంలో ఎంఆర్‌పీఎస్ చేస్తున్న సామాజిక న్యాయసాధన పోరాటానికి దేశంలో ఉన్న మేధావివర్గం తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ వచ్చింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంతీర్పును వెంటనే అమలు చేయాలని చెప్పడానికి మేధావుల జోక్యం ఎంతైనా అవసరం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిండు అసెంబ్లీలో ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ అమలు చేస్తానని చేసిన ప్రకటనకు కట్టుబడి ఉండడానికి పౌర సమాజం ఒత్తిడి చేయాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో అన్ని సామాజిక సమూహాల కలయికతో మేధావుల సభ నేడు ఉదయం 10 గంటలకు హైదరాబాద్ ఉస్మానియా యూనివర్శిటీలోని ఠాగూరు ఆడిటోరియంలో జరుగుతుంది. ప్రొ. హరగోపాల్, దేశపతి శ్రీనివాస్, కె. రామచంద్రమూర్తి, విమలక్క, ప్రొ. భంగ్యా భూక్యా, కన్నెగంటి రవి, జస్టిస్ చంద్ర కుమార్, ప్రొ. కె. నాగేశ్వర్, నందిని సిధారెడ్డి, వి. సంధ్య, బూరం అభినవ్, కోదండరాం, తీన్మార్ మల్లన్న, పాశం యాదగిరి, సూరేపల్లి సుజాత, గజవెల్లి ఈశ్వర్, డా. జయప్రకాశ్ నారాయణ, కె. శ్రీనివాస్, జయధీర్ తిరుమలరావు, ఈసం నారాయణ, డా. ఆరెపల్లి రాజేందర్, మంద దేవేంద్ర ప్రసాద్, చింతికింది కాశీం, ప్రొ. జి. మల్లేశం, తదితరులు పాల్గొంటారు.

–మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్, తెలంగాణ

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
హనుమకొండ
HANUMAKONDA
శనివారం 11 జనవరి 2025





స్వామివారి కల్యాణ తాళిబొట్టు చూపిస్తున్న అర్చకుడు

నేత్రపర్వం

భక్తి శ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి వేడుకలు

- కనువిందుగా వైకుంఠ ద్వార దర్శనం
- భక్తులతో కిటకిటలాడిన వైష్ణవాలయాలు
- వేయిస్తంభాల గుడిలో సీతారామ చంద్రుడికి లక్ష తులసీ అర్చన
- భద్రకాళి ఆలయం లోనూ ప్రత్యేక పూజలు



వరంగల్ బట్టలబజారులోని శ్రీ వేంకటేశ్వర ఆలయంలో ఉత్తరద్వారంలో స్వామివారు, దర్శనం కోసం భక్తుల క్యూ

7




కల్యాణానికి ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు తీసుకువస్తున్న ఆలయ చైర్మన్ చంద్రశేఖర్‌గుప్తా, ఈవో కిషన్‌రావు

కల్యాణం.. కమనీయం..

- వేడుకగా కొత్తకొండ వీరభద్రుడి కల్యాణం
- హాజరైన మంత్రి పొన్నం సతీమణి మంజుల
- వేలాదిగా తరలొచ్చిన భక్తులు

7



మేమింతే..

ప్రజలకు దూరంగా.. దందాలకు దగ్గరగా

- 11మంది కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల తీరుపై సర్వే నివేదిక
- సీఎం చెప్పినా.. మారని కొందరు ఎమ్మెల్యేలు, మంత్రుల శైలి
- డేంజర్ జోన్‌లో నలుగురు శాసనసభ్యులు, ఓ మంత్రి
- 'ఆరెంజ్'లో నలుగురు, గ్రీన్‌జోన్‌లో ఇద్దరు ఎమ్మెల్యేలు
- భూ దందాలు, సెటిల్‌మెంట్లు, ఇసుక అక్రమాల్లో జోక్యం
- లిక్కర్, రేషన్ బియ్యం, గుట్కా దందాల్లో వాటాలు
- అటు అధిష్ఠానం.. ఇటు శ్రేణులు, ప్రజల్లో తీవ్ర అసంతృప్తి
- గెలిచి ఏడాదైనా.. నామినేటెడ్ పదవులు లేకపోవడంపై నాయకుల నారాజ్

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజల్లో సానుకూలత ఉన్నా.. కొందరు ఎమ్మెల్యేలు, మంత్రుల వ్యవహారశైలి సరిగ్గా లేదని ఓ సర్వే తేల్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది కాలం పూర్తయిన నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా నిర్వహించిన సర్వేలో ఓరుగల్లు ఎమ్మెల్యేలు, ఓ మంత్రి తీరుపై ప్రజల్లో, క్యాడర్‌లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమైనట్టు సమాచారం. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాంగ్రెస్‌కు చెందిన 11మంది ఎమ్మెల్యేల్లో కేవలం ఇద్దరే గ్రీన్ జోన్‌లో ఉండగా, మిగతా ఎమ్మెల్యేలు డేంజర్, ఆరెంజ్ జోన్‌లో ఉన్నట్లుగా తేలింది. భూదందాలు, సెటిల్‌మెంట్లు, ఇసుక అక్రమ వ్యాపారాల్లో ఎమ్మెల్యేల అనుచరుల పాత్ర ఉంటోందన్న ఆరోపణలు, ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతున్నాయి. చివరికి పేదలకు అందించే రేషన్ బియ్యంతో పాటు గుట్కా దందాలోనూ కొందరి హస్తం ఉన్నట్లు తేలటంతో సీఎం కూడా షాక్ అయ్యారనే చర్చ జరుగుతోంది.

డేంజర్ జోన్‌లో ఓరుగల్లు ఎమ్మెల్యేలు..

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాదికాలం పూర్తయింది. ఆరు గ్యారంటీల పేరుతో ఇచ్చిన అనేక హామీలను ప్రభుత్వం అమలు చేస్తోంది. అనేక పథకాలతో ప్రజల్లో ప్రభుత్వం కొంత సానుకూలత ఉన్నా.. కొందరు ఎమ్మెల్యేల వ్యవహారశైలి పార్టీకి తీవ్రంగా నష్టం కలిగిస్తుందనే చర్చ జరుగుతోంది. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా రాష్ట్ర వ్యాప్తంగా 65మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేల పనితీరుపై ఓ సర్వే నిర్వహించారని, అందులో 28మంది ఎమ్మెల్యేలు డేంజర్ జోన్‌లో ఉన్నట్లుగా రిపోర్టు వచ్చింది. అయితే ఈ 28 మందిలో ఓరుగల్లుకు చెందిన ఐదుగురు ఎమ్మెల్యేలున్నారని సమాచారం. అలాగే మరో నలుగురు ఎమ్మెల్యేలు ఆరెంజ్ జోన్‌లో ఉండగా.. వీరిపై పెద్దగా ప్రజల్లో వ్యతిరేకత లేకపోయినప్పటికీ.. ఆశించిన స్థాయిలో పనులు చేయటం లేదని, పూర్తి స్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండటం లేదన్న అభిప్రాయాలున్నట్టు తెలిసింది. ఇక వరంగల్ నగర పరిధిలోని ఒకరితో పాటు సమీపంలోని మరో ఎమ్మెల్యే మాత్రం గ్రీన్ జోన్‌లో ఉన్నట్టు సమాచారం. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 11 మంది ఎమ్మెల్యేల్లో ఆశించిన స్థాయిలో పనితీరు కనబరుస్తున్నది కేవలం ఇద్దరు ఎమ్మెల్యేలేనని సర్వే రిపోర్టులో పేర్కొన్నట్లుగా సమాచారం. వరంగల్ నగరంతో పాటు ఏజెన్సీ ప్రాంతంలోని కొంత మంది ఎమ్మెల్యేల పనితీరు కూడా బాగా లేదనే చర్చ జరుగుతోంది.

రేషన్ బియ్యం, గుట్కా, భూదందాల్లో హస్తం..

ఏడాది కాలంగా ప్రజల్లోకి వెళ్లటం కంటే.. వ్యక్తిగత పనులు, భూదందాలు, సెటిల్‌మెంట్లపైనే కొందరు ఎమ్మెల్యేలు, వారి అనుచరులు దృష్టిపెట్టారని సర్వేలో తేలింది. ప్రధానంగా ఓ ఎమ్మెల్యే ఉద్యోగుల పోస్టింగుల్లో

మిగతా 7వ పేజీలో...

కేడర్ నారాజ్..

ఎమ్మెల్యేలుగా గెలిపించేందుకు ఎంతో కష్టపడిన కార్యకర్తలు అసంతృప్తిగా ఉన్నట్టు సర్వేలో తేలింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయినా ఇప్పటికీ కేడర్ చేతికి పైసా పని రాలేదు. అంతేకాకుండా నామినేటెడ్ పోస్టుల ఊసే లేదు. దీంతో కేడర్ కూడా ఎమ్మెల్యేల తీరుపై అసహనంగా ఉన్నట్టు తేలింది. వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌తో పాటు ఇతర చోట్ల ఉన్న వ్యవసాయ మార్కెట్లు, దేవాలయ కమిటీలు, గ్రంథాలయ సంస్థ చైర్మన్లు, ఇతర జిల్లా స్థాయిలో కీలకమైన నామినేటెడ్ పోస్టుల భర్తీపై ఎమ్మెల్యేలు ఆసక్తి చూపడం లేదని కేడర్‌లో అసంతృప్తిగా ఉన్నట్టు తెలిసింది. అలాగే రాజకీయాలనే వృత్తిగా నమ్ముకుని అనేక మంది ద్వితీయశ్రేణి నేతలున్నారు. పదేళ్లు అధికారానికి దూరంగా ఉండి ఆర్థికంగా, మానసికంగా నష్టపోయిన నేతలున్నారు. ప్రభుత్వం రాగానే ఏదో ఒకటి దక్కుతుందనే ఆశతో ఉన్న నేతలు ఇటు నామినేటెడ్ పదవులు రాక.. అటు చేసేందుకు పనులు లేక అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్న వరంగల్‌తూర్పు, ములుగు నియోజకవర్గాల్లో కూడా పూర్తి స్థాయిలో నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయకపోవటంతో కేడర్‌లో ఆందోళన వ్యక్తమవుతున్నట్టు సర్వే రిపోర్టులో పేర్కొన్నట్టు సమాచారం. రాష్ట్రస్థాయి నేతలకు నామినేటెడ్ పదవులను ఇచ్చి.. ఎమ్మెల్యేల గెలుపు కోసం కిందిస్థాయి నుంచి పని చేసిన తమకు మొండిచేయి ఏమిటనే ఆవేదనలో శ్రేణులున్నట్టు సమాచారం.

టీచర్స్ ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థిగా

పులి సరోత్తంరెడ్డి

- ప్రకటించిన కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి



రాంనగర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ - నల్లగొండ - ఖమ్మం టీచర్స్ ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థిగా హనుమకొండకు చెందిన పులి సరోత్తం రెడ్డి పేరును కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డి శుక్రవారం అధికారికంగా ప్రకటించారు. 1984 సంవత్సరంలో ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చిన సరోత్తంరెడ్డి 34 యేళ్ల పాటు ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా కొనసాగి 2019 ఫిబ్రవరిలో వీఆర్ఎస్ తీసుకున్నారు. 34 యేళ్ల కాలంలో 2012 నుంచి 2019 వరకు ఉమ్మ డి ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ రాష్ట్రంలో పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. అంతకంటే ముందు 2004 నుంచి 2012 వరకు ఉమ్మడి వరంగల్ జిల్లా పీ ఆర్‌టీయూ అధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా పని చేశాడు. తెలంగాణ ఉద్యమంలో తెలంగాణ టీచర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీటీజేఏసీ) చైర్మన్‌గా, ఉద్యోగుల జేఏసీ ఉమ్మడి వరంగల్‌కు సెక్రె టరీ జనరల్‌గా పనిచేశారు. వీఆర్ఎస్ తీసుకున్న తర్వాత 2019 మార్చిలో జరిగిన టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచి మూడో స్థానంలో నిలిచారు. 2019 సెప్టెంబర్‌లో బీజేపీలో చేరి స్టేట్ కౌన్సిల్ మెంబర్‌గా, బీజేపీ అనుబంధ రిటైర్డ్ టీచర్స్ అసోసియేషన్‌కు కో- చైర్మన్ గా కొనసాగుతున్నారు. 2023లో జరిగిన ఎమ్మెల్యే, 2024లో జరిగిన ఎంపీ ఎన్నికల్లో వరంగల్ పశ్చి నియోజకవర్గంలోని 178,179,180 పోలింగ్ బూత్‌లకు ఇన్‌చార్జిగా వ్యవహరించి ఓటు బ్యాంకు పెంపునకు కృషి చేశారు.

స్పోర్ట్స్ విలేజ్ ఏర్పాటుకు కృషి

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు
- సందడిగా ప్రారంభమైన జాతీయ స్థాయి సెపక్‌తక్రా చాంపియన్‌షిప్



ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

వరంగల్ స్పోర్ట్స్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో స్పోర్ట్స్ విలేజ్ ఏర్పాటుకు కృషి చేస్తానని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు అన్నారు. సెపక్‌తక్రా తెలంగాణ రాష్ట్ర అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ జేఎన్ఎస్ హ్యాండ్ బాల్ కోర్టులో ఏర్పాటు చేసిన 34వ జాతీ య స్థాయి సీనియర్ స్త్రీ, పురుషుల సెపక్‌తక్రా క్రీడా పోటీలు సందడిగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు ముఖ్య అతిథిగా హాజరై ముందుగా జాతీయ జెండాను ఆవిష్కరించి క్రీడాకారులచే గౌరవ వందనం స్వీకరించి క్రీడా పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి క్రీడలకు పెద్ద పీట వేస్తూ క్రీడాకారులను ప్రోత్సహి స్తున్నారని కొనియాడారు. ఓరుగల్లు క్రీడా దిగ్గజం జీవంజి దీప్తికి అర్జున అవార్డు రావడం అభినందనీయమన్నారు. క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన నిఖిత్ జరినా, క్రికెటర్ సిరాజ్, దీప్తిలకు క్రీడా కోట నుంచి ఉద్యోగావకాశాలు కల్పించి ఆదుకున్న ఘనత సీఎం రేవంత్ రెడ్డికే దక్కిందన్నారు.

క్రీడలకు కులాలు, మతాలు ఉండవని క్రీడలతో స్నేహపూర్వక సంబంధాలు బలపడు తాయ న్నారు. చారిత్రాత్మక నగరమైన ఓరుగల్లులోనే ప్రముఖ చారిత్రక కట్టడాలైన వేయిస్తంభాల ఆలయం, రామప్ప, ఖిలా వరంగల్ కోటతోపాటు ఇతర నేపథ్యం గల కట్టడాలను వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులు క్రీడా పోటీల అనంతరం తిలకించాలని సూచించారు. సెపక్‌తక్రా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కానిగంటి సురేష్ మాట్లాడుతూ.. ఐదు రోజుల పాటు హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్, ఔట్ డోర్ స్టేడియంలో సెపక్‌తక్రా క్రీడా పోటీలు కొనసాగుతాయన్నారు. 28 రాష్ట్రాల నుంచి 600మంది

మిగతా 8వ పేజీలో...



ప్రభుత్వ పథకాల అమలుపై సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం హైదరాబాద్ సచివాలయంలో కలెక్టర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పథకాల అమలును ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని, ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆయన కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో వరంగల్, హనుమకొండ కలెక్టర్లు సత్యశారద, ప్రావీణ్య పాల్గొన్నారు.



నిలిచిన ఆరోగ్యశ్రీ సేవలు

ప్రభుత్వ ఆస్పత్రులకు పరుగులు

8



క్రెడాయి ప్రాపర్టీ షో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా అధ్యక్షుడు ఎర్రబెల్లి తిరుపతిరెడ్డి

ప్రాపర్టీషో ఏర్పాట్ల పరిశీలన

హనుమకొండ టౌన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని పీజీఆర్ గార్డెన్‌లో శనివారం నిర్వహించే క్రెడాయి ప్రాపర్టీ షో స్టాల్స్ ఏర్పాట్లను క్రెడాయి వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఎర్రబెల్లి తిరుపతిరెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా క్రెడాయి జిల్లా అధ్యక్షుడు ఎర్రబెల్లి తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. నూతనంగా ఇల్లు నిర్మించుకునేవారు, అపార్ట్‌మెంటు, విల్లాలు, లేఅవుట్‌ల సమాచారంతో పాటు కొనుగోలు చేయాలనుకునేవారికి క్రెడాయి ఆధ్వర్యంలో 85స్టాల్స్‌ను ఏర్పాటు చేసినట్లు తిరుపతిరెడ్డి తెలిపారు. వివిధ బ్యాంకుల ఆధ్వర్యంలో రుణసౌ కర్యంపై అవగాహన కల్పిస్తామన్నారు. ఈ అవకాశాన్ని గ్రేటర్ వరంగల్ ప్రజలు, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో క్రెడాయి జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ అమరేందర్‌రెడ్డి, శాఖమూరి అమరలింగేశ్వర్‌రావు, ఎం. రవీందర్ రెడ్డి, కార్యదర్శి జె.మనోహర్, సంయుక్త కార్యదర్శులు జి.రాజేందర్‌రెడ్డి, ఎల్.రజినీకాంత్‌రెడ్డి, సీహెచ్ ఉదయ్, సీహెచ్ సత్య నారాయణ రెడ్డి, పి. వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



గ్వాలియర్‌లో జాతీయ విద్యా పరిశోధన సంస్థ బాధ్యుల చేతుల మీదుగా మెమొంటోలు, ప్రశంసా పత్రాలను అందుకుంటున్న విద్యార్థినిలు

జాతీయ స్థాయిలో వావిలాల విద్యార్థినిల ప్రతిభ

పాలకుర్తి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) మండలంలోని వావిలాల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినిలు ఈ నెల 5, 6, 7, 8 తేదిల్లో మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని గ్వాలియర్‌లో జాతీయ విద్యా పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో జరిగిన జానపద నృత్య పోటీల్లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. వావిలాలకు చెందిన తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థినిలు పూజిత, మిన్ను, అను, ఆసినా, జస్మిత, ఆశారాణిలు జాతీయ స్థాయిలో జాతీయ విద్యా పరిశోధన సంస్థ నిర్వహించిన పోటీల్లో పాల్గొని ఐదో స్థానంలో విజేతగా నిలిచి రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినిలను జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్, ఎంఈవో పోతుగంటి నర్సయ్య, మహాత్మా హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ వ్యవస్థాపకుడు గంట రవీందర్, ఉపాధ్యాయులు అభినందించారు.

జనగామలో పోలీసుల తనిఖీలు



జనగామ బస్టాండ్‌లో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహిస్తున్న ఏసీపీ చేతన్

జనగామ రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినం, రిపబ్లిక్‌డే సందర్భంగా జనగామ ఏసీపీ పండెరీ చేతన్ నితిన్ ఆధ్వర్యంలో జనగామ బస్టాండ్, రైల్వే స్టేషన్, రద్దీ ప్రదేశాల్లో బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. ఏసీపీ మాట్లాడుతూ చుట్టుపక్కల ఎవరైనా అనుమానితులు కనబడితే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తనిఖీల్లో సీఐ దామోదర్‌రెడ్డి, ఎస్‌ఐలు భరత్‌కుమార్, రాజేష్‌కుమార్, రాజన్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్‌ల గడువు పొడిగింపు

జనగామ రూరల్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల గడువును మార్చి 31కి పొడిగించినట్లు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి విక్రమ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి అర్హత కలిగిన బీసీ, ఈబీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్ కొరకు గడువు పెంచినట్లు పేర్కొన్నారు. ఆన్‌లైన్ www.telanganaepass.cgg.gov.in దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

ఆదాయం ఉన్నా.. అభివృద్ధి సున్నా..!



ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ (ఫైల్)

సమస్యల వలయంలో ఏనుమాముల మార్కెట్

- పాలకవర్గం లేక ఇబ్బందిపడుతున్న రైతులు
- విన్నవించినా పట్టించుకోని అధికారులు

వరంగల్ వ్యవసాయం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ సమస్యల వలయంలో కూరుకుపోయింది. మార్కెటింగ్‌శాఖ అధికారుల నిర్లక్ష్యంతో రైతులు, కార్మికులు, వ్యాపారులు విసిగివేసారిపోతున్నారు. కార్యదర్శి నుంచి మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ల వరకు ఎవరికి సమస్యలు విన్నవించినా ఫలితం ఉండడంలేదు. చివరకు ప్రజాప్రతినిధులు, ఇన్‌చార్జి మంత్రులు, మంత్రుల వద్ద గోడు వెల్లబోసుకున్నా పట్టించుకోవడంలేదు. మార్కెట్ కమిటీకి పాలకవర్గం లేక రైతుల ఇబ్బందులు పట్టించుకునేవారే కరువయ్యారు. పన్ను వసూళ్లలో టార్గెట్‌లు పెడుతున్న మార్కెటింగ్‌శాఖ అధికారులు సౌకర్యాలు కల్పించడంలో మాత్రం నిర్లక్ష్యం చేస్తున్నారు. గత సంవత్సరం యాభై కోట్లకు పైగా ఆదాయం వస్తే ఈ సారి 60 కోట్లకు పైగా రాబట్టాలని సిబ్బందిని ఆదేశిస్తున్నారు. ఇప్పటికైనా మార్కెటింగ్‌శాఖ మంత్రి, ఉన్నతాధికారులు వెంటనే స్పందించి మార్కెట్లో సౌకర్యాలు కల్పించాలని రైతులు, కార్మికులు, వ్యాపారులు కోరుతున్నారు.

ప్రధాన సమస్యలు ఏమిటంటే..

ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. గతంలో ఉన్న వాటిని తొలగించి ఆరు నెలలు గడుస్తున్నా ఇంత వరకు కొత్తవి ఏర్పాటు చేయలేదు. అదే విధంగా సరుకును తూకం వేసే సమయంలో ఉపయోగించే పీవోఎస్ మిషన్లు ప్రస్తుతం 75మాత్రమే ఉన్నాయి. అందులో కొన్ని పనిచేయడం లేదు. మొత్తం 128 మంది దడవాయిలుండగా తలా ఒక్కటి ఇవ్వాల్సి ఉంది. ఆ మేరకు కొత్తవి తెప్పించాలి. సర్వర్ పనిచేయక తూకాలు ఆగిపోతున్నాయి. రైతులు గంటల కొద్దీ వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. మార్కెట్లో వైఫై ఏర్పాటు చేయడంతో పాటు సర్వర్‌లో లోపాలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. వచ్చేది మిర్చి సీజన్. మిర్చి యార్డులో ఏరోజుకారోజు యార్డును క్లీన్ చేయాల్సిన అవసరం ఉంటుంది. వెంటనే క్లీనింగ్ మిషన్ తెప్పించకపోతే యార్డులో పనిచేయడం కష్టమని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ నుంచి చుట్టూ 15 కిలో మీటర్ల మేర రోడ్లను నిర్మించాలని వ్యాపారులు కోరుతున్నారు. ప్రస్తుతం ఉన్న రోడ్లు గుంతలు పడి అధ్వానంగా తయారయ్యాయి. ఇక మామిడి సీజన్ ప్రారంభం కాకముందే ముసలమ్మకుంటలోని గోదాముల వద్ద మార్కెట్ ఏర్పాటు చేసి మౌలిక సదుపాయాలు కల్పించాలి.

లక్ష్మీపురం కురగాయల మార్కెట్లో ...

కూరగాయల మార్కెట్లో తరచూ దొంగతనాలు జరుగుతున్నాయి. వెంటనే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ విషయంలో కలెక్టర్ సైతం అధికారులను ఆదేశించినప్పటికీ అడుగు ముందుకు పడటం లేదు. ముఖ్యంగా వినియోగదారులు, రైతులు, కార్మికుల సెల్‌ఫోన్లు, మనీపర్సులను దొంగలు ఎత్తుకెళ్తున్నారు. మరోవైపు సైకిల్ స్టాండ్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. అదీ పెండింగ్‌లోనే ఉంది. చిరువ్యాపారులు ఎండకు ఎండి, వానకు తడుస్తూ మార్కెట్‌కు పన్ను కడుతున్నారు. వారి కోసం షెడ్లను నిర్మిస్తామని చెప్పి నెలలు గడుస్తున్నా.. పట్టించుకునేవారే లేకుండాపోయారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..



మార్కెట్లో సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాం. ఇప్పటికే ఉన్నతధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పాలనాపరమైన అనుమతుల కోసం ఎదురు చూస్తున్నాం. త్వరలోనే మార్కెట్లో సదుపాయాలు కల్పించి రైతులకు మేలైన సేవలను అందిస్తాం.

- పోలెపాక నిర్మల, మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి

పాలకవర్గాన్ని నియమించాలి..



మార్కెట్‌కు పాలకవర్గం లేక ఎక్కడి సమస్యలు అక్కడే ఉంటున్నాయి. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మార్కెట్ కార్యదర్శి నుంచి మొదలు మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్లు, ఎమ్మెల్యేలకు, మంత్రులు, ఇన్‌చార్జి మంత్రి వరకు వినతులు సమర్పించుడే అవుతోంది. కానీ సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు. మార్కెట్లో వైఫై, పీవోఎస్ మిషన్లు, సీసీ కెమెరాలు, రోడ్లు సరిగా లేక రైతులు, కార్మికులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు వెంటనే స్పందించి పాలకవర్గాన్ని నియమించాలి.

- బొమ్మినేని రవిందర్‌రెడ్డి, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు

దుర్గామాత, జీపీ భూముల్ని కాపాడాలి

- అధికారి రిపోర్ట్‌ను రద్దు చేయాలి
- రాజకీయ నాయకులు, గ్రామస్థుల రాస్తారోకో



బచ్చన్నపేటలో రాస్తారోకో చేస్తున్న నాయకులు, స్థానికులు

బచ్చన్నపేట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన బచ్చన్నపేటలోని దుర్గామాత, గ్రామ పంచాయతీకి చెందిన భూములను రక్షించాలంటూ, సర్వే ల్యాండ్ అసిస్టెంట్ డైరెక్టర్ ఇచ్చిన రిపోర్ట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం పలు పార్టీల నాయకులు, గ్రామస్థుల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు నల్లగోని బాలకిషన్‌గౌడ్, పీఏసీఎస్ ఛైర్మన్ పులిగిల్ల పూర్ణచందర్, మాజీ సర్పంచ్ వడ్డేపల్లి మల్లారెడ్డిలు మాట్లాడుతూ సర్వేనంబర్ 589/ఏలో 12-20 ఎకరాల భూమి ఉందని, ఇందులో మూడు ఎకరాలు దుర్గామాత ఆలయానికి, రెండు ఎకరాలు గ్రామ పంచాయతీ ఆధీనంలో ఉందన్నారు. కొందరు ఈ భూమిని కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. జీపీ అధికారులకు, గ్రామస్థులకు సమాచారం ఇవ్వకుండా, సర్వే ల్యాండ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ భూమికి కొలత వేశారంటూ మండిపడ్డారు.

సదరు అధికారి రిపోర్ట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గుర్రపు బాల్‌రాజు, మహాత్మాచారి, దిడిగ రమేష్, ఎద్దు హరీష్, బోడకుంటి మల్లయ్య, చిలుముల సుధాకర్‌రెడ్డి, మోహిన్‌రెడ్డి, బుచ్చిరాజు, కంటెం కర్ణాకర్, పడిగెల కర్ణాకర్‌రెడ్డి, సుధాకర్, జిల్లా సందీప్, అఖిల్, తమ్మడి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో హల్‌చల్

- డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ మాజీ సర్పంచ్ భర్త
- పోలీసులతో వాగ్వాదం
- మూడు రోజుల జైలు, జరిమానా



డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ ముస్కు చంద్రబాబు

లింగాల ఘనపురం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో వాహనం నడుపుతూ పోలీసులకు తాజా మాజీ సర్పంచ్ భర్త శుక్రవారం పట్టుబడ్డాడు. అయితే డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలకు సహకరించకపోవగా, పోలీసులతో దురుసుగా ప్రవర్తిస్తూ హల్‌చల్ చేశాడు. లింగాలఘనపురం ఎస్సై బండి శ్రవన్‌కుమార్ కథనం ప్రకారం. పాలకుర్తి మండలం ఈరవెన్నుకు చెందిన ముస్కు చంద్రబాబు(తాజా మాజీ సర్పంచ్ నిర్మల భర్త) గురువారం రాత్రి మద్యం మత్తులో కారు నడుపుతున్నాడు. కుందారం క్రాస్‌రోడ్డు పోలీసులు డ్రైంకెన్ డ్రైవ్ చేపట్టగా, ఎస్సై బ్రీత్ ఎనలైజర్‌ను తీసుకువచ్చాడు. తాను శ్వాస ఊదనంటూ మొమొండికేశాడు. తాను సర్పంచ్‌నని, తనను ఆపే అధికారం మీకెవరిచ్చారంటూ దురుసుగా ప్రవర్తించాడు. అతికష్టం మీద పరీక్షలు చేపట్టిన పోలీసులు చంద్రబాబును న్యాయమూర్తి ఎదుట హాజరు పరచగా మూడు రోజుల జైలుశిక్షతోపాటు, రూ.1500 జరిమానా విధించారు.

ఘోర రోడ్డు ప్రమాదం

- ఇద్దరి దుర్మరణం, ఐదుగురుకి తీవ్ర గాయాలు
- బాధితులంతా ఒకే కుటుంబానికి చెందిన వారు
- ఆగిఉన్న డీసీఎంను ఢీకొన్న తుఫాన్
- జనగామ జిల్లా మైదంచెరువుతండా ఘటన
- మృతులది సూర్యాపేట జిల్లా ఊటూరు



మృతుడు పేరాల వెంకన్న, లక్ష్మి



ప్రమాదానికి గురైన తుఫాన్

కొడకండ్ల జనవరి 10 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లాలో గురువారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే దుర్మరణం చెందగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. మృతులు, క్షతగాత్రులు అంతా ఒకే కుటుంబానికి చెందినవారు కావడంతో పెనువిషాదాన్ని నింపింది. సూర్యాపేట జిల్లా నాగారం మండలం ఈటూరు గ్రామా నికి చెందిన పేరాల వెంకన్న(45), పేరాల లక్ష్మి(35)లు అక్కడికక్కడ మృతిచెందగా పేరాల ఉషయ్య, లావణ్య, ఉప్పలమ్మ, ముత్యాలు, వంగూరి నరసమ్మలకు తీవ్రగాయాలయ్యాయి. పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి కథనం ప్రకారం. జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కడవెండిలో పేరాల వెంకన్న చిన్నకొడుకు కొడుకు డోలారోహణ ఫంక్షన్ గురువారం జరిగింది. ఊటూరుకు చెందిన బంధువులు ఈ వేడుకలకు హాజరయ్యారు. తర్వాత తిరుగు ప్రయాణంలో తుఫాన్ వాహనం ఎక్కారు. డ్రైవర్ ప్యాసింజర్లను ఎక్కించుకున్నాడు. తిరుమలగిరి వైపు వెళ్తున్న తుఫాన్ అర్ధరాత్రి సుమారు 11.40గంటల సమయంలో కొడకండ్ల మండలంలోని మైదంచెరువుతండా సమీపంలో ఇనుప రేకుల లోడ్‌తో ఉన్న డీసీఎం వాహనాన్ని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఊటూరుకు చెందిన పేరాల వెంకన్న(45), అతడి తమ్ముడి భార్య పేరాల లక్ష్మి(35)లు ఘటనా స్థలంలోనే మృతిచెందారు. మృతుల బంధువులు పేరాల ఉషయ్య, లావణ్య, ఉప్పలమ్మ, ముత్యాలు, వంగూరి నరసమ్మలకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని హైదరాబాద్ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. విగతావారు క్షేమంగా ఉన్నట్లు సమాచారం. కాగా, ప్రమాదం జరిగిన సమయంలో తుఫాన్ వాహనంలో 12మంది ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. వారి వివరాలను సేకరిస్తున్నారు. పోస్టమార్టం నిమిత్తం మృతదేహాలను జనగామ ఆస్పత్రికి తరలించారు. మృతుడు వెంకన్న కుమారుడు పేరాల రాజు ఫిర్యాదు మేరకు ఎస్సై రాజు కేసు నమోదు చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.



క్రీడాకారులతో కరచాలనం చేస్తున్న అల్లం బాలకిశోర్‌రెడ్డి

క్రీడల అభివృద్ధికి చేయూతనిస్తా..

ప్రముఖ సామాజికవేత్త అల్లం బాలకిశోర్ రెడ్డి

గీసుగొండ, జనవరి 10 : క్రీడల నిర్వాహణకు, పేద విద్యార్థులకు, నిరుపేదలకు తనవంతు చేయూత ఎప్పుడూ ఉంటుందని ప్రముఖ సామాజికవేత్త అల్లం బాలకిశోర్‌రెడ్డి అన్నారు. గీసుగొండలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఖోఖో క్రీడల పోటీలను ఆయన శుక్రవారం సందర్శించి మాట్లాడారు. ఖోఖో క్రీడల నిర్వాహణకు రూ.5లక్షల విరాళాన్ని అందించి, మరిన్ని సేవా కార్యక్రమాలకు చేయటానికి సిద్ధంగా ఉన్నానన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రియాజుద్దీన్, ఆర్గనైజింగ్ కో-ఆర్డినేటర్ వీరగోని రాజ్‌కుమార్, హెచ్‌ఎంలు పట్టాభి, భిక్షపతి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఛైర్మన్ ప్రొఫెసర్ పుల్లూరి శ్రీనివాస్‌గౌడ్, పీడీలు రాంబాబు, స్వప్న, హేమలత, చెన్నబోయిన రామదాసు, రవీందర్‌గౌడ్, శంకరయ్య, మాజీ సర్పంచ్‌లు దౌడు బాబు, గోనె మల్లారెడ్డి, నాయకులు ప్రవీణ్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు. రెండో రోజు వివిధ జిల్లాల జట్ల మధ్య ఖోఖో పోటీలు ఆసక్తికరంగా జరిగాయి.



వరినాట్లు వేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

సరదాగా.. వరి నాట్లు వేసిన ఎమ్మెల్యే


వర్ధన్నపేట రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు పొలంలోకి దిగి మహిళ కూలీలతో పాటు వరినాటు వేసి అందరిని ఆశ్చర్యానికి గురిచేశారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని నల్లబెల్లి గ్రామ పర్యటనలో భాగంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు బిజీబిజీగా గడిపారు. శుక్రవారం నల్లబెల్లి గ్రామంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసి ఇటీవల తాటిచెట్టుపై నుంచి పడి గాయాలపాలైన ముత్యం ఏకాంబరంగౌడ్‌ను పరామర్శించి ధైర్యం చెప్పి ప్రభుత్వ పరంగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆనంతరం తన పర్యటనను ముగించుకుని ఇల్లంద గ్రామానికి వస్తున్న దారిలో పొలంలో నాటువేసే బంజారా మహిళలను ఆప్యాయంగా పలకరించి, వారితో పొలంలోకి దిగి వరినాటు వేసి సరదాగా వారితో ముచ్చట్లు పెట్టారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, ఐనవోలు దేవస్థాన ఛైర్మన్ కమ్మగోని ప్రభాకర్, జిల్లా నాయకుడు పోషాల వెంకన్నగౌడ్‌లతో పాలు పలువురు పాల్గొన్నారు.

కేయూ దూరవిద్య పీజీ మొదటి సెమిస్టర్ పరీక్ష వాయిదా

కేయూ క్యాంపస్ జనవరి 10 (ఆంధ్రజ్యోతి): జనవరి 20న జరగాల్సిన కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం పీజీ కోర్సుల మొదటి ఏడాది మొదటి సెమిస్టర్ నాల్గవ పేపర్‌ను వాయిదా వేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, ఎస్డీఎల్‌సీఈ సైన్స్ కోర్సుల కోఆర్డినేటర్ డాక్టర్ పి.వెంకటగోపీనాథ్‌లు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎస్డీఎల్‌సీఈ ఎంఎస్సీ బాటనీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్, జువాలజీ, మ్యాథ్స్ తదితర సబ్జెక్టుల నాల్గవ పేపర్ 20 జరుగాల్సిన ఉందని పేర్కొన్నారు. అయితే టీజీటెట్ పరీక్షల నేపథ్యంలో జనవరి 24న శుక్రవారానికి వాయిదా వేసినట్లు స్పష్టం చేశారు. పరీక్షల సమయంతో పాటు, పరీక్షల కేంద్రాలన్ని యాథావిధిగా ఉంటాయని పేర్కొన్నారు.

టీచర్ ఎమ్మెల్సీ బరిలో కుడా మాజీ చైర్మన్?

- స్వతంత్రంగా పోటీకి సిద్ధమవుతున్న సుందర్‌రాజ్
- అనుచరులతో సమావేశాల నిర్వహణకు కార్యాచరణ



హనుమకొండ టౌన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) మాజీ చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్ నిలవనున్నట్లు సమాచారం. ఈ మేరకు ఆయన తన అనుచరులతో సమావేశాలు నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధం చేసుకుంటున్నారని, ఇందులో భాగంగా ఆయన తొలుత శనివారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిసింది. 2015లో బీఆర్ఎస్ ద్వారా ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చిన సుందర్‌రాజ్ యాదవ్ నాటి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్‌తో కలిసి పనిచేశారు. అలాగే 2018 ఎన్నికల్లోనూ వినయ్‌భాస్కర్ విజయం కోసం కృషి చేశారు. ఈ నేపథ్యంలోనే గత గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వరంగల్, ఖమ్మం, నల్లగొండ అభ్యర్థిగా బీఆర్ఎస్ నుంచి పోటీకి ఆసక్తి చూపారు. కానీ బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన ఏనుగుల రాకేష్‌రెడ్డికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బీ ఫాం ఇవ్వడంతో నిరుత్సాహానికి గురైన సుందర్‌రాజ్ కొద్దిరోజులుగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. ఈ క్రమంలోనే ఆయన బీసీ ఇంటలెక్చువల్ కార్యక్రమాల పేరుతో సమావేశాలు నిర్వహించారు. ప్రస్తుతం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీకి సిద్ధమైనట్లు సమాచారం. ఈ పరిణామాలతో సుందర్‌రాజ్ బీఆర్ఎస్‌లో ఉంటారా లేదా బీసీ సంఘాలను కలుపుకొని ఇండిపెండెంట్‌గానే పోటీ చేస్తారా అనేది బీఆర్ఎస్ నాయకుల్లో, శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారింది.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2521	2045
పల్లికాయ (సూక)	6200	5600
పల్లికాయ (పచ్చిది)	4400	4100
కందులు	7022	5560
పెసళ్లు	-	-
పత్తి	7205	5800
పసుపు (కాడి)	-	-
పసుపు (గోల)	-	-
తేజ మిర్చి	15000	9000
తేజ ఏసీ	13600	13000
వండర్‌హాట్ ఏసీ	-	-
యూఎస్341ఏసీ	13600	11000
యూఎస్ 341 కొత్తది	14300	11500
దేశీ ఏసీ	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం





హైదరాబాద్‌లో జరిగిన ఫైనల్ పోటీలో ముగ్గులు వేస్తున్న మహిళలు



పోటీలో పాల్గొన్న మహిళలతో సినీనటి వైష్ణవీ చైతన్య

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ రాష్ట్ర స్థాయి ముత్యాల ముగ్గుల పోటీ ఫైనల్స్




ముగ్గు వేస్తున్న సినీ నటి వైష్ణవీ చైతన్య

"ముత్యాల ముగ్గులు నేలమ్మను పలకరించాయి. చుక్కలతో వేసిన రంగవల్లుల మధ్య గొబ్బెమ్మలు.. చెరుకుగడలు.. పిండి వంటల అలంకరణలతో సంక్రాంతి శోభను ముందే తెచ్చాయి. ఆంధ్రజ్యోతి - ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) తెలంగాణ రాష్ట్ర స్థాయి ఫైనల్స్ పోటీలు హైదరాబాద్‌లోని సనత్‌నగర్ జీహెచ్‌ఎంసీ మున్సిపల్ గ్రౌండ్‌లో ఉల్లాసంగా.. ఉత్సాహంగా శుక్రవారం జరిగాయి. విజేతలకు ముఖ్య అతిథులు సినీనటి వైష్ణవీచైతన్య, సినీనటుడు వడ్లమాని సాయి శ్రీనివాస్ బహుమతులను అందజేశారు."





పోటీలో రంగవల్లులు వేస్తున్న మహిళలు



ముగ్గు వేస్తున్న మహిళ



బహుమతుల ప్రదానోత్సవంలో మాట్లాడుతున్న సినీ నటుడు వడ్లమాని సాయి శ్రీనివాస్, చిత్రంలో న్యాయ నిర్ణేతలు పి. రజని, డాక్టర్ పి. శ్రీలక్ష్మి, నటి వైష్ణవీ చైతన్య, సంతూర్ హైదరాబాద్ ఏరియా మేనేజర్ సంజీవ్ మోదీ, ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్ ఇన్‌చార్జి కృష్ణప్రసాద్

కల్యాణం.. కమనీయం..

వైభవంగా కొత్తకొండ వీరభద్రుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

భీమదేవరపల్లి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : కొత్తకొండ వీరభద్రస్వామి కల్యాణం వేదపండితుల వేదమంత్రోచ్చరణాల మధ్య కన్నుల పండువగా శుక్రవారం రాత్రి జరిగింది. స్వామి వారి కల్యాణానికి ఆలయ చైర్మన్ చంద్రశేఖర్‌గుప్తా, ఈవో కిషన్‌రావులు ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు సమర్పించారు. కొత్తకొండ శ్రీవీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు స్వామివారి కల్యాణంతో ప్రారంభమయ్యాయి. శ్రీవీరభద్రస్వామి ఆలయంలో సాయంత్రం నుంచి అంకురార్పణం, ధ్వజారోహణ, స్వామివారికి రుద్రాభిషేకం, గవ్యాంతం, నిత్యోపాపన, నిత్యహోమం, వాస్తు పూజ, వాస్తుహోమం, వాస్తుబలి, ఉపనిషత్ పారాయణం, ప్రదోశకాల పూజ, గణపతి పూజ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి పల్లకిలో తీసుకువచ్చారు. ఇటీవల రూ. 40 లక్షల వ్యయంతో నిర్మించిన ధ్యాన మండపంలో స్వామివారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీరభద్రస్వామి పక్షాన ఉప ప్రధాన అర్చకులు కంచర్ల రాజయ్య, ముఖ్య అర్చకుడు మొగిళిపాలెం రాంబాబు, తాటికొండ వీరభద్రయ్య, వినయ్‌శర్మ, శివకుమార్, రమేష్, శ్రీకాంత్, శరత్‌చంద్రలు, భద్రకాళి సమేతులైన వీరభద్రస్వామి-భద్రకాళి అమ్మవార్లకు జీలకరబెల్లం పెట్టి కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం మాంగల్యధారణ, అక్షతరోపాణం, దివ్యనీరాజనం, మంత్రపుష్పాలు, మహాదాశీర్వచనం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ సతీమణి మంజుల, ఆమె తండ్రి పెద్ది వెంకటనారాయణగౌడ్‌లో స్వామివారి కల్యాణానికి వచ్చి పట్టువస్త్రాలు సమర్పించారు. కంచర్ల రమాదేవి-వెంకటేశ్వర్లు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కుడా చైర్మన్ ఇనుగాల వెంకటరాంరెడ్డి, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రామాల సునీత, ఆలయ చైర్మన్ చంద్రశేఖర్‌గుప్తా, డైరెక్టర్లు కొంగొండ సమ్మయ్య, కురుమల్ల మంజుల, గానబోయిన కొంరయ్య, బత్తిని శ్రీనివాస్, మాజీ చైర్మన్లు చిట్టంపల్లి అయిలయ్య, పిడిశెట్టి కనకయ్య, ఆర్ వెంకట్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు శ్రీరామోజు శ్రీనివాస్, మాజీ ఎంపీపీ అశోక్‌ముఖర్జీ, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఎల్కతుర్తి సీఐ పులి రమేష్, ముల్కనూర్, వంగర ఎస్‌ఐలు సాయిబాబు, దివ్య తదితరులు పాల్గొన్నారు.



స్వామివారి కల్యాణంలో పాల్గొన్న మంత్రి పొన్నం సతీమణి మంజుల, ఆలయ చైర్మన్, ఈవో

మేమింతే..

(5వ పేజీ తరువాయి)

భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వచ్చినట్టు తెలుస్తోంది. ముఖ్యంగా ఖాకీల పోస్టింగులంటే సదరు నేతకు పండుగేనని, నియోజకవర్గంలో ఏ గ్రామంలో ఏ నాయకుడు కీలకంగా ఉన్నారో కూడా సదరు ఎమ్మెల్యేకు తెలియదని సర్వే రిపోర్టులో పేర్కొన్నట్లు సమాచారం. అంతేకాకుండా తన నియోజకవర్గ పరిధిలో భూ సెటిల్‌మెంట్లలో తలదూర్చటం ద్వారా పార్టీకి చెడ్డ పేరు వస్తుందనే చర్చ జరుగుతోంది. మరో ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకుడే మొత్తం బదిలీలు, సెంటిల్‌మెంట్లలో జోక్యం చేసుకుంటున్నారని, సదరు ఎమ్మెల్యేకు కూడా నియోజకవర్గంపై పూర్తి స్థాయిలో పట్టులేదని సర్వేలో తేలినట్టుగా సమాచారం. ప్రభుత్వం పేదలకు అందిస్తున్న రేషన్ బియ్యాన్ని ఓ ఎమ్మెల్యే తన అనుచరులతో కలిసి అక్రమంగా ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారని, బియ్యం దందాను అడ్డుకోవల్సిన నాయకుడే రేషన్‌మాఫియాతో చేతులు కలపడంపై రిపోర్టులో ప్రత్యేకంగా పేర్కొన్నట్టు తెలిసింది. ఇదే రేషన్ మాఫియాకు ప్రభుత్వంలో కీలకంగా ఉన్న ఓ మంత్రి కూడా సహకరిస్తున్నారనే చర్చ ఉంది. అలాగే ఏజెన్సీ జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యే గుట్కా మాఫియాను ప్రోత్సాహిస్తున్నారనే ఆరోపణలున్నట్టు సమాచారం. ఇదే ప్రాంతానికి చెందిన మరో ఎమ్మెల్యే క్యాడర్‌తో సరిగ్గా వ్యవహరించడం లేదని, బదిలీలతో పాటు ఇతర వ్యవహరలన్నీ కూడా ఆయన సతీమణి పర్యవేక్షించటంతో కార్యకర్తల్లో అసంతృప్తికి కారణంగా ప్రచారం జరుగుతోంది. ఇక ఇసుక అక్రమ దందాలో ఓ మంత్రి అనుచరుడు కీలకంగా వ్యవహరిస్తు.. ఓ జిల్లానే శాసిస్తున్నాడనే చర్చ జరుగుతుంది. మరో ఎమ్మెల్యే తీరుపై కూడా కేడర్‌లోనూ, పార్టీలోనూ అసంతృప్తి వ్యక్తమవుతోంది. అటు ప్రజలకు... ఇటు పార్టీకి కూడా దూరంగా ఉంటున్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.

ఎవరా మంత్రి...?

సీఎం రేవంత్‌రెడ్డి సర్వేలో ముగ్గురు మంత్రులపై తీవ్ర వ్యతిరేకత ఉన్నట్లుగా రిపోర్టు వచ్చినట్టుగా ప్రచారం జరుగుతోంది. ఈ ముగ్గురిలో ఒకరు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మంత్రి ఉన్నారని సమాచారం. భూదాందాలు, సెటిల్‌మెంట్‌లు, ఇసుక దందాలతో పాటు ప్రజలకు, కేడర్‌కు దూరంగా ఉంటున్నారని సీఎంకు రిపోర్టు వచ్చిందని సమాచారం. అయితే ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇద్దరు మంత్రులు ఉండగా, జిల్లా పరిధిలో వి లీనమైన మండలాల్లో మరో ఇద్దరు మంత్రులున్నారు. డేంజర్ జోన్‌లో ఉన్న మంత్రులపై అధిష్ఠానం కూడా సీరియస్‌గా ఉందనే చర్చ జరుగుతోంది. సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన తరువాత డేంజర్ జోన్‌లో ఉన్న మంత్రులు, ఎమ్మెల్యేలతో సమీక్షించే అవకాశం ఉందని, అవసరమైతే ఒకరిద్దరు మంత్రులకు ఉద్వాసన పలికే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది. దీంతో సర్వే రిపోర్టు సర్వత్రా ఆసక్తికరంగా మారగా, డేంజర్ జోన్‌లో ఉన్న మంత్రి ఎవరనేది చర్చనీయాంశమైంది. ఇక ఇటీవల జరిగిన యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో గెలిచిన ఓ వారసుడు వ్యవహారంపై కూడా ప్రజల్లో- ముఖ్యంగా సొంత పార్టీ నేతల్లో అసంతృప్తి వ్యక్తం అవుతున్నట్టుగా సమాచారం. తన నియోజకవర్గంలో జోక్యం చేసుకుంటున్నారని స్వయంగా ఓ ఎమ్మెల్యేనే అధిష్ఠానానికి ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. దీంతో అనవసరపు విషయాల్లో తలదూర్చవద్దని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ సైతం సదరు వారసుడిని హెచ్చరించినట్టు చెబుతున్నారు. అంతేకాకుండా ఓరుగల్లు ఎమ్మెల్యేలు, మంత్రులు మధ్య విభేదాలు రచ్చకెక్కిన నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ఇతర నేతల సయోధ్య కుదిర్చినా అంతర్గతంగా ఆధిపత్యం తగ్గటం లేదని అధిష్ఠానానికి నివేదికలు వెళ్లాయి. ఒకరిద్దరు ఎమ్మెల్యేలు, మంత్రుల వ్యక్తిగత సహాయకులు సైతం తెరవెనుక చేస్తున్న దందాలు పార్టీకి, క్యాడర్‌కు చిరాకును కలిగించేలా ఉన్నాయనే చర్చ జరుగుతోంది.



వరంగల్ బట్టలబజార్‌లో వేంకటేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు



హనుమకొండ చైతన్యపురి వేంకటేశ్వర ఆలయంలో ఉత్తరద్వారంలో స్వామివారు



నేత్రపర్వం.. వైకుంఠ ద్వార దర్శనం

భక్తి శ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి

హనుమకొండ కల్చరల్/వరంగల్ కల్చరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సూర్యుడు ఉత్తరాయణానికి మారే ముందు వచ్చే ధనుర్మాసశుద్ధ ఏకాదశి వేళ శుక్రవారం వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. ఓరుగల్లు నగరంతో పాటు వరంగల్, హనుమకొండ జిల్లాల వ్యాప్తంగా వైష్ణవ ఆలయాలకు భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామునే ఉత్తర ద్వార దర్శనానం కోసం బారులు తీరారు. మహిళలు మంగళ హారతులతో స్వామివార్లకు నీరాజనాలు పలికారు. హనుమకొండలోని ప్రసిద్ధ వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని విష్ణు ఆలయం ఎదురుగా ప్రత్యేక వేదికపై సీతారామచంద్రస్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని ప్రతిష్ఠింపజేసి శ్రీసూక్త విధానంతో పాంచరాత్ర ఆగమానుసారం కలకుంట్ల మేఘనాథచార్యులు ఇతర వేద పండితుల ఆధ్వర్యంలో లక్ష తులసీదళాలతో అర్చన నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. హనుమకొండ బ్రాహ్మణవాడలోని హనుమద్‌గిరి రంగనాయక దేవాలయం పెద్ద కోవెలలో ఉత్తర ద్వారా దర్శనం నేత్రపర్వంగా జరిగింది. ఆలయ అర్చకులు కలకోట రాఘవచార్య, నర్సింహాచార్యల ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో మహిళలు పెద్ద సంఖ్యలో మంగళ హారతులతో పాల్గొన్నారు. సీతారామచంద్రస్వామి ఆలయ చిన్న కోవెలలో చెరుకుపల్లి నర్సింహాచార్య ఆధ్వర్యంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు జరిగాయి. హనుమకొండ అదాలత్ సమీపంలోని శ్రీభూనీళ సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన వేడుకలలో ఆలయ కమిటీ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎక్సైజ్ కాలనీ వెంకటేశ్వరాలయం, ఏకశిల పార్కు సమీపంలోని శ్రీరామాలయం, చైతన్యపురిలోని వెంకటేశ్వర ఆలయం, కాజీపేటలోని శ్వేతార్క మూల దేవాలయం, వడ్డెపల్లిలోని టీచర్స్ కాలనీ ఫేస్ -2 వెం కటేశ్వర ఆలయంలో కూడా ఉత్తర ద్వారాదర్శనం వేడుకలు ఘనంగా జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఇక వరంగల్ బట్టల బజార్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో తెల్లవారుజామున మూడు గంటలకే స్వామివారికి అభిషేకం, అలంకరణ నిర్వహించారు. ఆలయ చైర్మన్ పరాశరం శ్రీనివాసాచార్యులు, ఈవో రత్నాకర్‌రెడ్డి, ఎన్‌ఎస్ అధికారి శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో భక్తుల దర్శనానికి ఏర్పాట్లు చేశారు. గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి-ప్రభాకర్ దంపతులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. గీతా భవన్‌లో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం, ఎల్లంబజార్‌లోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయం, భద్రకాళి దేవస్థానం రోడ్డులోని సింహద్రిబాగ్ శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని దేవాలయాల్లో వైకుంఠ ఏకాదశి పూజలు జరిగాయి.

పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు, వ్యాపారులు, ప్రముఖులు స్వామివార్లను దర్శించుకున్నారు. వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం భద్రకాళి అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు వేలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాకుండా ఆలయ ఈవో శేషు భారతి, సూపరింటెండెంట్ విజయ్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



వేయిస్తంభాలగుడిలో సీతారామచంద్రస్వామికి లక్ష తులసి అర్చన నిర్వహిస్తున్న అర్చకులు





బాలానగర్ వేంకటేశ్వరాలయంలో దర్శనం కోసం బారులు తీరిన భక్తులు, ఏకశిలా పార్కు సమీపంలోని ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

వరంగల్ మెడికల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ప్రభుత్వ మెటర్నిటీ హాస్పిటల్(జీఎంహెచ్) సూపరింటెండెంట్ డాక్టర్ బి.విజయలక్ష్మి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్‌ఖన్నా, హనుమకొండ జిల్లా యూనియన్ జాయింట్ సెక్రటరీ భరతపురం సంధ్య, ఓళపాక సందీప్ కుమార్, ఆకుల కుమార్, తౌటం వరుణ్ తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయలక్ష్మి

మావోయిస్టు నేత తల్లికి పోలీసుల పరామర్శ

▸▸ నిత్యావసర వస్తువులు, దుప్పట్లు, చీర అందజేత

వరంగల్ క్రైం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): హసన్‌పర్తి మండలం వంగపహాడ్‌కు చెందిన మావోయిస్టు నేత మంద రూబెన్ అలియాస్ మంగన్న గత 40 ఏళ్లుగా అజ్ఞాతంలో ఉంటుండగా ఆయన తల్లి చంద్రమ్మను శుక్రవారం సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా పరామర్శించారు. ఈ సందర్భంగా చంద్రమ్మ ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీసి చీర, నిత్యావసర వస్తువులు, దుప్పట్లను అందజేశారు. అనంతరం డీసీపీ మాట్లాడుతూ ఎన్నోఏళ్లుగా అజ్ఞాతంలో ఉండి మావోయిస్టు పార్టీలో సాధించింది శూన్యమని, ఇకనైన రూబెన్ అజ్ఞాతం వీడి జనజీవన స్రవంతిలోకి రావాలని సూచించారు. రూబెన్ ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలో కలిస్తే ఆయనపై ఉన్న రివార్డుతో పాటు ప్రభుత్వం నుంచి వచ్చే ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ తిరుమల్, హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ చేరాలు, ఎస్సై రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులను ప్రతి ఒక్కరూ ఆదరించాలి

వడ్డెపల్లి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులను సమాజంలోని ప్రతి ఒక్కరూ ఆదరించి, ధాతృత్వం చాటాలని వెంటోయిస్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు కాసర్ల ప్రశాంత్, ఎం. దివాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని డాక్టర్ నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో దివ్యాంగులకు కృత్రిమ అవయవాల పంపిణీ, దంత స్క్రీనింగ్ శిబిరాన్ని వెంటోయిస్ సీఈవో, ఎన్ఆర్ఐ కోట సుమన్‌రెడ్డి, టీటీఏ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ జంధ్యం దివాకర్‌ల ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ ఆఫ్ ఖమ్మం, రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ సహకారంతో నిర్వహించారు. సుమారు 110 మందికి కృత్రిమ కాళ్లను (అవయవాలను) అమర్చారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం రోటరీ క్లబ్ ప్రతినిధి రంగారావు, డాక్టర్ జంధ్యం మధూకర్, జంధ్యం కరుణాకర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధి డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, వెంటోయిస్ సంస్థ ప్రతినిధులు కె.సాయిసందీప్, ఎం.చైతన్య, కోట రాధాకిషన్‌రెడ్డి, టి.ప్రశాంత్, ఆర్.శ్రావణ్‌శెట్టి, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి

▸▸ విచారణ అధికారులకు వీహెచ్‌పీ నేతల వినతి

హసన్‌పర్తి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : టీజీఆర్‌జేసీ హసన్‌పర్తి బాలికల కళాశాలలో అన్యమత ప్రచారాన్ని ప్రోత్సహిస్తున్న ప్రిన్సిపాల్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వీహెచ్‌పీ నేతలు గురువారం విచారణ అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎర్రగట్టుగుట్ట క్రాసు రోడ్డులోని తెలంగాణ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఇందుమతిపై వచ్చిన ఆరోపణలపై టీజీఆర్‌ఈఐ హైదరాబాద్ సొసైటీ డిప్యూటీ సెక్రటరీ శ్రీనివాస్ ప్రసాద్ విచారణ అధికారిగా హాజరయ్యారు. విషయం తెలుసుకున్న వీహెచ్‌పీ నేతలు కళాశాలకు చేరుకున్నారు. కళాశాలలో అన్యమత ప్రచారం, నిధుల దుర్వినియోగం, చెట్ల నరికివేత, విద్యార్థుల నుంచి డబ్బుల వసూళ్లకు పాల్పడిన ప్రిన్సిపాల్‌పై పలు అవినీతి ఆరోపణలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ప్రిన్సిపాల్ వచ్చిన ఆరోపణలపై న్యాయంగా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వీహెచ్‌పీ నేతలు విచారణ అధికారిని కోరారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ నేతలు నాగుల ఓం కుమార్, నాతి రమేష్, పప్పుల రమేష్, బండారు కుమార్, బూర శ్రీనివాస్, బూర శ్రీధర్ తదితరులున్నారు.

మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా బంక సరళ

▸▸ వరుసగా రెండోసారి దక్కిన అవకాశం



సునితారావు నుంచి నియామక పత్రాన్ని అందుకుంటున్న సరళ

హనుమకొండసిటీ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా నియమితులైన బంక సరళకు రాష్ట్ర అధ్యక్షురాలు సునితారావు ముదిరాజ్ నియామక పత్రాన్ని అందచేశారు. శుక్రవారం హైదరాబాద్ గాంధీభవన్‌లో జరిగిన కార్యక్రమంలో బంక సరళను అభినందిస్తూ నియామక పత్రాన్ని ఇచ్చారు. హనుమకొండ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా బంక సరళ రెండవసారి ఎంపికయ్యారు. నియామక పత్రాన్ని అందుకోవడంతో ఆమె తిరిగా అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టారు. నియామకానికి సహకరించిన హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, సీతక్క, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, ఎమ్మెల్యేలు నాగరాజు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణకు బంక సరళ కృతజ్ఞతలు తెలియచేశారు.

కేయూ ఆర్ట్స్ డీన్ ప్రొఫెసర్ జ్యోతి కన్నుమూత



జ్యోతి (ఫైల్)

కేయూ క్యాంపస్ జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ ఆర్ట్స్ విభాగాల డీన్, తెలుగు శాఖాధ్యక్షురాలు, బోర్డు ఆఫ్ స్టడీ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ ఏటూరు జ్యోతి(50) అనారోగ్యంతో గురువారం రాత్రి కన్నుమూశారు. హనుమకొండ ప్రకాశ్‌రెడ్డిపేటలోని ఆమె స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధాపడుతున్న జ్యోతి చికిత్స పొందుతున్నారు. ప్రొఫెసర్ జ్యోతికి భర్త, కుమారుడు, కూతురులున్నారు. ప్రొఫెసర్ జ్యోతి కాకతీయ యూనివర్సిటీ తెలుగు విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా 2007లో నియమితులయ్యారు. ప్రస్తుతం కేయూ తెలుగు విభాగాధిపతిగా, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా, ఆర్ట్స్ విభాగాల డీన్‌గా కొనసాగుతున్నారు. గతంలో వర్సిటీలో మహిళా అధ్యయన కేంద్రం డైరెక్టర్‌గా, వర్సిటీ కేంద్ర గ్రంథాలయం మెంబర్ ఇన్‌చార్జిగా, కేయూ ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్, జండర్ స్టడీస్ విభాగాధిపతిగాను సమర్థవంతంగా పనిచేశారు. తెలుగు విభాగంలో నిర్వహించిన అనేక జాతీయ సదస్సులకు కన్వీనర్‌గా వ్యవరించారు. ప్రొఫెసర్ జ్యోతి అంత్యక్రియలు హనుమకొండలో నిర్వహించారు.

కేయూ వీసీ, రిజిస్ట్రార్‌తో వర్సిటీ అధికారుల నివాళి..

హనుమకొండ లోటస్‌కాలనీలో ప్రొఫెసర్ జ్యోతికి కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్, పాలక మండలి సభ్యుడు ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్ , డాక్టర్ చిర్రా రాజుగౌడ్, అకూట్ జనరల్ సెక్రటరీ ప్రొఫెసర్ మామిడాల ఇస్తారీ, కేయూ స్పోర్ట్స్ బోర్డు డైరెక్టర్ ప్రొఫెసర్ వై.వెంకయ్య దిగ్భ్రాంతికి గురైయ్యారు.

వైభవంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు



కాజీపేటలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ రాఘవరెడ్డి దంపతులు



టీచర్స్ కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారిని దర్శించుకుంటున్న మహిళలు

ఆలయాల్లో భక్తుల సందడి

అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు

వడ్డెపల్లి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండలోని వివిధ డివిజన్లలో గల శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయాల్లో వైకుంఠ ఏకాదశి వేడుకలను వైభవంగా నిర్వహించారు. శుక్రవారం భక్తులు ఆలయాలకు తరలివచ్చి అర్చనలు, అభిషేకాలతో పాటు శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. హనుమకొండ 60వ డివిజన్ వడ్డెపల్లిలోని టీచర్స్ కాలనీ -1 , ఎస్‌బీహెచ్ కాలనీలోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు చిర్ర రఘుపతిరెడ్డి, కమిటీసభ్యులు ఆర్.కుమారస్వామి, జితేందర్‌రెడ్డి, స్వరూపరాణి పర్యవేక్షణలో వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నేత్రపర్వంగా నిర్వహించారు. తొలుత ఉదయం ఉత్తర ద్వార దర్శనం జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అఖండ విష్ణు సహస్రపారాయణం నిర్వహించారు. భక్తుల తాకిడితో దేవాలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తుల భజన కీర్తనలతో ఆలయప్రాంగణం మార్మోగింది. టీచర్స్‌కాలనీ అధ్యక్షుడు పింగిళి రాంరెడ్డి, సత్యనారాయణ, ఎస్‌బీహెచ్ కాలనీ అధ్యక్షుడు రాజేశ్వర్‌రావుతో పాటు నవనీత, నిర్మల, రుద్ర, శారద, వసంత, పార్వతి, వకుళ, శేషగిరి తదితర భక్తులు పాల్గొని శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకొని కొలిచి ప్రత్యేక పూజలు చేశారు. హనుమకొండ ఎన్జీవోస్ కాలనీ 100 ఫీట్ల రోడ్డులోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో, వడ్డెపల్లిలోని శ్రీసీతారామాంజనేయ స్వామి దేవాలయంలో వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని కొలిచి తరించారు.

● కాజీపేట : కాజీపేట జూబ్లీ మార్కెట్ అభయాంజనేయ స్వామి దేవాలయంలో, విష్ణుపురి శ్వేతార్క మూలగణపతి దేశాలయంలో వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఉదయం ఉత్తర ద్వార దర్శనం, ఉత్తవమూర్తులకు పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం ఆకుపూజ లక్షపుష్పార్చనతో అలంకరణ చేశారు. అభయాంజనేయ స్వామి దేవాలయంలో జరిగిన ఈ వేడుకలకు వరంగల్ పశ్చిమ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్, రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి దంపతులు, రాష్ట్ర బ్రహ్మణ సేవాసంఘం సమాఖ్య అధ్యక్షుడు వెన్నంపల్లి జగన్‌మోహన్ శర్మ హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

హనుమాన్ యూత్ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐనవోలు రాధాకృష్ణ శర్మ, సాయికృష్ణ వర్మలు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. మెడికవర్ ఆసుపత్రి సిబ్బంది భక్తులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.

● హసన్‌పర్తి : మండలంలోని ఎర్రగట్టు వెంకటేశ్వరస్వామి దేవాలయంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు తెల్లవారు జామునే ఎర్రగట్టు వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు వేదాంతం పార్థసారదాచార్యులు, ఆరుట్ల శ్రీధరాచార్యులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించి ఆశీర్వదించారు. ఏకాదశి పర్వదినం కావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది.

వంద శాతం పన్నుల వసూళ్లు జరగాలి

వరంగల్ కార్పొరేషన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో ప్రజల నుంచి వంద శాతం పన్నుల వసూళ్లు చేపట్టాలని వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి ఆదేశించారు. శుక్రవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో బిల్‌కలెక్టర్లు, వార్డ్ ఆఫీసర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఇంకా ఇందిరమ్మ ఇండ్ల సర్వే పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడారు. 2024 25 ఆర్థిక సంవత్సరానికి రూ.114 కోట్ల పన్నుల లక్ష్యంగా పని చేయాలన్నారు. ఇప్పటి వరకు రూ.42కోట్లు వసూలు జరిగాయన్నారు. ఈ నెల చివరి వరకు 60 శాతం పన్నుల వసూలు జరగాలన్నారు. బిల్‌కలెక్టర్లు, వార్డ్ అధికారుల తీరుపై ఉన్నతాధికారులు పర్యవేక్షించాలన్నారు. బిల్‌కలెక్టర్ల కోరికమేరకు త్వరలో గుర్తింపుకార్డులు ఇస్తామని అన్నారు.కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, డీసీటీ కృష్ణారెడ్డి, రవీందర్, పన్నుల విభాగం అధికారి శ్రీనివాస్, ఐటీ రమేష్, ఆర్‌వోలు శ్రీనివాస్, శహజాదిబేగం,యూసుఫ్,వార్డ్‌ఆఫీసర్లు, బిల్‌కలెక్టర్లు పాల్గొన్నారు.

వివేకానంద జీవితం అనుసరణీయం : సీపీ

హసన్‌పర్తి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : స్వామి వివేకానంద జీవితం విద్యార్థులకు అనుసరణీయమని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా అన్నారు. ఎల్లాపూర్ ఆర్బిట్ పాఠశాలలో స్వామి వివేకానంద జన్మదిన వేడుకలను పాఠశాల కరస్పాండెంట్ చిట్టిరెడ్డి భగవాన్‌రెడ్డి, జేడీ సంస్థ కోఆర్డినేటర్ శివప్రసాద్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అంబర్ కిశోర్ ఝా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. స్వామి వివేకానంద జీవితం భారతదేశ సంస్కృతి సాంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనమన్నారు. భారతదేశ ఔన్నత్యాన్ని ప్రపంచ దేశాలకు చాటి చెప్పిన మహనీయుడని అన్నారు. వివేకాందనస్వామి జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు జీవితంలో గొప్ప స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం వివిధ పోటీలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాజీపేట ఏసీపీ పుప్పాల తిరుమల్, కొత్తగూడెం సుమన్ టీవీ సీఈవో గుజ్జారి శ్రీధర్‌బాబు, ఇన్‌కం ట్యాక్స్ ప్రాక్టీసనర్ సావిత్రి లక్ష్మణచర్య, పాఠశాల వ్యవస్థాపకురాలు చిట్టిరెడ్డి హారికా భగవాన్‌రెడ్డి, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

తినుబండారాల తయారీ కేంద్రాలపై దాడులు


వరంగల్ క్రైం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): అపరిశుభ్రమైన పిండి పదార్థాలు (ఖార, బొంది, శేకోడీలు)లను తయారు చేస్తూ గ్రేటర్‌లోని పలు బేకరీలు, కిరాణషాపులకు సరఫరా చేస్తున్న తయారీ కేంద్రంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు, ఫుడ్ ఇన్స్‌పెక్టర్ రామకృష్ణ కలిసి దాడులు చేసినట్లు ఏసీపీ మధుసూదన్ తెలిపారు. మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తయారీ కేంద్రంపై దాడులు చేసి విక్రయించడానికి సిద్ధంగా ఉన్న రూ.48,000 విలువ చేసే పిండి పదార్థాల ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

స్పోర్ట్స్ విలేజ్ ఏర్పాటుకు కృషి

(5వ పేజీ తరువాయి)

క్రీడాకారులు పాల్గొనడం జరిగిందని అన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి నగరానికి వచ్చిన క్రీడాకారులు ఓరుగల్లు నగరంలో సుప్రసిద్ధ దేవాలయాలు, చారిత్రక కట్టడాలను తిలకించారని అన్నారు.

సెపక్‌తక్రా అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెక్కల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడానికి వచ్చిన క్రీడాకారులకు బస, భోజన వసతి ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. క్రీడా పోటీల్లో తొలి రోజు టీం ఈవెంట్‌లో లీగ్ దశలో పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. టీం ఈవెంట్, రెగో, డబుల్స్, కాడ్ విభాగాల్లో ఐదు రోజుల పాటు పోటీలు కొనసా గుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సెపక్‌తక్రా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు ఎస్ఆర్. ప్రేమ్ రాజ్, ప్రధాన కార్యదర్శి వీరగౌడ్, కోశాధికారి నరేష్, ఒలంపిక్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్య క్షుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ అజీజ్ ఖాన్, హనుమకొండ జిల్లా డీవైఎస్‌వో గుగులోత్ అశోక్‌కుమార్, సెపక్‌తక్రా జిల్లా ప్రధాన కార్యదర్శి జితేంద్రనాథ్, బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావుపద్మ, బీజేపీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షురాలు చందుపట్ల కీర్తిరెడ్డి, మాజీ మేయర్ టి.రాజేశ్వర్‌రావు, ఒలంపిక్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు మంచాల స్వామిచరణ్, వివిధ జిల్లాలకు చెందిన సెపక్‌తక్రా అధ్యక్ష, కార్యదర్శులు, పీఈటీలు, పీడీలు, టెక్నికల్ అఫీషియల్స్ రెఫరీలు తదితరులు పాల్గొన్నారు. ప్రారంభ కార్యక్రమంలో నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన చిన్నారులు చేసిన స్వాగతోపన్యాస నృత్యం, బంజారా నృత్యం ఆకట్టుకున్నాయి.



టీం ఈవెంట్‌లో తలపడుతున్న క్రీడాకారుడు

ఘనంగా సంక్రాంతి సంబురాలు



ఏకశిల విద్యా సంస్థలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న విద్యాసంస్థల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి



షైన్ పాఠశాలలో ముగ్గులు వేస్తున్న విద్యార్థులు

హసన్‌పర్తి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెంబర్తి ఏకశిల టెక్నో స్కూల్‌లో శుక్రవారం ముందస్తు సంక్రాంతి సంబురాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపక సిబ్బంది, యాజమాన్యం సాంప్రదాయ దుస్తులు ధరించి వేడుకలలో పాల్గొన్నారు. ఆడపిల్లలు రంగవల్లులతో అలరించగా మగ పిల్లలు పతంగులు ఎగురవేస్తూ కేరింతలతో గడపడం విద్యాలయ ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ సందర్భంగా బొమ్మల కొలువులు, పాల పొంగులు, భోగి మంటలు వేయటమే కాకుండా చిన్న పిల్లలకు భోగి పండ్లు పోసి ఆశీర్వదించారు. అంతేకాకుండా హరిదాసుల హడావిడి, కోడి పందాలు, కోలాటాలతో ముందస్తు సంక్రాంతి పండుగను అలరించారు. ఈ సందర్భంగా ఏకశిల విద్యా సంస్థల చైర్మెన్ డాక్టర్ గౌరు తిరుపతిరెడ్డి విద్యార్థులుద్దేశించి మాట్లాడారు. పాఠశాలలో ఇలాంటి పండుగలు నిర్వహించడం వల్ల మన యువతరాలు సాంస్కృతిక వారసత్వాన్ని సంరక్షించడానికి సహాయపడతా యని, ఇవి సజీవంగా ఉండడానికి వేదికలుగా పనిచేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో విద్యా సంస్థల డైరెక్టర్ గౌరు సువిజారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ స్వర్ణరాజు, అకాడమిక్ ఇంచార్జి రాంప్రసాద్; పవన్, శ్రీనివాస్, వీరేశం, ధనలక్ష్మి, కీర్తన, మాధవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

షైన్ పాఠశాలలో...

హనుమకొండ టౌన్: హనుమకొండ బాలసముద్రంలోని షైన్ పాఠశాలలో ఘనంగా సంక్రాంతి సంబరాలు శుక్రవారం నిర్వహించారు. షైన్ పాఠశాలల విద్యాసంస్థల చైర్మన్ మూగల కుమార్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు ముగ్గులు వేసి భోగి మంటలు, పతంగులు ఎగరవేసి సంబరాలు జరుపడం పట్ల పాఠశాల ఉపా ధ్యాయులను షైన్ విద్యాసంస్థల చైర్మన్ మూగల కుమార్ యాదవ్ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శిశు తరగతి పిల్లలకు భోగి పండ్లు పోసి ఉపాధ్యాయులు ఆశీర్వదించారు.

ఈ కార్యక్రమంలో షైన్ పాఠశాలల కరస్పాండెంట్ రమ, ప్రిన్సిపాల్ సబిత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో బల్దియా చైన్‌మెన్ మృతి

▸▸ సంతాపం వ్యక్తం చేసిన టౌన్ ప్లానింగ్ అధికారులు



సురేష్ (ఫైల్)

వరంగల్ కార్పొరేషన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కాశిబుగ్గ సర్కిల్ పరిధిలో టౌన్ ప్లానింగ్ విభాగంలో ప్రభుత్వ చైన్‌మెన్‌గా పనిచేస్తున్న బొజ్జ సురేష్(45) గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, తోటి ఉద్యోగులు తెలిపిన వివరాల ప్రకారం... ఖిలావరంగల్ ప్రాంతానికి చెందిన సురేష్ వరంగల్ పోతననగర్‌లో నివాసం ఉంటూ 20 సంవత్సరాలుగా బల్దియా టౌన్ ప్లానింగ్ విభాగంలో చైన్‌మెన్‌గా పని చేస్తున్నాడు. గురువారం సాయంత్రం విధులు ముగించుకుని ఇంటికి వెళుతున్న క్రమంలో మార్గమధ్యలో చాతి నొప్పి వస్తుందని సమీపంలో ఉన్న వారితో చెప్పాడు. వెంటనే చికిత్స కోసం ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో మృతి చెందినట్టు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. సురేష్ మృతి చెందినట్టు తెలుసుకున్న బల్దియా సిబ్బంది వెంటనే ఇంటికి వెళ్లి కుటుంబాన్ని పరామర్శించారు. దహన సంస్కారాల కోసం తక్షణ సహాయంగా రూ. 30వేలు అందించారు. మృతుడి కుటుంబానికి రావాల్సిన బెనిఫిట్స్ త్వరగా వచ్చేందుకు పూర్తి సహకారం అందిస్తామని అధికారులు తెలిపారు. మృతుడి కుటుంబాన్ని కలిసిన వారిలో అసిస్టెంట్ సిటీ ప్లానర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు, చైన్‌మెన్‌లు ఉన్నారు.

లొట్టపీసు కేసయితే భయమెందుకు?

▸▸ వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

మడికొండ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఏసీబీ ఎంక్వయిరీకి రమ్మంటే తనపై నమోదైంది లొట్టపీసు కేసు అని కొట్టిపారేసే మాజీ మంత్రి కేటీఆర్ మరి హైకోర్టు, సుప్రీంకోర్టుల చుట్టూ ఎందుకు తిరుతున్నాడని వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజు అన్నారు. లొట్టపీసు కేసు అయినప్పుడు భయపడాల్సిన అవసరం ఎందుకని కేటీఆర్‌ను ఆయన ప్రశ్నించారు. గ్రేటర్ వరంగల్ 64వ డివిజన్ మడికొండలో రూ.3.5కోట్ల నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శుక్రవారం నగర మేయర్ గుండు సుధారాణి, స్థానిక కార్పొరేటర్ ఆవాల రాధికారెడ్డితో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అంతకుముందు ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని ఎమ్మెల్యే మెట్టుగుట్టపై మెట్టు రామలింగేశ్వరస్వామి, సీతారామచంద్రస్వామి ఆలయాలను దర్శించుకున్నారు. అనంతరం మడికొండలో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ విలీన గ్రామాల అభివృద్ధికి ఎక్కువ నిధులు మంజూరు చేయాలని మేయర్ సుధారాణిని కోరారు. మడికొండ చౌరస్తా నుంచి ధర్మసాగర్ రోడ్డు వరకు రోడ్డు విస్తరణకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈసందర్భంగా కార్పొరేటర్ ఆవాల రాధికారెడ్డి మాట్లాడుతూ డంపిగ్ యార్డు సమస్య పరిష్కారం కోసం నిరాహార దీక్ష చేస్తానని తెలిపారు.

మడికొండ, రాంపూర్ శివారులోని చెత్త డంపింగ్ యార్డును తప్పకుండా అక్కడి నుంచి తరలిస్తామని ఎమ్మెల్యే నాగరాజు స్పష్టం చేశారు. తాను మీకు మాట ఇచ్చానని, అలాగే మడికొండలో జరిగిన నిండు సభలో కాకతీయ యూనివర్సిటీ ప్రక్షాళన కావాలని, ఎయిర్‌పోర్టు రావాలని, కోచ్ ఫ్యాక్టరీ కావాలని, డంపింగ్‌యార్డు తొలగించాలని సీఎం రేవంత్‌రెడ్డి వద్ద మాట తీసుకున్నానని, అదే కమిట్‌మెంట్‌తో పని చేస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో మెట్టుగుట్ట చైర్మన్ రఘుచందర్, మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు సారంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కుర్ల మోహన్, బిల్ల రవిందర్, భైరి లింగమూర్తి, కర్ర హరీష్‌రెడ్డి, వస్కుల శ్రీను, నాగరాజు పాల్గొన్నారు.

నిలిచిన ఆరోగ్యశ్రీ సేవలు

▸▸ ప్రభుత్వ ఆస్పత్రులకు పరుగులు



ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేస్తున్నట్లు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

వరంగల్ మెడికల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా బిల్లులు చెల్లించకపోవడంతో సేవలు నిలిపివేస్తున్నట్లు ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 50ఆస్పత్రులుండగా, కేవలం గ్రేటర్ పరిధిలోనే 40 వరకు ఆస్పత్రులు కొనసాగుతున్నాయి. ఇందులో 20 మల్టీ స్పెషాలిటీ, రెండు స్పెషాలిటీలు, మిగతా ఆస్పత్రులు కొనసాగుతున్నాయి. 50 నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ప్రతీ రోజు సుమారు 3 వేల 500 మంది ఓపీ విభాగం ద్వారా చికిత్స పొందుతున్నారు. సుమారు 50 నుంచి 100 వరకు శస్త్రచికిత్సలు నిర్వహిస్తుంటారు. శుక్రవారం ఆస్పత్రుల ప్రతినిధులు ఓపీ సేవలతోపాటు శస్త్ర చికిత్సలను ఆరోగ్యశ్రీ ద్వారా నిలిపివేయడంతో చేసేదేమి లేక ఎంజీఎం ఆస్పత్రి, హైదరాబాద్‌లోని ఉస్మానియా, గాంధీ, నిమ్స్ తదితర ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్యాకేజీని పెంచినట్లు ప్రకటించింది. ఈ ప్యాకేజీలో అన్ని విభాగాలకు శస్త్రచికిత్సలు పెంచకుండా కొన్ని రకాల శస్త్రచికిత్సలకు మాత్రమే పెంచి నెట్‌వర్క్ ఆస్పతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు ఆస్పత్రుల ప్రతినిధులు పేర్కొంటున్నారు. హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆస్పత్రులకు ఒక ప్యాకేజీ, తెలంగాణ జిల్లాలోని ఆస్పత్రులకు మరో ప్యాకేజీ అందిస్తు వివక్ష చూపుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

సఫలం కాని చర్చలు

ఆరోగ్యశ్రీ బకాయిలపై గురువారం ప్రభుత్వ ప్రతినిధులతో జరిపిన చర్చలు సఫలం కాలేదని నెట్‌వర్క్ ఆస్పత్రుల యజమానులు పేర్కొంటున్నారు. 5 శాతం బడ్జెట్ విడుదల చేసి సేవలను కొనసాగించాలని పేర్కొంటున్నట్లు తెలిపారు. ఈ విషయంపై ఆలోచిస్తామని చెప్పామే తప●ఊప సేవలు కొనసాగిస్తామని ప్రకటించలేదని ఆరోగ్యశ్రీ ప్రతినిధులు స్పష్టం చేశారు.

వచ్చే ఏడాది నిట్‌లో స్టార్టప్ ఎకోసిస్టమ్

▸▸ పేటెంట్లు, స్టార్టప్‌ల అభివృద్ధికి కృషి

▸▸ నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధీ

▸▸ ఘనంగా టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ అగ్రిమెంట్ ఈవెంట్



టెక్నాలజీని ట్రాన్స్‌ఫర్ చేసుకుంటున్న వరంగల్ నిట్, ఐఐటీ రోపర్ ప్రతినిధులు

హనుమకొండ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : వచ్చే ఏడాది కాలంలో వరంగల్ నిట్ క్యాంపస్‌లో స్టార్టప్ ఎకోసిస్టమను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, విద్యార్థులు, అధ్యాపకులు కంపెనీలను ప్రారంభించేలా ప్రోత్సహిస్తామని వరంగల్ నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి అన్నారు. శుక్రవారం వరంగల్ నిట్‌లోని సెమినార్ హాల్‌లో టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ అగ్రిమెంట్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించారు .మెథడ్ ఫర్ కంటిన్యూస్ ప్రొడక్షన్ ఆఫ్ సిల్వర్ నానేవైర్స్ ఫర్ ఎలక్ట్రికల్లీ కండక్టివ్ అడెసివ్ అండ్ ఇంక్ అప్లికేషన్స్ అనే టెక్నాలజీ వసంతబాలకి ఫంక్షనల్ మెటీరియల్ ప్రైవేట్ లిమిటెడ్, కెమోటికో టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్, వరంగల్ నిట్, ఐఐటీ రోపర్ మధ్య బదిలీ అయింది. భారత ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ సమకూర్చిన నిధులతో వరంగల్ నిట్, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ రోపర్ సంయుక్తంగా ఈ టెక్నాలజీని అభివృద్ధి చేసింది. ఈ సందర్భంగా నిట్ డైరెక్టర్ సుబుధి మాట్లాడుతూ వరంగల్ నిట్ ఇటీవల సాధించిన విజయాలను వివరించారు. ఐఐటీ రోపర్ డైరెక్టర్ ప్రొఫెసర్ రాజీవ్ అహూజా మాటాడుతూ ప్రాథమిక శాస్త్రాలు, సంప్రదాయ ఇంజనీరింగ్ కోర్సులను అధ్యయనం చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ఈ అండ్ ఐటీ గ్రూప్ డైరెక్టర్ సునీత వర్మ మాట్లాడుతూ సమాజాన్ని ప్రభావితం చేసే పరిశోధనలపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.

మేకప్

వేడుకల్లో వెలిగిపోవాలంటే

మేకప్ నలుగురినీ ఆకర్షించేలా ఉండాలంటే అందుకు ప్రత్యేకమైన మెలకువలు పాటించాలి. చిన్న చిన్న చిట్కాలు, సులువైన ఉపాయాలు మేకప్‌ను మరింత ఆకర్షణీయంగా కనిపించేలా చేస్తాయి. అవేంటంటే...

దట్టమైన కనురెప్పల కోసం...

కంటి మేకప్ ఎంతో సంక్లిష్టమైనది. కంటి మేకప్ వేసుకోవడం ఒక ఎత్తైతే, అది చెదిరిపోకుండా చూసుకోవడం మరొక ఎత్తు. మరీ ముఖ్యంగా మస్కారా కారిపోకుండా, ఐలైనర్ చెరిగిపోకుండా చూసుకోవాలి. అందుకోసం ల్యాష్ ఎక్స్‌టెన్షన్స్ ఎంతో బాగా ఉపయోగపడతాయి. వీటితో కనురెప్పలు దట్టంగా మారడంతో పాటు, మస్కారా అద్దుకునే అవసరం లేకుండా రోజంతా చెక్కుచెదరకుండా ఉంటాయి.



సెట్టింగ్ స్ప్రే, పౌడర్

వేసుకున్న మేకప్ చర్మాన్ని అంటిపెట్టుకుని ఉండడం కోసం, సెట్టింగ్ స్ప్రే, పౌడర్‌లను ఎంచుకోవచ్చు. మేకప్ పూర్తయిన తర్వాత, చివర్లో వదులుగా ఉండే పారదర్శకమైన పౌడర్ అద్దుకుంటే మేకప్ చెక్కుచెదరకుండా ఉంటుంది. సెట్టింగ్ పౌడర్ జిడ్డును పీల్చుకుంటుంది కాబట్టి జిడ్డు చర్మం కలిగిన వాళ్లకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. చర్మానికి తేమ అవసరమయ్యే పొడి చర్మం కలిగిన వాళ్లు మేకప్ పూర్తయిన తర్వాత సెట్టింగ్ స్ప్రే ఉపయోగించాలి.

ప్రైమర్

మేకప్ మెరుపు రోజంతా తగ్గిపోకుండా ఉండాలంటే మేకప్‌కు ముందు ప్రైమర్ ఉపయోగించాలి. దీంతో చర్మం నునుపుగా మారి, జిడ్డు, పొడి తత్వం కలిగి ఉండే చర్మ ప్రభావాలు తగ్గిపోతాయి. అలాగే ప్రైమర్‌తో చర్మ రంధ్రాలు, మచ్చలు మాయమైపోతాయి.

బ్రో ల్యామినేషన్

కనుబొమలు తీర్చిదిద్దినట్టు కనిపించడం కోసం ఐబ్రో పెన్సిల్ వాడుకుంటాం! అయితే ఈ ప్రభావం వారాల తరబడి కొనసాగాలంటే 'బ్రో ల్యామినేషన్' చేయించుకోవాలి. ఆరు వారాల పాటు నిలిచి ఉండే ఈ సౌందర్య చిట్కాతో కనుబొమల తీరు ఎక్కువ కాలం పాటు చెక్కుచెదరకుండా ఉండిపోతుంది.

మిద్దె మీద దానిమ్మ తోట

ఎన్నో పోషకాలతో నిండిన దానిమ్మ పండు ఆరోగ్యదాయిని. ఈ చెట్టుని మిద్దె తోటలో లేదా బాల్కనీలో సులభంగా పెంచుకోవచ్చు. రోజంతా ఎండ తగిలే వెసులుబాటు ఉంటే చాలు.. ఏపుగా పెరుగుతుంది.



- దానిమ్మ పండు గింజలను మట్టిలో వేస్తే మొలకలు వస్తాయి. కానీ చాలా సమయం పడుతుంది. అందుకే నర్సరీ నుంచి దానిమ్మ మొక్కను తీసుకొచ్చి వెడల్పాటి కుండీలో నాటాలి.
- కుండీ కనీసం 20 అంగుళాల లోతు ఉండాలి. అప్పుడే మొక్క వేళ్లు కుండీ అంతటా విస్తరిస్తాయి. అడుగు భాగంలో రంధ్రం చేస్తే కుండీలోని అదనపు నీరు బయటికి వెళుతుంది.
- కుండీలో వేసే మట్టి కొద్దిగా ఆమ్ల తత్వంతో ఉండాలి. ఇందులో తోటమట్టి, కంపోస్టు, వేపాకుల ముద్ద, కొద్దిగా కొబ్బరి పీచు, సేంద్రీయ ఎరువు వేసి కలిపితే మొక్క బాగా పెరుగుతుంది.
- ప్రతిరోజూ కుండీకి కనీసం ఆరు గంటలు ఎండ తగిలేలా ఏర్పాటు చేసుకుంటే పూలు బాగా వస్తాయి. మొక్కకు తేమ అందేలా నీరు పోస్తూ ఉంటే పూలు నిలిచి వేగంగా పండ్లు కాస్తాయి.
- మొక్కకు పూలు రావడం మొదలైన తరవాత కుండీలోని మట్టికి రెండు నెలలకోసారి సేంద్రీయ ఎరువు కలపాలి. ఎక్కువగా ఉన్న ఆకులను తుంచేయాలి. అదనపు కొమ్మలను కత్తిరిస్తే పూలకు పోషకాలు బాగా అందుతాయి.
- మొక్కకు క్రిమి కీటకాలు చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఒక లీటరు నీటికి అయిదు మిల్లీ లీటర్ల వేప నూనె కలిపి మొక్క అంతటా తగిలేలా పిచికారీ చేయాలి.
- ఇలా అన్ని జాగ్రత్తలూ తీసుకుంటూ ఉంటే పది నెలల్లో దానిమ్మ పండ్లు చేతికంది వస్తాయి.

సంక్రాంతి వచ్చిందంటే ఇంట్లో పిండి వంటల హడావిడి ప్రారంభ మయిపోతుంది. అరిసెలు, పల్లీ అచ్చులు వంటివి అందరూ చేసుకుంటూ ఉంటారు. అందుకే ఈసారి కర్ణాటకలోని కొన్ని ప్రాంతాల్లో సంక్రాంతికి చేసుకొనే వంటలు ఏమిటో చూద్దాం..

వంటిల్లు

మన సంక్రాంతికి కర్ణాటక రుచులు..!



గసగసాల పరమాన్నం

కావాల్సిన పదార్థాలు:

గసగసాలు- మూడు చెంచాలు, బియ్యం- అరకప్పు, బెల్లం పొడి- అరకప్పు, పాలు- నాలుగు కప్పులు, నీళ్లు- ఒక కప్పు, ఏలకుల పొడి- ఒక చెంచా

తయారీ విధానం

1 ఒక మూకుడులో బియ్యం, గసగసాలు వేసి వేయించాలి.
1 ఒక గిన్నెలో పాలు పోసి దానిలో బియ్యం, గసగసాలు వేయాలి. ఇవి ఉడుకుతున్న సమయంలో నీళ్లు కూడా పోయాలి.
1 పాలు బాగా చిక్కబడిన తర్వాత దానిలో బెల్లం పొడి వేయాలి. ఐదు నిమిషాల తర్వాత కిందకు దింపాలి.
1 పాయసం కొద్దిగా చల్లారిన తర్వాత ఏలకుల పొడి వేసి కలపాలి.

జాగ్రత్తలు

1 గసగసాలు ఎక్కువ వేస్తే చేదు వచ్చే అవకాశం ఉంది. అందువల్ల గసగసాలను తక్కువగానే వాడాలి.
1 పాలు చిక్కబడిన తర్వాత నీళ్ల పోస్తే మంచిది. ముందే పాలు, నీళ్ల కలిపితే చిక్కబడటానికి ఎక్కువ సమయం పట్టవచ్చు.

అరివికాలు (చిక్కుడుగింజలు) రైస్‌బాత్

కావాల్సిన పదార్థాలు:

బియ్యం- రెండు కప్పులు, చిక్కుడు గింజలు- ఒక కప్పు, నూనె- అరకప్పు, ఆవాలు- ఒక చెంచా, శనగపప్పు- ఒక చెంచా, మినపప్పు- ఒక చెంచా, పల్లీలు- రెండు చెంచాలు, కరివేపాకు- రెండు రెబ్బలు, చింతపండు రసం- పావు కప్పు, బెల్లం పొడి- పావు కప్పు, పసుపు- పావు చెంచా, ఉప్పు- తగినంత, ఎండు మిరపకాయలు- నాలుగు, ధనియాలు- రెండు చెంచాలు, కొబ్బరి తురుము- రెండు చెంచాలు, మిరియాలు- ఒక చెంచా, నెయ్యి- రెండు చెంచాలు, నీళ్లు- తగినన్ని



తయారీ విధానం

1 చిక్కుడు గింజలను బాగా కడిగి వాటిలో కొద్దిగా ఉప్పు, నెయ్యి కలపాలి. కుక్కర్‌లో వాటిని ఉడికించి బయటకు తీసి చల్లార్చాలి. ఇదే కుక్కర్‌లో బియ్యం పెట్టి అన్నం వండాలి. దీనిని కూడా బయటకు తీసి చల్లార్చాలి.
1 ఒక మూకుడులో ఒక చెంచా నూనెను వేడి చేయాలి. దీనిలో ఎండు మిర్చి, శనగపప్పు, మినపప్పు, ధనియాలు వేసి వేయించాలి. ఆ తర్వాత మిరియాలు, కొబ్బరి తురుము వేసి వేయించాలి. ఇవి చల్లారిన తర్వాత వాటిని మిక్సీలో వేసి గుండ చేయాలి.
1 అదే మూకుడులో నూనె వేసి వేడి చేయాలి. దీనిలో పల్లీలు, ఆవాలు, కరివేపాకు వేసి వేయించాలి. దానిలో పసుపు, బెల్లం పొడి, చింతపండు రసం వేసి కొద్ది సేపు ఉడకనివ్వాలి.
1 ఈ మిశ్రమంలో అన్నం, చిక్కుడు గింజలను వేసి బాగా కలపాలి.

జాగ్రత్తలు

1 దీనిలో లేత చిక్కుడు గింజలు బావుంటాయి. కానీ వీటిని బాగా ఎక్కువగా ఉడకపెట్టకూడదు.

పల్లీ బొబ్బట్లు

కావాల్సిన పదార్థాలు:

గోధుమ పిండి- రెండు కప్పులు, నెయ్యి- ఒక కప్పు, ఉప్పు- తగినంత, పల్లీలు- ఒక కప్పు, నువ్వులు- పావు కప్పు, గసగసాలు- రెండు చెంచాలు, బెల్లం పొడి- ఒక కప్పు, ఏలకుల పొడి- ఒక చెంచా, నీళ్లు- తగినన్ని

తయారీ విధానం:

1 ఒక గిన్నెలో గోధుమ పిండిని తీసుకోవాలి. కొద్ది కొద్దిగా నీళ్ల పోసి పిండిని ముద్దగా చేయాలి. 30 నిమిషాలు గిన్నెలో ఉంచాలి.
1 ఒక మూకుడులో పల్లీలను, నువ్వులు, గసగసాలను వేసి వేయించాలి. ఇవి చల్లారిన తర్వాత వాటిని మిక్సీలో పొడి చేయాలి.
1 ఈ మూకుడులో ఈ మిశ్రమాన్ని, బెల్లం పొడిని, ఏలకుల పొడిని వేసి వేడిచేయాలి. దీనిలో కొద్దిగా నీళ్ల వేసి ముద్దగా చేయాలి. దీనిని మూకుడు నుంచి బయటకు తీసి చల్లార్చి ఉండలుగా చేసుకోవాలి.
1 గోధుమ పిండిని చపాతీల మాదిరిగా ఒత్తి- వాటి మధ్యలో పల్లీలు, బెల్లం కలిపిన ఉండలను పెట్టి మూసి వేయాలి. వాటిని మళ్లీ గుండ్రంగా ఒత్తుకోవాలి.
1 ఒక పెనం తీసుకొని కొద్దిగా వేడి చేయాలి. దానిపై ఒత్తిన బొబ్బట్టును కొద్ది కొద్దిగా నెయ్యి వేసి కాల్చాలి.

జాగ్రత్తలు

1 పొట్టు తీసిన పల్లీలు అయితే బొబ్బట్లు తెల్లగా కనిపిస్తాయి.
1 నెయ్యి బదులు నూనె కూడా వాడుకోవచ్చు.
1 పల్లీ పొడి, బెల్లం పొడి పాకం పట్టేటప్పుడు... ఈ మిశ్రమం గట్టిగా అయిపోకుండా జాగ్రత్తగా చూసుకోవాలి.



భోజనకుతూహలం
ఆహారంతో ఆరోగ్యం

తాపహారీ అనే వడియాల అన్నం

అన్నాన్ని వండుకుని అందులో కూర, పప్పు, పచ్చడి, పులుసు లాంటివి కలుపుకుని తినటం కొందరికి అలవాటు. కాలక్రమంలో ఈ అన్నాన్ని వండేప్పుడే పెసర పప్పు, కందిపప్పు లాంటివి కలిపి పులగాన్ని వండుకోవటం మొదలు పెట్టారు. కూరగాయలు కలిపి కిచిడీనీ వండటం ప్రారంభించారు. వివిధ మసాలాలు కలిపి పులావు లాంటి వంటకాల గురించి 10వ శతాబ్దానికి చెందిన నలుడు పాకదర్పణంలో వివరించాడు. అప్పటికి మన దేశంలో మహ్మదీయుల ప్రాపకం ఎక్కువగా లేదు. ఆ తర్వాతి కాలంలో మహ్మదీయుల ఆధిపత్యం పెరిగిన తర్వాత పలావు వంటి వాటికి ఎక్కువ ఆదరణ లభించింది. ఆ సమయంలో అందరి ఆదరణ పొందిన వంట మరొకటి ఉంది. దాని పేరు తాపాహారి. వడియాలతో తినే అన్నం. దీనిని ఎలా చేయాలో భోజన కుతూహలం పాకశాస్త్ర గ్రంథంలో రఘునాథసూరి పండితుడు వివరించాడు.

"ఘృతె హరిద్రాసంయుక్తమాషాణాం భర్జయేద్వటీ
తండులాశ్చాపి నిరధౌతాన్సహైవ పరివర్తయేత్
సిద్ధయోగ్యం జలం తత్ర నిక్షిప్య కుశలః పచేత్
లవణార్ద్రకహింగూని మాత్రయా తత్ర నిక్షిపేత్"

దీని అర్థాన్ని మనం ఇప్పుడు తెలుసుకుందాం.

ఘృతె హరిద్రాసంయుక్తమాషాణాం భర్జయేత్: పసుపు, ఇతర సుగంధ ద్రవ్యాలు కలిపిన మినప్పిండితో పెట్టిన వడియాలు ఎండబెట్టి సిద్ధంగా ఉంచుకోండని దీని అర్థం. మన పూర్వీకులు మినపవడియాల్ని ఉగ్ర వడియాలని కూడా పిలిచేవారు. ఉప్పు, కారం, ఇంగువ తగిన పాళ్లలో కలిపి మినప్పిండిని కలిపి వాటిని ఎండబెడతారు. అవి ఎండిన తర్వాత నేతితో వేయిస్తారు.

తండులాశ్చాపి నిరధౌతాన్సహైవ పరివర్తయేత్: బియ్యంలో కొద్దిగా నెయ్యి వేసి కమ్మని వాసన వచ్చేవరకూ పైపైన వేగించి సిద్ధంగా ఉంచుకోండనేది దీని అర్థం .

సిద్ధయోగ్యం జలం తత్ర నిక్షిప్య కుశలః పచేత్: ఈ బియ్యంలో తగినన్ని నీళ్ల పోసి అన్నం వండుతూ, ఉడుకుతూ ఉండగా ఇందాక వేగించిన వడియాల్ని కలిపి చాకచక్యంగా వండండి.

లవణార్ద్రకహింగూని మాత్రయా తత్ర నిక్షిపేత్: ఈ అన్నంలో తగినంత ఉప్పు, నూరిన అల్లం ముద్ద కలిపి ఇంగువ మొదలైన పోపు ద్రవ్యాలతో నేతి తాలింపు పెట్టండి. ఇదే తాపహారి. ఇది శరీరంలోని వేడిని తగ్గించి బలాన్నిస్తుంది. ఆలస్యంగా అరుగుతుంది. నెయ్యి మిరియాల పొడి కలయిక వలన పిల్లల్లో మేధాశక్తి, జ్ఞాపకశక్తి పెరుగుతుంది.



1 మినపవడియాలలో మిరపకారంకన్నా మిరియాలకారానికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. దీనివల్ల ఎసిడిటి వంటి సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది.
1 మినుముల ఎక్కువగా వాడకం మంచిది కాదు. ఇడ్లీలు దోసెలు, వడలు, పునుగుల పేరుతో రోజూ టిఫిన్ల రూపాన కడుపులోకి అపరిమితంగా మినుములు చేరుతున్నాయి. వీటివల్ల అనేక సమస్యలు ఏర్పడుతున్నాయి. స్థూలకాయం లాంటి సమస్యలకు కారణమవుతున్నాయి.
1 ఉదయం, రాత్రి అల్పాహారం కన్నా చిరుధాన్యాలకు ప్రాధాన్యం ఇవ్వండి. వరి అన్నం బదులుగా చిరుధాన్యాలతో కూడా తాపాహారిని వండుకోవచ్చు. తాపహారికోసం ప్రత్యేకంగా వడియాలు పెట్టుకోవాలి. అవి అందుబాటులో లేనప్పుడు పసుపు, ఇతర సుగంధ ద్రవ్యాలు కలిపిన గారెలు ప్రత్యామ్నాయంగా ఉపయోగపడతాయి. మినపప్పు మాదిరిగానే పెసలతోను, ఉలవలతోను, ఇతర పప్పు ధాన్యాలతో కూడా వడియాలు తయారుచేసుకోవచ్చు.

● గంగరాజు అరుణాదేవి

సెలబ్ ఫిట్

మూడున్నర దశాబ్దాల కిందట... 'మైనే ప్యార్ కియా' అంటూ పలుకరించింది భాగ్యశ్రీ. నిన్నటి తరం కలల రాణిగా... తొలి చిత్రంతోనే సంచలన తారగా... దేశంలోని సినీ ప్రేవిఎకులందరికీ దగ్గరైన ఆమె... నేటికీ తనదైన శైలిలో తెరపై అలరిస్తోంది. యాభై ఐదేళ్ల వయసులోనూ తరగని అందంతో... అంతే నాజూకుగా... అపు'రూపం'గా ఆకట్టుకొంటోంది.

అపురూపం

'కచ్చీ ధూప్' సీరియల్‌తో 1987లో నటనకు శ్రీకారం చుట్టిన భాగ్యశ్రీ పట్వర్ధన్ దసానీ... ఆ తరువాత రెండేళ్లకు 'మైనే ప్యార్ కియా' (ప్రేమ పావురాలు) చిత్రంతో వెండితెరకు పరిచయమైంది. నటిగా ఎదగాలని ఆమె కలలు కనలేదు. అయితే 'కచ్చీ ధూప్' కోసం ముందుగా అనుకున్న ఓ ప్రముఖ నటి చివరి నిమిషంలో రాకపోవడంతో... భాగ్యశ్రీకి అందులో అవకాశం వచ్చింది. ప్రముఖ నటుడు, దర్శకుడు అమూల్ పాలేకర్ అడగడంతో ఆమె వెంటనే ఓకే చెప్పింది. భాగ్యశ్రీది మహారాష్ట్రలోని సంగ్లీ రాజ వంశం. ముగ్గురు సంతానంలో భాగ్యశ్రీ పెద్ద కుమార్తె. మధువని, పూర్ణిమ చెల్లెళ్లు. సీరియల్ చేస్తుండగానే 'మైనే ప్యార్ కియా'లో ఆమెకు అవకాశం లభించింది. 1989లో విడుదలైన ఈ చిత్రం అప్పట్లో ఒక సంచలనం. సల్మాన్‌ఖాన్ హీరోగా నటించిన మొదటి సినిమా అది. కానీ సల్మాన్ కంటే ఎక్కువ క్రేజ్ సంపాదించుకుంది భాగ్యశ్రీ. ఆ ఒక్క చిత్రంతోనే స్టార్ హీరోయిన్ అయిపోయింది. ఫిలిమ్‌ఫేర్ అవార్డు కూడా దక్కించుకుంది. కానీ అనూహ్యంగా అదే ఏడాది హిమాలయ దసానీని పెళ్లాడింది. అతడితో కలిసి మూడు చిత్రాలు చేసింది. వీరికి ఇద్దరు సంతానం. కొడుకు అభిమన్యు దసానీ నటుడు. కూతురు అవంతిక రెండేళ్ల కిందట వచ్చిన 'మిథ్య' వెబ్‌సిరీస్‌లో నటించింది.

ప్రాధాన్యమున్న పాత్రలు వచ్చినప్పుడు, కుదిరినప్పుడు సినిమాల్లో నటిస్తూనే, తరచూ టెలివిజన్ షోస్‌లో కనిపిస్తోంది భాగ్యశ్రీ. పేద బాలికల అభ్యున్నతి కోసం 2015లో తీసుకువచ్చిన పథకానికి మహారాష్ట్ర ప్రభుత్వం 'భాగ్యశ్రీ' పేరు పెట్టింది. అంతేకాదు... పలు స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో కూడా ఆమె చురుగ్గా పాల్గొంటుంది. వృత్తి, సేవా కార్యక్రమాలు, కుటుంబ బాధ్యతలు... ఎడతెరిపి లేని పని ఒత్తిడిలో ఉన్నా దృఢమైన శరీరం కోసం ప్రత్యేక సమయం కేటాయిస్తుంది. నిత్యం కసరత్తులు, క్రమం తప్పని ఆహార నియమాలు ఆమె జీవన విధానంలో ఒక భాగం. 'మహిళలకు నేను చెప్పదలుచుకొంది ఏంటంటే.. జీవితమనే పరుగులో కింద పడతాం.... కానీ పైకి లేవడానికి ప్రయత్నించాలి. ఎదురుదెబ్బలు తగిలితే వాటిని మాన్పుకోవడం ఎలాగో నేర్చుకోవాలి. విఫలమయ్యామని అంతటితో వదిలేయకుండా విజయం సాధించే వరకూ పోరాడాలి. సాకులవల్ల ప్రయోజనం లేదు. పరనిందలు విఎమ్మల్ని బలహీనపరుస్తాయి. మన మార్గాన్ని మనమే నిర్మించుకోవాలి. మన సామర్థ్యంపై మనకు విశ్వాసం ఉంటే ఎంతటి లక్ష్యాన్నయినా సాధించగలం' అంటుంది భాగ్యశ్రీ. ఇలాంటి పోస్టులతో తరచూ ఇన్‌స్టాగ్రామ్‌లో అభిమానుల్లో స్ఫూర్తి నింపే ప్రయత్నం చేస్తుంటుంది.





ఎప్పుడు ఏ ఆహారం...

న్యూట్రిషనిస్టు కూడా అయిన భాగ్యశ్రీ... తిండి విషయంలో ఎంతో శ్రద్ధ తీసుకొంటుంది. తన ఆహార నియమాల గురించి తరచూ సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేస్తుంటుంది. 'వయసు పెరుగుతున్నకొద్దీ విటమిన్ల లోపం వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తుతుంటాయి. దీనికి దూరంగా ఉండాలంటే రోజూ మన ఆహారంలో బాదం, పొద్దు తిరుగుడు గింజలు, పాలకూరను జత చేయాలి. తరచూ చికాకు, కోపం వస్తుంటే విటమిన్-బి లోపం కావచ్చు. రాజ్మా, శనగలు, వేరుశనగలు తీసుకోవాలి. పెళుసు గోళ్ల ఐరన్ లోపం గల వారిలో కనిపించే లక్షణం. పాలకూర, బీట్‌రూట్, బెల్లం మెనూకు జత చేసుకోవాలి. కండరాల కదలికలకు, శరీరం డీహైడ్రేట్ కాకుండా చూసు కోవడానికి అరటిపండ్లు, కొబ్బరి నీళ్ల ఆహారంలో భాగం చేసుకోవాలి. చివరగా పేగుల ఆరోగ్యానికి పెరుగు... ఇడ్లీ, దోక్లా వంటివి మెరుగైన జీర్ణక్రియకు దోహదపడతాయి' అంటుంది భాగ్యశ్రీ.

ఇవీ వ్యాయామాలు...

తొంభైల్లో భాగ్యశ్రీకి... ఇప్పటికీ పెద్దగా తేడా ఏమీ కనిపించదు. ఇప్పటికీ ఆమెలో అదే ఉత్సాహం... ముఖంలో అదే మెరుపు. 'జీవితంలో ఆరోగ్యానికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలి. అది మన మానసిక ఉల్లాసానికి దోహదపడుతుంది. ఎంత పని ఒత్తిడిలో ఉన్నా రోజులో కనీసం ఓ అరగంటైనా వ్యాయామాలకు సమయం కేటాయించాలి. అలాగే ఏంతింటున్నాం అనే దాని మీద శ్రద్ధ పెట్టాలి' అంటుంది ఆమె.

1 ఉదయం లేవగానే స్ట్రెచింగ్ వ్యాయామాలు. రాత్రంతా విశ్రాంతి తీసుకున్న మనల్ని జిమ్‌కు సిద్ధం చేయడానికి, కండరాలు పట్టేయకుండా శరీరాన్ని ఎటు కావాలంటే అటు వంచడానికి ఇవి దోహదపడతాయి. రక్తప్రసరణను మెరుగు పరుస్తాయి.
1 భాగ్యశ్రీ వ్యాయామాల్లో ఎక్కువ శాతం ఇంట్లో చేసుకొనేవే ఉంటాయి. వాటిల్లో మొదటిది యోగా. క్లిష్టమైన యోగాసనాలు ఆమె దైనందిన జీవితంలో భాగం. దీనివల్ల శరీరం చువ్వలా మారడమే కాదు... మానసిక ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది.
1 గంటల తరబడి కుర్చీల్లో కూర్చొని పని చేసేవారికి ఆమె ఇచ్చే సలహా... ఏదో ఒక రకంగా శరీరాన్ని కదిలించాలని. కనీసం ఒక అరగంట తేలికపాటి వ్యాయామాలైనా చేయమని, 'కదలికే ఔషధం' అని అంటుంది ఈ భామ.
1 వర్కవుట్స్‌కు ముందు ఇరవై నిమిషాలు ట్రెడ్‌మిల్. రన్నింగ్, జాగింగ్‌తో కూడిన కార్డియోతో గుండె మాత్రమే కాదు, శరీరం కూడా ఉత్తేజితమవుతుంది. సామర్థ్యం పెరుగుతుంది.
1 వర్కవుట్స్ తరువాత పది నిమిషాలపాటు బ్యాక్ వాకింగ్. అంటే వెనక్కు నడవడం. ఇది మోకాళ్లపై ఒత్తిడిని తగ్గిస్తుందని, తొడ కండరాలు పట్టేయకుండా కాపాడుతుందని చెబుతోంది ఆమె.
1 'చిన్నప్పటి రోజులు గుర్తుకు తెచ్చుకోండి. ఎగిరి గంతులు వేసేవాళ్లం. అయితే అది పిల్లల ఆట మాత్రమే కాదు.. అద్భుతమైన కార్డియో వర్కవుట్ కూడా. కండరాలను దృఢంగా మారుస్తుంది. బ్యాలెన్స్‌ను మెరుగుపరుస్తుంది. కటి కండరాలు బలోపేతమవుతాయి' అంటున్న భాగ్యశ్రీ తరచూ తన వర్కవుట్స్‌కు సంబంధించిన వీడియోలను ఇన్‌స్టాలో పోస్ట్ చేస్తుంది. అక్కడ ఆమెకు పాతిక లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నారు.


ముత్యాల ముగ్గు





సి. రాజ్యలక్ష్మీ
హైదరాబాద్

22 చుక్కలు
4 వరుసలు
4 వరకు - సరిచుక్కలు





స్వరూప
హైదరాబాద్

15 చుక్కలు
3 వరుసలు
3 వచ్చేవరకు

ఈ-మెయిల్: features@andhrajyothy.com

రేసింగ్ ముగిసేవరకు నటనకు దూరం



- హీరో అజిత్ కుమార్

ఇంటర్నేషనల్ కార్ రేసింగ్ పోటీలు ముగిసేవరకు తాను సినిమాల్లో నటించబోనని హీరో అజిత్ కుమార్ వెల్లడించారు. ఇదే విషయంపై ఆయన శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. 18వ యేట నుంచి రేసింగ్ పోటీల్లో పాల్గొంటూ వస్తున్నానని తెలిపారు. అయితే, సినిమాల్లోకి రావడంతో ఈ రేసింగ్ పోటీల్లో పాలుపంచుకోవడం వీలుపడలేదన్నారు. వచ్చే సెప్టెంబరులో కార్ రేసింగ్ పోటీలు జరుగనున్నాయన్నారు. అప్పటివరకు సినిమాల్లో నటించబోనని ఆయన స్పష్టం చేశారు. కాగా, ఇటీవల ఈ రేసింగ్ పోటీల కోసం దుబాయ్‌లో శిక్షణ పొందుతుండగా, అజిత్ కుమార్ కారు ప్రమాదానికి గురైన విషయం తెల్సిందే. ఈ ప్రమాదం నుంచి ఆయన తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. అయినప్పటికీ ఆయన రేసింగ్ పోటీల్లో పాల్గొనేందుకు సిద్ధమవుతున్నారు. చెన్నై, (ఆంధ్రజ్యోతి)



ఆ ఆలోచన నుంచే డాకు మహరాజ్ కథ పుట్టింది

నందమూరి బాలకృష్ణ

నందమూరి బాలకృష్ణ హీరోగా బాబీ కొల్లి దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'డాకూ మహారాజ్' చిత్రం ఈ నెల 12న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం జరిగిన ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో థియేట్రికల్ ట్రైలర్ విడుదల చేశారు. 'రాయలసీమ మాలూమ్ తేరే కో.. ఓ మేరా అడ్డా ', 'ఎవరన్నా చదవడంలో మాస్టర్స్ చేస్తారు. నేను చంపడంలో చేశా' అంటూ బాలకృష్ణ చెప్పిన పవర్‌ఫుల్ డైలాగులతో ఈ ట్రైలర్ ఆకట్టుకుంటోంది. అదిరిపోయే యాక్షన్ సన్నివేశాలు, కట్టిపడేసే భావోద్వేగాలతో అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా 'డాకూ మహారాజ్' చిత్రాన్ని తీర్చిదిద్దారని ఈ ట్రైలర్ చూడగానే అర్థమవుతుంది. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ 'తిరుమలలో తొక్కిసలాట ఘటన నన్నెంతో కలచివేసింది. ఆ ఘటనలో మరణించిన వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నాను. అటువంటి బాధాకర సంఘటన చోటు చేసుకోవడంతో అనంతపురంలో తలపెట్టిన వేడుకలను రద్దు చేశాం. నా అభిమానులు క్రమశిక్షణ కలిగిన సైనికులు. అందుకే వారు మా నిర్ణయాన్ని స్వాగతించారు' అన్నారు. 'డాకు మహారాజ్' చిత్రం గురించి మాట్లాడుతూ 'నేను అప్పట్లో చేసిన 'ఆదిత్య 369' చిత్రంలో కృష్ణదేవరాయల పాత్ర చిరస్థాయిగా నిలిచిపోయింది. అలాంటి పాత్ర చేస్తే బాగుంటుందనే ఆలోచన నుంచి 'డాకు మహారాజ్' కథ పుట్టింది. మూడు వరుస విజయాల తర్వాత వస్తున్న ఈ సినిమా కూడా ఘన విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది. ఇక ముందు కూడా ఇలాగే మరిన్ని మంచి సినిమాలతో మీ ముందుకు వస్తాను' అన్నారు.

దర్శకుడు కొల్లి బాబీ మాట్లాడుతూ 'అభిమానుల కోసం కొత్తగా ఏదైనా చేయాలని తపించే వ్యక్తి బాలయ్య. అందుకే నా టీమ్‌తో కలసి ఎంతో శ్రద్ధగా ఈ స్క్రిప్ట్ సిద్ధం చేశా. బాలకృష్ణగారితో ఒకసారి కలసి పని చేస్తే ఆయనని ప్రేమిస్తాం, అభిమానిస్తాం ఆయనతో మళ్లీ మళ్లీ కలసి పని చేయాలని అనిపిస్తుంది' అన్నారు.

'వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఈ రోజు టికెట్ బుకింగ్స్ ఓపెన్ చేశాం. అందరూ టికెట్స్ బుక్ చేసుకుని బాలకృష్ణగారికి మంచి ఓపెనింగ్స్ ఇస్తారని ఆశిస్తున్నాం' అన్నారు నిర్మాత నాగవంశీ. ఈ చిత్ర బృందం సృష్టించిన డాకు మహారాజ్ ప్రపంచం గొప్పది, చాలా కొత్తగా ఉంటుందని సంగీత దర్శకుడు థమన్ చెప్పారు గొప్ప విజువల్స్ వల్లే మంచి సంగీతం ఇవ్వగలిగానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రగ్యా జైస్వాల్, ఊర్వశి రౌతేలా, శ్రద్ధా శ్రీనాథ్ పాల్గొన్నారు.



కచ్చితంగా బ్లాక్‌బస్టర్ అవుతుంది

- డైరెక్టర్ అనిల్ రావిపూడి

వెంకటేశ్ హీరోగా, మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేశ్ హీరోయిన్లుగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. దిల్‌రాజు, శిరీష్ నిర్మించారు. ఈనెల 14న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు అనిల్ రావిపూడి మీడియాతో మాట్లాడుతూ 'కథ అనుకున్నప్పుడు ఫెస్టివల్ ఫిల్మ్ అనుకుని స్టార్ట్ చేశాం. వెంకటేశ్‌తో చేసిన ఎఫ్2 సంక్రాంతికి వచ్చి పెద్ద విజయం సాధించింది. ఎఫ్3 కూడా సంక్రాంతికి రావాల్సింది. కానీ మిస్ అయ్యింది. ఈసారి చేసే సినిమా ఎలాగైనా పొంగల్‌కి తీసుకొస్తే బావుంటుందని అనుకున్నాం. ఈ సినిమా కథ ఒక రెస్క్యూ ఆపరేషన్‌కి సంబంధించింది. సెకండ్ హాఫ్‌లో నాలుగు రోజులు జర్నీ సంక్రాంతికి ముందు ఆరంభం అవుతుంది. కథ అనుకున్నప్పుడే 'సంక్రాంతికి వస్తున్నాం' టైటిల్‌కి ఫిక్స్ అయ్యాం. ఈ సినిమా తప్పకుండా బ్లాక్‌బస్టర్ అవుతుందనే నమ్మకం నాకుంది. మంచి కథ రాసి గొప్పగా తీయగానే సరిపోదు. థియేటర్లకు జనాలు రాకపోతే సినిమాకి రీచ్ ఉండదు. ఇప్పుడు ఆడియన్స్ బాగా సెలెక్టివ్ అయిపోయారు. మన సినిమా వారి అటెన్షన్‌ని గ్రాబ్ చేస్తేనే ఓపెనింగ్స్ తెచ్చుకోగలమని నా అభిప్రాయం. ఈసారి సోషల్ మీడియాపై ఎక్కువగా ఫోకస్ చేశాం. వెంకటేశ్ వంటి పెద్ద స్టార్ రీల్స్ చేయడం ప్రమోషన్స్‌కి చాలా హెల్ప్ అయ్యింది. 'గోదారి గట్టు' పాట గ్లోబల్ సాంగ్ అయ్యింది. 85 మిలియన్స్ వ్యూస్‌ని క్రాస్ చేసింది. భాగ్యం చాలా మంచి క్యారెక్టర్. ఐశ్వర్యకి మంచి పేరు వస్తుంది. వెంకటేశ్‌కి బ్లాక్‌బస్టర్ పొంగల్ సాంగ్ చాలా నచ్చింది. 20 నిమిషాల్లో ఆయనే స్వయంగా పాడారు. భీమ్స్ అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చాడు. బీజీఎం వండర్‌ఫుల్‌గా ఉంటుంది. హీరోలని స్క్రీన్ మీద చూసినప్పుడు ఎలా అభిమానించానో వాళ్లతో సినిమా చేసినప్పుడు కూడా అదే అభిమానంతో ఉంటాను. నేను హీరోలకి ఫ్యాన్ బాయ్‌లానే ఉంటాను. రిలేషన్‌ని పాజిటివ్‌గా ఉంచుతాను కాబట్టి వాళ్ల నుంచి కూడా అంతే ప్రేమ వస్తుంది. విమెన్ సెంట్రిక్‌గా ఒక స్పోర్ట్స్ స్టోరీ చేయాలని ఎప్పటినుంచో ఉంది. కొన్నాళ్ల తర్వాత స్పోర్ట్స్ డ్రామా చేస్తాను. 'ఎఫ్4' సినిమా తప్పకుండా ఉంటుంది. అయితే దానికి కొంత సమయం ఉంది' అని అన్నారు.

టీఎన్ శేషన్ స్ఫూర్తితో రామ్‌నందన్ పాత్రకు రూపకల్పన?



శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ కథానాయకుడిగా నటించిన 'గేమ్‌చేంజర్' చిత్రం శుక్రవారం విడుదలైన విషయం తెలిసిందే. ఈ చిత్రంలో రామ్‌చరణ్ పోషించిన రెండు విభిన్న పాత్రలు ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటున్నాయి. ఓ గొప్ప వ్యక్తి జీవితం స్ఫూర్తితో, ఆయన జీవితంలో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా కథను తీర్చిదిద్దారనే మాట సినీ విశ్లేషకుల నుంచి వినిపిస్తోంది. ఆ వ్యక్తి మరెవరో కాదు... తాను చేపట్టిన పదవికే వన్నె తెచ్చిన భారత ఎన్నికల సంఘం మాజీ చీఫ్ కమిషనర్ టీఎన్ శేషన్. ఆయన భారత ఎన్నికల సంఘానికి 10వ సీఈసీగా బాధ్యతలు నిర్వహించారు. నిబంధనల అమల్లో పెద్ద పెద్ద రాజకీయ నాయకులను సైతం లెక్కచేయకుండా వ్యవహరించారు. ఎన్నికల నిర్వహణలో విప్లవాత్మక మార్పులు తెచ్చారు. టీఎన్ శేషన్ జీవితం ఆధారంగానే 'గేమ్‌చేంజర్' చిత్రంలో రామ్‌చరణ్ పాత్రను రచయిత కార్తీక్ సుబ్బరాజ్ తీర్చిదిద్దినట్లు తెలుస్తోంది. శేషన్ కళాశాల రోజుల్లో విద్యార్థి నాయకుడుగా పనిచేశారు. తర్వాత ఐపీఎస్‌కు, ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. 'గేమ్‌చేంజర్'లో రామ్‌నందన్ పాత్రలో రామ్‌చరణ్ సైతం స్టూడెంట్ లీడర్, ఐపీఎస్, ఐఏఎస్, ఎన్నికల అధికారిగా కనిపించారు. దీంతో శేషన్ జీవితం ఆధారంగా రాసుకున్న కథ ఇదని సమీక్షకులు అభిప్రాయపడుతున్నారు. శేషన్ పేరు వెల్లడించలేదు గానీ తన పాత్రకు స్ఫూర్తిగా నిలిచిన ఓ మాజీ ప్రభుత్వ అధికారి వీడియోలు, ఆయన పనితీరును నిశితంగా అధ్యయనం చేసినట్లు గతంలో రామ్‌చరణ్ ఓ ఇంటర్వ్యూలో తెలిపారు.

ఇక జర్మనీ వెళ్లాల్సిన అవసరం లేదు

- రాజమౌళి



భారతదేశంలో మొట్టమొదటి డాల్బీ సర్టిఫైడ్ పోస్ట్‌ప్రొడక్షన్ ఫెసిలిటీని అన్నపూర్ణ స్టూడియోస్‌లో ప్రముఖ దర్శకులు ఎస్.ఎస్.రాజమౌళి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్టూడియో వైస్ చైర్మన్, హీరో నాగార్జున అక్కినేని, ఈడీ సుప్రియా యార్లగడ్డ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజమౌళి మాట్లాడుతూ 'ఆర్ఆర్ఆర్ నిర్మాణ సమయంలో మేము సినిమాను డాల్బీ విజన్‌లో గ్రేడ్ చేయాలనుకున్నప్పుడు, జర్మనీ వరకు ప్రయాణించాల్సి వచ్చింది. మన దేశంలోనే డాల్బీ విజన్‌లో నా సినిమాను ఎక్స్ పీరియన్స్ చేయలేకపోవడం కొంచెం నిరుత్సాహపరిచింది. కానీ ఈ రోజు, అన్నపూర్ణ స్టూడియోస్‌లో డాల్బీ విజన్ గ్రేడింగ్ సౌకర్యాన్ని చూసి చాలా థ్రిల్ అయ్యాను' అని అన్నారు. నాగార్జున అక్కినేని మాట్లాడుతూ ' అన్నపూర్ణ స్టూడియోస్ 50వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా డాల్బీతో ఈ సహకారం గొప్ప దార్శనికతకు నిదర్శనం. అన్నపూర్ణలో చేంజ్ ఇన్నోవేషన్ స్వీకరించడం మా లెగసీ, ఇది ఆ ప్రయాణంలో మరో ముందడుగు' అని అన్నారు.

రష్మికకు గాయం... సికందర్‌కు బ్రేక్



కథానాయిక రష్మిక మందన్న గాయపడ్డారని సమాచారం. జిమ్‌లో వ్యాయామం చేస్తుండగా ఆమెకు తీవ్ర గాయాలైనట్లు శుక్రవారం బాలీవుడ్ మీడియాలో ప్రచారం జరిగింది. వైద్యులు వారం రోజుల పాటు విశ్రాంతి తీసుకోవాలని రష్మికకు సూచించారనీ, దీంతో ఆమె సినిమా చిత్రీకరణలను రద్దు చేసుకున్నారనేది ఆ వార్తల సారాంశం. అయితే రష్మిక ఇప్పటివరకూ ఈ ప్రచారంపై స్పందించలేదు. ఆమె ప్రస్తుతం సల్మాన్‌ఖాన్‌సరసన 'సికందర్' చిత్రంలో నటిస్తున్నారు. ఈ చిత్రం కోసం రష్మిక కొన్నాళ్లుగా జిమ్‌లో తీవ్రంగా కసరత్తులు చేస్తున్నారు. ముంబైలో సల్మాన్, రష్మికపై కీలక సన్నివేశాల చిత్రీకరణ కోసం భారీ సెట్‌ను ఏర్పాటు చేశారు. రష్మిక గాయపడడంతో శుక్రవారం ఆరంభం కావాల్సిన 'సికందర్' చివరి షెడ్యూల్ నిలిచిపోయినట్లు బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి.

నిర్మాతగా ఝలక్



వరుస సినిమాలతో జోరుమీదున్నాడు బాలీవుడ్ హీరో అజయ్ దేవ్‌గణ్. హీరోగా సినిమాలు చేస్తూనే తన సొంత బేనర్ దేవ్‌గణ్ ఫిల్మ్స్ బేనర్‌పై సినిమాలు నిర్మిస్తున్నారు. తాజాగా పనోరమా స్టూడియోస్‌తో కలసి ఆయన ఓ చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సినిమాకు 'ఝలక్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. హారర్ కామెడీ జానర్‌లో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో అజయ్ దేవ్‌గణ్ మేనల్లుడు అమన్ దేవ్‌గణ్ హీరోగా నటిస్తున్నాడు. అజయ్ దేవ్‌గణ్ హీరోగా నటించిన 'ఆజాద్' చిత్రంలో అమన్ ప్రతినాయక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రం ఈనెల 26న విడుదలవనుంది. 'మా హృదయాలకు దగ్గరైన కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. ప్రేక్షకులను భయపెడుతూనే హాస్యం పంచే కొత్త తరహా కథాంశంతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం' అని నిర్మాణ సంస్థ తెలిపింది. సినిమాకు సంబంధించిన ఇతర వివరాలు త్వరలో ప్రకటించనున్నారు.

అఖండలా బ్రహ్మాండ



ఒగ్గు కళాకారుల జీవితాల నేపథ్యంలో వారి సంస్కృతి, సంప్రదాయాలకు పెద్ద పీట వేస్తూ రూపొందించిన చిత్రం 'బ్రహ్మాండ'. రాంబాబు దర్శకత్వంలో దాసరి సురేశ్ నిర్మించారు. ఆమని, జయరామ్, బన్నీరాజ్ ప్రధాన పాత్రలు పోషించారు. ఈ నెల చివరివారంలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. తాజాగా నిర్మాత విర్యాల రవీందర్‌రెడ్డి 'బ్రహ్మాండ' ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశార. "అఖండ" చిత్రంలా 'బ్రహ్మాండ' సినిమా కూడా ఘన విజయం సాధించాలి' అని ఆయన ఆకాంక్షించారు. ఈ చిత్రానికి సంగీతం: వరికుప్పల యాదగిరి, సినిమాటోగ్రఫీ: కాసుల కార్తిక్

ఇన్ ప్రోగ్రెస్

అందరికీ నచ్చేలా..

కిట్టు తాటికొండ, కష్మీరా, రోహిత్, వైశాలి, సునీల్ రావినూతల, శ్రీ గోపి చంద్ కొండ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'కరణం గారి వీధి'. దర్శకద్వయం హేమంత్, ప్రశాంత్ తెరకెక్కిస్తున్నారు. అడవి అశోక్ నిర్మిస్తున్నారు. విలేజ్ బ్యాక్ డ్రాప్‌లో సాగే కంప్లీట్ లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రమిది. త్వరలో విడుదలకు



సిద్ధమవుతోన్న ఈ సినిమా పోస్టర్‌ను ప్రముఖ నటుడు మురళీమోహన్ రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన చిత్రబృందానికి అభినందనలు తెలిపారు. త్వరలోనే సినిమాను థియేటర్లలో విడుదల చేస్తామని నిర్మాత తెలిపారు. దర్శకుడు హేమంత్ మాట్లాడుతూ 'ఈ చిత్రంలో మనం నిజ జీవితంలో చూసే వాస్తవిక ఘటనలు ఉంటాయి. అందరికీ నచ్చేలా రూపొందిస్తున్నాం' అని అన్నారు.

సైకలాజికల్ థ్రిల్లర్



ధన్య బాలకృష్ణ, పూజా రామచంద్రన్, రవి వర్మ ప్రధాన పాత్రల్లో శ్రీవిద్య బసవ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న చిత్రం 'హత్య'. ఎస్.ప్రశాంత్ రెడ్డి నిర్మాత. ఈనెల 24న విడుదలవుతోంది. నటుడు రవివర్మ చేతుల మీదుగా చిత్రం టీజర్ విడుదలైంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకురాలు శ్రీ విద్య బసవ మాట్లాడుతూ 'ఈ చిత్రాన్ని సీట్ ఎడ్జ్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ మూవీగా అలరించేలా తెరకెక్కించాను. నరేశ్ అద్భుతమైన బీజీఎంను అందించాడు. అభిరాజ్ విజువల్స్ చక్కగా కుదిరాయి' అని తెలిపారు. నటుడు రవివర్మ మాట్లాడుతూ 'రొటీన్‌కు భిన్నమైన రోల్‌కు శ్రీవిద్య నన్ను ఎంపిక చేశారు. ఇది నాకొక ఛాలెంజింగ్ రోల్' అని అన్నారు.

కొత్తవాళ్లు కొట్టేశారు

● మంధాన మెరుపు ఇన్నింగ్స్
● భారత్ ఘన విజయం
ప్రతిక, తేజల్ అర్ధ సెంచరీలు



ఐర్లాండ్‌తో తొలి వన్డే

ప్రతికా రావల్ (89)

రాజ్‌కోట్: విజయాల జోరును భారత మహిళలు కొనసాగిస్తున్నారు. ఐర్లాండ్‌తో శుక్రవారం జరిగిన తొలి వన్డేలో ఆరు వికెట్లతో ఘన విజయం సాధించారు. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యం అందుకున్నారు. అంతగా అనుభవంలేని ప్రతికా రావల్ (89), తేజల్ హసబ్నిస్ (53 నాటౌట్) అర్ధ సెంచరీలతో సత్తా చాటగా, కెప్టెన్ మంధాన (29 బంతుల్లో 6 ఫోర్లు, సిక్స్‌తో 41) మెరుపు ఇన్నింగ్స్‌తో ఆకట్టుకుంది. దాంతో 239 పరుగుల లక్ష్య ఛేదనను భారత్ 34.3 ఓవర్లలో 241/4 స్కోరు చేసి ముగించింది. అంతకుముందు ఐర్లాండ్ 50 ఓవర్లలో 238/7 స్కోరు చేసింది. కెప్టెన్ గాబీ లూయిస్ (92), లీ పాల్ (59) హాఫ్ సెంచరీలు సాధించారు. ప్రియా మిశ్రా రెండు వికెట్లు పడగొట్టింది. ప్రతిక 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచింది.

ప్రతిక, తేజ శతక భాగస్వామ్యం: మోస్తరు ఛేదనలో మంధాన, ప్రతిక దూకుడైన ఆరంభం ఇచ్చారు. ఓవర్‌కు ఏడు పరుగుల చొప్పున మొదటి వికెట్‌కు 70 పరుగులు జోడించారు. వెస్టిండీస్‌తో గత టీ20, వన్డే సిరీస్‌ల్లో అద్భుత బ్యాటింగ్‌తో అదరగొట్టిన మంధాన అంతగా అనుభవంలేని ఐర్లాండ్ బౌలర్లను ఆడేసుకుంది. ముఖ్యంగా పేసర్ డెంప్సీ వేసిన ఎనిమిదో ఓవర్‌లో 4,6,4తో స్మృతి కదం తొక్కింది. అయితే అర్ధ శతకానికి చేరువైన మంధానను సార్జంట్ క్యాచవుట్ చేసింది. హర్లీన్ డియోల్ (20), జెమీమా రోడ్రిగ్స్ (9) త్వరగా నిష్క్రమించడంతో 46 పరుగుల తేడాతో భారత్ మూడు వికెట్లు చేజార్చుకుంది. కానీ..చెరో నాలుగేసి అంతర్జాతీయ మ్యాచ్‌ల అనుభవమే కలిగిన ప్రతికా రావల్, తేజల్ ఎంతో పరిణతితో ఆడి భారత ఇన్నింగ్స్‌ను నడిపించారు. ఈక్రమంలో నాలుగో వికెట్‌కు 84 బంతుల్లో 116 పరుగులు జోడించి జట్టును విజయ పథాన నడిపించారు.

ఆ ఇద్దరు ఆదుకున్నారు: టాస్ నెగ్గి ఐర్లాండ్ మొదట బ్యాటింగ్ చేపట్టగా..భారత బౌలర్ల ధాటికి 56/4తో తీవ్ర ఇబ్బందుల్లో పడింది. కానీ లూయిస్, పాల్ ఐదో వికెట్‌కు 117 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌ను గాడిలో పెట్టారు. భారత ఫీల్డింగ్ చెత్తగా ఉండడం కూడా ఈ జోడీకి కలిసి వచ్చింది. మన ఫీల్డర్లు మూడు క్యాచ్‌లు వదిలేయడంతోపాటు, మిస్‌ఫీల్డింగ్‌తో పరుగులు ఇచ్చేశారు.

సంక్షిప్తస్కోర్లు: ఐర్లాండ్: 50 ఓవర్లలో 238/7 (గాబీ లూయిస్ 92, లీ పాల్ 59, అర్లీన్ కెల్లీ 28, ప్రియా మిశ్రా 2/56).
భారత్: 34.3 ఓవర్లలో 241/4 (ప్రతిక 89, తేజల్ 53 నాటౌట్, అమీ మెగ్వైర్ 3/57).



4 వేల పరుగుల మంధాన..

వన్డేలలో అతి తక్కువ ఇన్నింగ్స్‌లో నాలుగు వేల పరుగులు చేసిన తొలి భారత బ్యాటర్‌గా మంధాన రికార్డు నెలకొల్పింది. 95వ ఇన్నింగ్స్‌లో ఆమె ఈ ఘనత సాధించింది.

'వరల్డ్ బెస్ట్' నీరజ్

ఎంపిక చేసిన అమెరికా మేగజీన్



న్యూఢిల్లీ: భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రాకు అరుదైన ఘనత దక్కింది. అమెరికాకు చెందిన ప్రఖ్యాత మేగజీన్ 'ట్రాక్ అండ్ ఫీల్డ్ న్యూస్' 2024 ప్రపంచ అత్యుత్తమ జావెలిన్ త్రోయర్‌గా నీరజ్‌ను ఎంపిక చేసింది. టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకంతో చరిత్ర సృష్టించిన 27 ఏళ్ల చోప్రా..పారిస్ ఒలింపిక్స్‌లో రజత పతకంతో మరో రికార్డు సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. గ్రెనడాకు చెందిన రెండుసార్లు ప్రపంచ చాంపియన్ ఆండర్సన్ పీటర్స్‌ను వెనక్కు నెట్టిన నీరజ్ అమెరికా మేగజీన్ ప్రతిష్ఠాత్మక అవార్డు కైవసం చేసుకున్నాడు. 1948లో ఆవిర్భవించిన 'ట్రాక్ అండ్ ఫీల్డ్ న్యూస్' పత్రికను క్రీడల్లో బైబిల్‌గా భావిస్తారు. విశ్వవ్యాప్త ట్రాక్, ఫీల్డ్ విభాగంలో ఈ మేగజీన్‌కు ఎంతో పేరు ప్రఖ్యాతులున్నాయి.

రేడియో జాకీతో చాహల్ డేటింగ్?



ముంబై: భారత జట్టు స్పిన్నర్ యజ్వేంద్ర చాహల్, ధనశ్రీ వర్మ దంపతులు విడిపోతున్నారంటూ గత కొద్ది రోజులుగా పెద్ద ఎత్తున ఊహాగానాలు వస్తున్నాయి. అయితే ఈ పుకార్లను చాహల్ కానీ ధనశ్రీకానీ ఖండించకపోవడంతో..అవి నిజమేనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈనేపథ్యంలో శుక్రవారం నెట్టింట్లో దర్శనమిచ్చిన ఫొటోలు చాహల్ దంపతులు విడిపోతున్నారనే వార్తలకు బలం చేకూర్చింది. తాను, చాహల్ కలిసి ఉన్న ఫొటోలను 28 ఏళ్ల రేడియో జాకీ మహవాష్ ఇన్‌స్టాలో పోస్ట్ చేసింది. క్రిస్మస్ సంబరాలను చాహల్‌తో కలిసి సెలబ్రేట్ చేసుకున్నానని వెల్లడించిన మహవాష్. 'చాహల్ నా ఫ్యామిలీ' అని రాయడం సంచలనం రేపింది. దాంతో మహవాష్‌తో చాహల్ డేటింగ్‌లో ఉన్నాడంటూ వార్తలు వెల్లువెత్తుతున్నాయి.

జడ్డూకు చోటు దక్కేనా!



యువ ఆటగాళ్లపై దృష్టి
రేసులో వరుణ్ చక్రవర్తి

న్యూఢిల్లీ: భారత క్రికెట్‌లో ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాది ప్రత్యేక స్థానం. బౌలింగ్, బ్యాటింగే కాకుండా అద్భుతమైన ఫీల్డర్‌గా పేరు తెచ్చుకున్నాడు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో తను కేవలం సుదీర్ఘ ఫార్మాట్‌కే పరిమితమయ్యేలా కనిపిస్తున్నాడు. ఎందుకంటే ఇప్పటికే జడ్డూ టీ20లకు వీడ్కోలు పలకగా.. తాజాగా వన్డేల్లోనూ అతడిని కొనసాగించడంపై సందేహాలు నెలకొన్నాయి. ఈ నెలలో ఇంగ్లండ్‌తో జరిగే పరిమిత ఓవర్ల సిరీస్‌లతో పాటు ఫిబ్రవరి 19 నుంచి జరిగే చాంపియన్స్ ట్రోఫీకి భారత జట్టును ప్రకటించాల్సి ఉంది. అంతేకాకుండా 2027 వరల్డ్‌కప్‌ను కూడా దృష్టిలో ఉంచుకుని యువ ఆటగాళ్లకు స్థానం కల్పించాలి. ఈనేపథ్యంలో జడ్డూకు చోటు దక్కడం కష్టమేనన్న వార్తలు వినిపిస్తున్నాయి. దీనికి తోడు 2023 వన్డే వరల్డ్‌కప్ తర్వాత 50 ఓవర్ల ఫార్మాట్‌లో అతను జట్టుకు ఆడింది లేదు. అలాగే ఆల్‌రౌండర్ విభాగంలో జడ్డూకు అక్షర్, సుందర్, దూబే, రియాన్ పరాగ్ గట్టి పోటీ ఇస్తున్నారు. హార్దిక్‌కు ఎలాగూ బెర్త్ ఖాయమే. దీనికి తోడు ఇటీవలి ఆస్ట్రేలియా పర్యటనలోనూ జడేజా ఆకట్టుకోలేకపోయాడు. అతను ఆడిన మూడు టెస్టుల్లో తీసింది నాలుగు వికెట్లే. బ్యాటింగ్‌లో మాత్రం ఓ అర్ధసెంచరీ చేశాడు. అందుకే భవిష్యత్ టోర్నీల్లో జడ్డూ లేకుండానే ముందుకు వెళ్లాలని సెలెక్టర్లు భావిస్తున్నట్టు బోర్డు వర్గాల సమాచారం. అయితే ఇంగ్లండ్‌తో ఆడబోయే టెస్టు సిరీస్‌లో మాత్రం జడేజా స్థానానికి ఢోకా ఉండకపోవచ్చు. కాగా, మిడిలార్డర్‌లో అనుభవజ్ఞుడైన ఆటగాడు లేకపోవడం అతడికి కలిసొచ్చే అంశం. మరోవైపు అదృష్టం బాగుంటే అతను చాంపియన్స్ ట్రోఫీలోనూ ఆడే అవకాశం లేక పోలేదన్నది కొందరి అభిప్రాయం. ఎందుకంటే ఈ మెగా టోర్నీలో భారత్ ఆడే మ్యాచ్‌లు దుబాయ్‌లో జరుగనున్నాయి. అక్కడి పిచ్‌లు ఎక్కువగా స్పిన్నర్లకే అనుకూలిస్తుంటాయి. దీంతో అపార అనుభవం కలిగిన వెటరన్ జడేజా జట్టులో ఉంటే సహాయకంగా ఉంటుందని సెలెక్టర్లు భావిస్తే మాత్రం అతను కూడా దుబాయ్ విమానం ఎక్కే ఆస్కారం ఉంది.

గౌతీచూపు ఇతనివైపు



ఐపీఎల్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ తరఫున విశేషంగా ఆకట్టుకున్న లెగ్ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తికి చాంపియన్స్ ట్రోఫీలో చోటు దక్కేలా ఉంది. ఈనెల 12 వరకు ఈ టోర్నీలో పాల్గొనే భారత ప్రాథమిక జట్టును ప్రకటించేందుకు గడువు ఉంది. ఇందులో భాగంగా స్పిన్ విభాగంలో వరుణ్ కూడా గట్టి పోటీదారుడుగా ఉన్నట్టు సమాచారం. జడేజా సహా ఇతర స్పిన్నర్లకంటే కూడా తనే రేసులో ముందున్నట్టు చెబుతున్నారు. కుల్దీప్ యాదవ్ ఫిట్‌నెస్‌పై సందేహాలు నెలకొనడంతో కోచ్ గంభీర్ చూపు వరుణ్‌పై పడింది. గతేడాది కేకేఆర్ విజేతగా నిలవడంలో వరుణ్‌ది కీలక పాత్ర. అలాగే ఆ సమయంలో జట్టు మెంటార్‌గా గంభీర్ వ్యవహరించాడు. తొలిసారి 2021 టీ20 వరల్డ్‌కప్‌లో తను జట్టుకు ఎంపికైనా ప్రభావం చూపలేదు. ఆ తర్వాత ఐపీఎల్ ప్రభావంతో గతేడాది తిరిగి చోటు దక్కించుకుని మెరుగ్గా రాణించాడు. అయితే ఇప్పటివరకు వన్డేల్లో మాత్రం అరంగేట్రం చేయలేదు.

వరుణ్ ఆరోన్ రిటైర్మెంట్



న్యూఢిల్లీ: భారత పేసర్ వరుణ్ ఆరోన్ అన్ని ఫార్మాట్ల క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. విజయ్ హజారే ట్రోఫీలో జార్ఖండ్ తరఫున అతడికి చోటు దక్కలేదు. దీంతో 35 ఏళ్ల వరుణ్ ఆటకు అల్విదా చెప్పడమే మేలని భావించాడు. 2023-24 సీజన్‌లో తను ఫస్ట్ క్లాస్ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పాడు. '20 ఏళ్లుగా క్రికెట్టే శ్వాసగా జీవించాను. అందుకే పూర్తి సంతృప్తితో ఆట నుంచి వైదొలుగుతున్నా' అని వరుణ్ ప్రకటించాడు. 2010-11 విజయ్ హజారే ట్రోఫీలో 150 కి.మీ వేగంతో బంతి విసిరి సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించాడు. దీంతో అదే ఏడాది ఆరోన్ భారత్ తరఫున వన్డే, టెస్టుల్లో అరంగేట్రం చేశాడు. 2015లో చివరి టెస్టు ఆడాడు. ఐపీఎల్‌లోనూ పలు జట్ల తరఫున బరిలోకి దిగిన వరుణ్ మొత్తంగా 9 టెస్టుల్లో 18, 9 వన్డేల్లో 11 వికెట్లు తీశాడు.

సెమీస్‌కు సాత్విక్ జోడీ

మలేసియా ఓపెన్



కౌలాలంపూర్: స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ షెట్టి మలేసియా ఓపెన్ సూపర్ 1000 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో టైటిల్ దిశగా దూసుకెళ్తోంది. ఏడోసీడ్‌గా బరిలోకి దిగిన భారత ద్వయం 26-24, 21-15తో స్థానిక ఫేవరెట్ జంట యే సిన్ ఓంగ్/ఎ యి తియోను చిత్తుచేసి సెమీఫైనల్లోకి ప్రవేశించింది. 49 నిమిషాల ఈ పోరులో ప్రత్యర్థి నుంచి తొలి గేమ్‌లో ప్రతిఘటన ఎదుర్కొన్న సాత్విక్ జోడీ.. ఆ తర్వాత అద్భుతంగా పుంజుకొని అలవోకగా మ్యాచ్‌ను ముగించింది. గతేడాది ఇక్కడ రన్నరప్‌గా నిలిచిన సాత్విక్/చిరాగ్ జోడీ సెమీఫైనల్లో దక్షిణ కొరియాకు చెందిన వోన్ హో కిమ్/సెంగ్ జే సియోతో అమీతుమీ తేల్చుకోనుంది. కాగా, ఈ టోర్నీలో సెమీస్ చేరడం సాత్విక్ ద్వయానికిది వరుసగా మూడోసారి కావడం విశేషం.

కోహ్లీ వల్లే యువీ వీడ్కోలు

రాబిన్ ఊతప్ప



న్యూఢిల్లీ: భారత క్రికెట్‌లో మునుపెన్నడూ లేని రీతిలో ఆటగాళ్లపై మాజీలు సంచలన ఆరోపణలు చేస్తున్నారు. అటు కోచ్ గంభీర్‌పై మనోజ్ తివారీ విరుచుకుపడుతుండగా.. మరోవైపు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీపై రాబిన్ ఊతప్ప ఘాటు వ్యాఖ్యలు చేశాడు. అతడి వల్లే యువరాజ్ సింగ్ అంతర్జాతీయ కెరీర్ ముగిసిందని ఆరోపించాడు. 'క్యాన్సర్‌ను జయించి తిరిగి క్రికెట్ ఆడిన యువీ ప్రస్థానం ఎంతోమందికి స్ఫూర్తిదాయకం. భారత్‌కు రెండు వరల్డ్‌కప్‌లు అందించడంలో కీలకపాత్ర పోషించాడు. కానీ అలాంటి ప్లేయర్‌కు అప్పటి కెప్టెన్ కోహ్లీ నుంచి ఎలాంటి మద్దతూ లభించలేదు. యువీ పడిన కష్టం కోహ్లీకి బాగా తెలుసు. అలాంటిది తన ప్రమాణాలకు సరితూగడం లేదనే సాకుతో యువీని పక్కనబెట్టాడు. అందరూ విరాట్‌లాగే ఫిట్‌గా ఉండాలంటే ఎలా? తన కోసం ఫిట్‌నెస్ టెస్టులో రెండు పాయింట్లు తగ్గించాలని యువీ కోరినా విరాట్ ఒప్పుకోలేదు. ఇందులో తొలుత విఫలమైనా ఆ తర్వాత కష్టపడి జట్టులోకి వచ్చాడు. కానీ చాంపియన్స్ ట్రోఫీలో సరిగా ఆడలేదని యువరాజ్‌ను పక్కకు తప్పించారు. దీంతో అతడు క్రికెట్‌కే వీడ్కోలు పలకాలని నిర్ణయం తీసుకున్నాడు' అని ఊతప్ప వివరించాడు.

బిజినెస్

ఈ ఏడాది రూ.14.27 లక్షల కోట్లు

క్యాపిటల్ మార్కెట్ ద్వారా నిధుల సమీకరణలో 21% వృద్ధి

సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్




ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో ఈక్విటీ, డెట్ పథకాల ద్వారా క్యాపిటల్ మార్కెట్ నుంచి కంపెనీల నిధుల సమీకరణ వార్షిక ప్రాతిపదికన 21 శాతం పెరిగి రూ.14.27 లక్షల కోట్లకు చేరుకోవచ్చని సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్ అన్నారు. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో నిధుల సేకరణ రూ.11.8 లక్షల కోట్లుగా నమోదైంది. 2024-25లో గడిచిన 9 నెలల్లో (ఏప్రిల్-డిసెంబరు) కంపెనీలు ఈక్విటీ జారీ ద్వారా రూ.3.3 లక్షల కోట్లు, డెట్ మార్కెట్ నుంచి రూ.7.3 లక్షల కోట్లు కలిపి మొత్తం రూ.10.7 లక్షల కోట్ల వరకు సమీకరించాయని బుచ్ తెలిపారు. ఈ మూడు నెలల్లో (జనవరి-మార్చి) సేకరించనున్న నిధులతో కలిపితే మొత్తం విలువ రూ.14 లక్షల కోట్లు దాటవచ్చని ఎన్ఐఎస్ఎం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఓ సదస్సులో ఆమె అంచనా వేశారు. మరిన్ని విషయాలు..

- గడిచిన 9 నెలల్లో క్యాపిటల్ మార్కెట్ నుంచి సమీకరించిన మొత్తంలో రియల్ ఎస్టేట్ ఇన్వె‌స్ట్‌మెంట్స్ ట్రస్ట్ (రీట్స్), ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (ఇన్విట్స్), మునిసిపల్ బాండ్ల జారీ ద్వారా పోగేసిన నిధుల వాటా చాలా స్వల్పంగా రూ.10,000 కోట్లకు పరిమితమైందని బుచ్ అన్నారు. కానీ, ఈ సాధనాల ద్వారా నిధుల సేకరణ వేగంగా పెరుగుతోందని.. వచ్చే దశాబ్ద కాలంలో ఈక్విటీ, డెట్ మార్కెట్లను వించిపోవచ్చన్నారు.
- అనుమతుల జారీని వేగవంతం చేసే దిశగా సెబీ కృషి చేస్తున్నదని, ఎస్ఎంఈ బోర్డుల ప్రతిపాదనలకు అనుమతుల సమయాన్ని తగ్గించేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. ఎస్ఎంఈ ఇష్యూలకు అనుమతిచ్చేందుకు ప్రస్తుతం 3 నెలల వరకు సమయం పడుతోందన్నారు. కాగా, బ్యాంకులు కేవలం 15 నిమిషాల్లో సూత్రప్రాయ అనుమతులిస్తున్నాయన్నారు.
- చాలా కంపెనీలు పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)కు ఆసక్తి చూపుతున్నాయని, సెబీకి దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయన్నారు. కానీ, ప్రిఫరెన్షియల్ ఇష్యూలు, ఇన్‌స్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్స్, రైట్స్ ఇష్యూలు వంటి ప్రత్యామ్నాయ మార్గాలూ ముఖ్యమేనని.. ఐపీఓల మోజులో వాటిని గమనించకపోయే ప్రమాదం ఉందన్నారు.
- రైట్స్ ఇష్యూలకు వేగంగా అనుమతులిచ్చేందుకు నియంత్రణ మండలి ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసిందన్నారు. మ్యూచువల్ ఫండ్ల కొత్త ఆఫర్లకు చాలా వేగంగా అనుమతులిస్తున్నామన్నారు.
- కేవలం రూ.250తో క్రమానుగత పెట్టుబడి పథకాన్ని (సిప్) ప్రారంభించే వెసులుబాటును త్వరలోనే అందుబాటులోకి తెస్తామన్నారు. గత కొన్నేళ్లలో మ్యూచువల్ ఫండ్లు వంటి దేశీయ సంస్థాగత ఇన్వెసర్లు (డీఐఐ) ప్రజల నుంచి చిన్న మొత్తాల్లో నిధులు సమీకరిస్తుండటాన్ని బుచ్ ప్రశంసించారు. వీరి నుంచి సమీకరించిన నిధులతో డీఐఐలు భారీగా పెట్టుబడులు పెట్టడం వల్లే మన మార్కెట్ ఒడుదుడుకులను తట్టుకోగలిగిందన్నారు.

వ్యక్తిగత రుణాలకు స్థిర వడ్డీ రేట్లు తప్పనిసరి

ఆర్‌బీఐ



ముంబై: నెలవారీ వాయిదాల (ఈఎంఐ) పద్ధతిలో చెల్లించే వ్యక్తిగత రుణాలను బ్యాంకులు తప్పనిసరిగా స్థిర వడ్డీ రేట్లకూ మంజూరు చేయాలని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) స్పష్టం చేసింది. దీనికి సంబంధించి శుక్రవారం తరచుగా అడిగే కొన్ని ప్రశ్నల (ఎఫ్ఏక్యూ)ను విడుదల చేసింది. అన్ని రకాల వ్యక్తిగత రుణాలకూ ఇది వర్తిస్తుందని స్పష్టం చేసింది. ఈ రుణాలు మంజూరు చేసేటప్పుడే వార్షిక వడ్డీ రేటును బ్యాంకులు తమ కీ ఫ్యాక్ట్ స్టేట్‌మెంట్ (కేఎఫ్ఎస్), రుణ ఒప్పందంలో తెలియజేయాలని కోరింది. ఏ కారణం చేతనైనా రుణ చెల్లింపు సమయంలో ఈఎంఐ లేదా కాలపరిమితి మారితే ఆ విషయాన్ని కూడా బ్యాంకులు రుణ గ్రహీతలకు తెలియజేయాలని స్పష్టం చేసింది. ప్రతి మూడు నెలలకు జారీ చేసే స్టేట్‌మెంట్స్‌లోనూ బ్యాంకులు అప్పటి వరకు వసూలు చేసిన అసలు, వడ్డీ వివరాలు, ఈఎంఐ మొత్తం, ఇంకా ఎన్ని ఈఎంఐలు చెల్లించాలి? ఇంకా చెల్లించాల్సిన అసలుపై చెల్లించవలసిన వడ్డీ రేటు కూడా తెలియజేయాలని కోరింది. వడ్డీ రేట్లను సవరించేటప్పుడు బ్యాంకుల వ్యక్తిగత రుణ గ్రహీతలకు తమ బోర్డు ఆమోదించిన విధానానికి అనుగుణంగా స్థిర వడ్డీ రేటుకు మారే అవకాశాన్ని తప్పనిసరిగా కల్పించాలని కూడా ఆర్‌బీఐ స్పష్టం చేసింది.

చిన్న సంస్థల రుణాలపై జర జాగ్రత్త



- నిధుల వినియోగం పర్యవేక్షణ తప్పదు
- ఇందుకోసం ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేయాలి
- 8-9 శాతం వృద్ధి రేటుతోనే వికసిత్ భారత్
- ఎస్‌బీఐ చైర్మన్ శ్రీనివాసులు శెట్టి

ముంబై: చిన్న కంపెనీలకు ఇచ్చే రుణాల వినియోగంపై అప్రమత్తంగా ఉండాలని భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) చైర్మన్ సీ శ్రీనివాసులు శెట్టి హెచ్చరించారు. ఈ సంస్థలు అప్పులు లేదా ఈక్విటీ ద్వారా సేకరించే నిధుల తుది వినియోగంపై నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. ఇందుకోసం ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీస్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐఎస్ఎం) ఏర్పాటు చేసిన ఒక సదస్సులో ఎస్‌బీఐ చైర్మన్ ఈ విషయాలు చెప్పారు. చిన్నచిన్న కంపెనీలు అప్పులు లేదా ఈక్విటీ ద్వారా సమీకరిస్తున్న నిధులను వేరే అవసరాలకు దారి మళ్లిస్తున్నాయని ఇటీవల పెద్దఎత్తున వార్తలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో శెట్టి ఈ వ్యాఖ్యలు చేయడం విశేషం.

అధికారాలూ ఉండాలి: కొత్తగా ఏర్పాటు చేసే సంస్థకు.. చిన్న కంపెనీలు అప్పులు లేదా ఈక్విటీ ద్వారా సేకరించే నిధుల తుది వినియోగాన్ని పర్యవేక్షించే అధికారం కూడా ఉండాలని ఎస్‌బీఐ చైర్మన్ శెట్టి స్పష్టం చేశారు. ఇలాంటి సంస్థ ఏర్పాటు అటు రుణదాతలకు.. ఇటు మదుపరులు ఇద్దరికీ మేలు చేస్తుందన్నారు. అప్పుడు చిన్న కంపెనీలు కూడా పోటీ పద్ధతిలో తక్కువ వడ్డీ రేటుకే రుణాలు పొందే సౌలభ్యం ఉంటుందన్నారు. గత ఏడాది మార్చిలో భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) కూడా చిన్న వ్యాపార సంస్థలకు ఇచ్చే రుణాలపై ఆందోళన వ్యక్తం చేసింది. ఈ రుణాల తుది వినియోగాన్ని అప్పులిచ్చిన బ్యాంకులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కోరింది. బిజినెస్ క్రెడిట్ కార్డులపై తీసుకున్న హామీ లేని రుణాలను కొందరు యువకులు నష్టభయం ఎక్కువగా ఉండే డెరివేటివ్స్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టడంపైనా ఎస్‌బీఐ చీఫ్ ఆందోళన వ్యక్తం చేశారు. యువకుల పెట్టుబడులు డెరివేటివ్ మార్కెట్లకు బదులు ప్రైమరీ మార్కెట్ లేదా మ్యూచువల్ ఫండ్స్ పథకాల్లోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా 2047 నాటికి మన దేశం అభివృద్ధి చెందిన (వికసిత్ భారత్) దేశంగా ఎదగాలంటే తీసుకోవాల్సిన చర్యలనూ ఎస్‌బీఐ చీఫ్ శెట్టి సూచించారు. ఇందుకోసం 2036 వరకు ఏటా 8-9 శాతం చొప్పున జీడీపీ వృద్ధి రేటు సాధించాల్సి ఉంటుందన్నారు. దీంతో పాటు జీడీపీలో పొదుపు రేటును ప్రస్తుత 30 శాతం నుంచి 33.5 శాతానికి పెంచుకోవాలన్నారు. ఈ విషయంలో క్యాపిటల్ మార్కెట్లది కీలక పాత్ర అన్నారు. సరైన రికార్డుల లేకపోవడంతో ఎంఎస్ఎంఈలకు ఇచ్చే రుణాల రిస్కును బ్యాంకులు, ఆర్థిక సంస్థలు సరిగా బేరీజు వేయలేకపోతున్నట్టు ఎస్‌బీఐ చైర్మన్ శెట్టి తెలిపారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

11వ తేదీ			
హైదరాబాద్	490	విజయవాడ	515
వరంగల్	492	గోదావరి	515
చిత్తూరు	523	విశాఖపట్నం	520
		దజను గుడ్లు రూ. 72	

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	79,470 ▲	72,850 ▲	1,01,000 ▲
విజయవాడ	80,500 ▲	75,000 ▼	92,500 ▲
విశాఖపట్నం	78,710 ▲	72,150 ▲	92,310 ▲
రాజమండ్రి	79,470 ▲	72,850 ▲	92,700 ▲
ప్రొద్దుటూరు	79,600 ▲	73,710 ▲	92,300 ▲
ముంబై	78,018 ▲	71,465 ▲	90,268 ▲

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	104	విజయవాడ	111
వరంగల్	104	గుంటూరు	110
కరీంనగర్	104	ఒంగోలు	110
మహబూబ్‌నగర్	104	చిత్తూరు	95
కర్నూలు	104	నెల్లూరు	100
విశాఖపట్నం	107	అనంతపురం	100
గోదావరి	111		

నామినేషన్ల వ్యవస్థ పునర్‌వ్యవస్థీకరణ

మార్చి 1 నుంచే అమలు: సెబీ

న్యూఢిల్లీ: మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్) ఫోలియోలు, డీమ్యాట్ ఖాతాల నామినేషన్ విధానాన్ని సెబీ పునర్ వ్యవస్థీకరించింది. దీనికి సంబంధించి శుక్రవారం కొన్ని మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ సంవత్సరం మార్చి 1 నుంచే ఇవి అమల్లోకి వస్తాయని తెలిపింది. సెక్యూరిటీస్ మార్కెట్లో పారదర్శకత పెంచడంతో పాటు క్లెయిమ్ చేయని ఆస్తుల తగ్గింపు కోసం సెబీ ఈ చర్య తీసుకుంది. ముఖ్యమైన మార్గదర్శకాలివే..

- సింగిల్ హోల్డింగ్ ఖాతాలకు నామినీ తప్పనిసరి
- జాయింట్ ఖాతాల్లోని చనిపోయిన వ్యక్తి ఆస్తులు నామినేషన్ లేకపోయినా బతికి ఉన్న మిగతా జాయింట్ ఖాతాదారులకు బదిలీ అవుతాయి
- తన తదనంతరం ఎంఎఫ్ ఫోలియోలు, డీమ్యాట్ ఖాతాల్లోని తన ఆస్తులు ఎవరికి ఎవరికి ఎంతెంత చెందాలనే విషయం స్పష్టం చేస్తూ ఖాతాదారులు 10 మందిని నామినేట్ చేసే అవకాశం
- ఖాతాదారుడితో పాటు నామినీల్లో ఎవరైనా చనిపోతే ఆస్తులను దామాషా పద్ధతిలో మిగతా నామినీలకు పంచుతారు
- చనిపోయిన వ్యక్తుల వారసుల తరఫున నామినీలు ట్రస్టీలుగా ఆస్తులు పొందేందుకు ఆమోదం.

1 డాలర్ = రూ. 86

- మరింత క్షీణించిన భారత కరెన్సీ
- సరికొత్త కనిష్ఠానికి మారకం విలువ

ముంబై: భారత కరెన్సీ సరికొత్త జీవిత కాల కనిష్ఠ స్థాయికి పతనమైంది. డాలర్‌తో రూపీ మారకం విలువ మరో 18 పైసలు క్షీణించి రూ.86.04కు చేరింది. ఎక్స్ఛేంజ్ రేటు రూ.86 దాటడం ఇదే తొలిసారి. అంతర్జాతీయంగా డాలర్ బలం పుంజుకుంటుండటంతో పాటు ముడిచమురు ధరల పెరుగుదల, ఈక్విటీ మార్కెట్లో నష్టాలు, విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు తరలిపోతుండటం మన రూపాయిని మరింత బలహీనపరిచాయని ఫారెక్స్ వర్గాలు పేర్కొన్నాయి. ఈ నెల 20న అమెరికా కొత్త అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టనున్న డొనాల్డ్ ట్రంప్ హయాంలో వాణిజ్య ఆంక్షలు పెరగవచ్చన్న ఆందోళనల కారణంగా దిగుమతిదారుల నుంచి డాలర్‌కు డిమాండ్ పెరిగిందని, దాంతో డాలర్ విలువ రోజురోజుకూ పెరుగుతూపోతోందని ఫారెక్స్ విశ్లేషకులు పేర్కొన్నారు. ఫారెక్స్ మార్కెట్లో శుక్రవారం రూ.85.88 వద్ద ప్రారంభమైన డాలర్-రూపీ ట్రేడింగ్.. ఒక దశలో కాస్త బలపడి రూ.85.85 స్థాయికి చేరింది. కానీ, చివరికి 14 పైసల నష్టంతో రూ.86 వద్ద స్థిరపడింది.

మళ్లీ 80 డాలర్లకు క్రూడ్

ముడిచమురు భగ్గుమంటోంది. బ్రెంట్ క్రూడాయిల్ మళ్లీ 80 డాలర్లు దాటింది. అంతర్జాతీయ కమోడిటీ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ పీపా ధర ఒక దశలో 4 శాతానికి పైగా ఎగబాకి 80.75 డాలర్లకు పెరిగింది. బ్రెంట్ క్రూడ్ రేటు ఈ స్థాయికి చేరడం గత ఏడాది అక్టోబరు తర్వాత మళ్లీ ఇదే మొదటిసారి. పెట్రోలియం ఎగుమతి దేశాలైన రష్యా, ఇరాన్‌పై అమెరికా మరిన్ని ఆంక్షలు విధించవచ్చని, దాంతో మార్కెట్లోకి సరఫరా గణనీయంగా తగ్గవచ్చన్న ఆందోళనలు ఇందుకు కారణమయ్యాయి.

ఐఎంటీఎంఏతో ఏస్ మైక్రోమాటిక్ జట్టు



బెంగళూరు (ఆంధ్రజ్యోతి): ఇండియన్ మెషీన్ టూల్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ (ఐఎంటీఎంఏ)తో ఏస్ మైక్రోమాటిక్ గ్రూప్‌తో వ్యూహాత్మక ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు ఐఎంటీఎంఏ డైరెక్టర్ జనరల్, సీఈఓ జిబాక్ దాస్‌గుప్తా, ఏస్ మైక్రోమాటిక్ డిజైనర్స్ ఎండీ టీకే రమేష్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. తయారీ రంగంలో ఉత్పాదకతను పెంచేందుకు ఈ ఒప్పందం దోహదపడుతుందని ఇరు సంస్థలు ప్రకటించాయి. కాగా 2015 నుంచి ఈ రెండు సంస్థలు సంయుక్తంగా నేషనల్ ప్రొడక్టివిటీ సమ్మిట్‌ను నిర్వహిస్తూ వస్తున్నాయి. తాజాగా ఈ భాగస్వామ్యాన్ని 2025 నుంచి మరో ఐదేళ్ల పాటు కొనసాగించనున్నాయి. ఒప్పందంలో భాగంగా ఈ సమ్మిట్‌కు ఏస్ మైక్రోమాటిక్ గ్రూప్ స్పాన్సర్‌గా వ్యవహరించనుంది. రానున్న సంవత్సరాల్లో నేషనల్ ప్రొడక్టివిటీ సమ్మిట్‌కు మరింత ప్రాచుర్యం కల్పించేందుకు ఈ ఒప్పందం ఎంతగానో దోహదపడుతుందని ఐఎంటీఎంఏ ప్రెసిడెంట్ ఎస్ రాజమనే అన్నారు.

సెన్సెక్స్ మరో 241 పాయింట్లు డౌన్

ముంబై: భారత స్టాక్ మార్కెట్ వరుసగా మూడో రోజూ నష్టపోయింది. సెన్సెక్స్ మరో 241.30 పాయింట్లు క్షీణించి 77,378.91 వద్దకు జారుకుంది. నిఫ్టీ 95 పాయింట్లు కోల్పోయి 23,431.50 వద్ద స్థిరపడింది. ముడిచమురు ధరల పెరుగుదల, డాలర్ బలోపేతం మార్కెట్‌ను మరింత కుంగదీశాయి. మూడు సెషన్లలో సెన్సెక్స్ 820.2 పాయింట్లు నష్టపోయింది. బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ మూడ్రోజుల్లో రూ.12.07 లక్షల కోట్లు తగ్గి రూ.429.67 లక్షల కోట్లకు (5 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది.



కేసీఆర్‌ను కలిసిన కేటీఆర్, కౌశిక్‌రెడ్డి, బాల్క సుమన్, కార్తీక్‌రెడ్డి

అరెస్టులకు భయపడే ప్రసక్తే లేదు

- ఆత్మస్థైర్యం కోల్పోకుండా పోరాడండి
- కేటీఆర్‌కు కేసీఆర్ దిశానిర్దేశం
- ఎర్రవల్లిలో కేసీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్ నేతలు

మర్కుక్/హైదరాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కలిశారు. ఫార్ములా ఈ-కారు రేసు కేసులో శుక్రవారం ఏసీబీ విచారణ అనంతరం శనివారం ఆయన సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలంలోని ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో కేసీఆర్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా భవిష్యత్ కార్యాచరణపై కేటీఆర్‌కు కేసీఆర్ దిశానిర్దేశం చేసినట్లు సమాచారం. పైశాచిక ఆనందం కోసం సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ మాజీ మంత్రులను, ఎమ్మెల్యేలను భయపెట్టి అనవసరపు కేసులు పెట్టించి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని కేసీఆర్ ఈ సందర్భంగా అన్నారు. ప్రజలు ఇదంతా గమనిస్తున్నారని, మనం ఏ తప్పూ చేయలేదని, ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని కేటీఆర్‌తో చెప్పారు. ఏ మాత్రం ఆత్మస్థైర్యం కోల్పోకుండా మొండిగా పోరాడాలని సూచించారు. పార్టీ కార్యకర్తలు ఎవరూ అధైర్యపడొద్దని, సంక్రాంతి తర్వాత నియోజకవర్గస్థాయి వారిగా అందరినీ స్వయంగా తానే పిలిపించుకుని మాట్లాడతానని పేర్కొన్నారు. స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కేటీఆర్‌తో పాటు ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, పార్టీ నేత కార్తీక్‌రెడ్డి కేసీఆర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

ఒకరిని ఎన్నుకుంటే అరడజన్ సీఎంలు వచ్చారు: కేటీఆర్

రాష్ట్రంలో ఒక సీఎంను ఎన్నుకుంటే.. మరో అరడజన్ మంది సీఎంలు ఫ్రీగా వచ్చారని.. ఇది తెలంగాణ ప్రజల అదృష్టమని కేటీఆర్ పేర్కొన్నారు. వన్‌ప్లస్ 6 ఆఫర్ లాంటి సీఎం వ్యవస్థను భారతదేశ చరిత్రలో ఎప్పుడూ చూడలేదేమోనని శుక్రవారం ఎక్స్ వేదికగా ఆయన ఎద్దేవాచేశారు. వికారాబాద్ సీఎం తిరుపతిరెడ్డికి హృదయపూర్వక శుభాకాంక్షలు అని తెలిపారు.

కేటీఆర్‌పై బంజారాహిల్స్ పీఎస్‌లో కేసు నమోదు

బంజారాహిల్స్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఏసీబీ కార్యాలయం నుంచి అనుమతి లేకుండా ర్యాలీ నిర్వహించినందుకు గాను కేటీఆర్‌తో పాటు మరో ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఫార్ములా ఈ కేసులో విచారణలో భాగంగా ఈ నెల 9న కేటీఆర్ బంజారాహిల్స్ రోడ్డు నెంబరు 12లోని ఏసీబీ కార్యాలయానికి వచ్చారు. విచారణ అనంతరం తన వాహనంలో బయటకు వచ్చిన కేటీఆర్ మీడియాతో మాట్లాడేందుకు ప్రయత్నించారు. ఇంతలో కొంత మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అక్కడకు చేరుకొని ఏసీబీ కార్యాలయం నుంచి తెలంగాణ భవన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనుమతి లేకపోవడంతో పాటు సాధారణ ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించేలా వ్యవహరించడంతో ట్రాఫిక్ పోలీసుల ఫిర్యాదు మేరకు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, నాయకులు మన్నె గోవర్ధన్, జయసింహ, క్రిశాంక్, గెల్లు శ్రీనివాస్‌పై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు.

సీఎం రేవంత్ చిత్రపటానికి పాలతో అభిషేకం

హైదరాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే గ్రామపంచాయతీ ఉద్యోగులకు ప్రతినెలా వేతనాలు చెల్లించాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించడం హర్షణీయమని తెలంగాణ గ్రామపంచాయతీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మామిడాల నర్సింహులు, ఇతర కార్యవర్గ సభ్యులు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం వారు సచివాలయం వద్ద సీఎం చిత్రపటానికి పాలతో అభిషేకం చేసి తమ ఆనందం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకునేందుకు కృషి చేసిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి అనసూయ సీతక్కకు వారు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు బీజేపీ అభ్యర్థుల ఖరారు

త్వరలో జరగనున్న మూడు ఎమ్మెల్సీ స్థానాలకు బీజేపీ తన అభ్యర్థులను ఖరారు చేసింది. రెండు ఉపాధ్యాయ, మరో పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీల పదవీ కాలం మార్చి 29తో ముగియనున్న సంగతి తెలిసిందే. ఈ మేరకు కరీంనగర్- నిజామాబాద్- ఆదిలాబాద్-మెదక్ పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థిగా సి.అంజిరెడ్డి, కరీంనగర్-నిజామాబాద్- ఆదిలాబాద్- మెదక్ ఉపాధ్యాయ నియోజకవర్గ అభ్యర్థిగా మల్క కొమురయ్య, నల్లగొండ-వరంగల్-ఖమ్మం ఉపాధ్యాయ నియోజక వర్గ అభ్యర్థిగా పులి సరోత్తమ్‌రెడ్డిని ఖరారు చేసినట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి శుక్రవారం ప్రకటించారు. పెద్దపల్లికి చెందిన మల్క కొమురయ్య... పల్లవి విద్యాసంస్థల చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన సి.అంజిరెడ్డి వ్యాపారవేత్త కాగా, ఆయన సతీమణి సంగారెడ్డి బీజేపీ జిల్లా అధ్యక్షురాలుగా కొనసాగుతున్నారు. వరంగల్‌కు చెందిన పులి సరోత్తమ్‌రెడ్డి పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శిగా, టీజేఏసీలో క్రియాశీలకంగా పని చేశారు.

20 కోచ్‌లతో సికింద్రాబాద్-విశాఖ వందేభారత్

హైదరాబాద్ సిటీ/హైదరాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ - విశాఖపట్నం మధ్య నడిచే వందేభారత్ (20833/20834)రైళ్లను ప్రారంభించి రెండేళ్లు పూర్తికావస్తోంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం 16 కోచ్‌లతో నడుస్తున్న వందేభారత్ అదనంగా మరో 4 కోచ్‌లను జత చేయాలని దక్షిణ మధ్య రైల్వే నిర్ణయించింది. దీంతో మొత్తం 20బోగీల పొడవైన వందేభారత్‌లో ప్రయాణికుల సామర్థ్యం ఇంతకు ముందున్న 1,128 నుంచి 1,440కు పెరిగింది. సంక్రాంతి రద్దీ నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే తీసుకున్న నిర్ణయంతో అదనంగా మరో 312మంది ప్రయాణికులకు సౌకర్యం కల్పించినట్లయింది. అదనపు బోగీల పెంపు శనివారం నుంచే అమల్లోకి వస్తుందని సీపీఆర్‌వో శ్రీధర్ తెలిపారు.

సైబర్ నేరగాళ్ల సేవలో తెలంగాణ గ్రామం!

ట్రేడింగ్ పేరిట తెలియకుండానే సైబర్ మోసాల్లోకి..

ఆ ఊరి యువతదంతా అదే దారి.. ఇద్దరి అరెస్టుతో వెలుగులోకి

హైదరాబాద్ సిటీ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కోదాడ సమీపంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడు హైదరాబాద్‌లో బీటెక్ అగ్రికల్చర్ చదువుతున్నాడు. ఊరి నుంచి యువకుడి తండ్రి ఫోన్ చేసి, అర్జెంట్‌గా ఇంటికి రావాలని, ఊర్లో కుర్రాళ్లంతా ట్రేడింగ్ చేస్తూ రోజుకు వేలల్లో సంపాదిస్తున్నట్లు చెప్పాడు. తండ్రి మాట కాదనలేక అతడు ఊరెళ్లాడు. అప్పటికే ఆ తండ్రి ట్రేడింగ్ నేర్చుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు. ఊరెళ్లిన కొడుకు ఇతర యువకులతో పాటు.. కొన్ని ట్రేడింగ్ యాప్‌లను డౌన్‌లోడ్ చేసి ట్రేడింగ్‌లో పాల్గొనడం, నిర్వాహకులకు బ్యాంకు ఖాతాలు అందించడం, ఇతరులతో పెట్టుబడులు పెట్టించి ఆ డబ్బును యూఎస్‌డీలుగా కన్వర్ట్ చేసి పంపడం చేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన ఓ మహిళకు ఇద్దరు కూతుళ్లు.. కొంత కాలం క్రితం భర్త మృతి చెందడంతో ఆడపిల్లల బాధ్యత తనపై పడింది. దాంతో ఆమె కష్టపడి పెద్ద కూతురు పెళ్లి చేసింది. రెండో కూతురు హైదరాబాద్‌లో బీటెక్ చదువుతోంది. ఊర్లో ఉన్న యువతీయువకులంతా ట్రేడింగ్ చేసి డబ్బులు సంపాదిస్తున్నారని తెలిసిన తల్లి.. తన కూతురును పట్టుబట్టి గ్రామానికి రప్పించింది. తల్లి మాట కాదనలేక ఆ యువతి ట్రేడింగ్ చేస్తూ పెట్టుబడులు పెట్టించడం, బ్యాంకు ఖాతాలు సమకూర్చడం చేస్తోంది. డబ్బుల వస్తాయన్న ఆశతో.. తల్లిదండ్రుల ఒత్తిడితో ట్రేడింగ్ పేరిట తెలియకుండానే ఆ ఊరి యువత సైబర్ మోసాల్లో పాలుపంచుకున్నారు. ఓ ట్రేడింగ్ మోసం కేసును హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు ఛేదించే క్రమంలో ఆ గ్రామానికి చెందిన ఓ యువతి, మరో యువకుడికి సంబంధముందని తేలడంతో.. విచారించగా అసలు విషయం బయటపడింది. ఆ ఊరిలోని వారంతా ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెట్టించడంతో పాటు.. బ్యాంకు ఖాతాలు సమకూర్చడం, సైబర్ మోసగాళ్లకు సహకరిస్తూ.. పెట్టుబడి పెట్టిన డబ్బును యూఎస్‌డీలుగా మార్చడం వంటి నేరాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. దీంతో వారినీ నిందితులుగా చేర్చారు. అదుపులోకి తీసుకుని నోటీసులు జారీ చేశారు. తెలిసీ తెలియకుండా ట్రేడింగ్ పేరిట డబ్బు కోసం సైబర్ నేరాల బారిన పడొద్దని, నేరగాళ్లకు సహకరించి సైబర్ నేరాల్లో ఇరుక్కోవద్దని డీసీపీ ధార కవిత హెచ్చరించారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న ట్రావెల్స్ బస్సు..

ఐదుగురు వలస కూలీల మృతి

10 మందికి గాయాలు.. సూర్యాపేట జిల్లాలో రోడ్డు ప్రమాదం..

- మృతులంతా ఒడిశాకు చెందిన వారే

చివ్వెంల, కొడకండ్ల, జనవరి 10(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా చివ్వెంల మండల పరిధిలోని ఐలాపురం గ్రామ స్టేజీ సమీపంలో ఖమ్మం-హైదరాబాద్ జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. టైరు పేలి రోడ్డు పక్కన నిలిపి ఉంచిన లారీని ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టిన ఘటనలో ఐదుగురు కూలీలు అక్కడికక్కడే మృతిచెందగా, 10మందికిపైగా గాయపడ్డారు. మృతుల్లో భార్యాభర్తలు, ఓ మహిళ, వృద్ధుడు, డ్రైవర్ ఉన్నారు. క్షతగాత్రుల్లో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఒడిశాలోని కోరాపూట్ జిల్లాకు చెందిన 32 మంది భవన నిర్మాణ కార్మికులు సొంతూరు నుంచి హైదరాబాద్‌కు వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బస్సులో ఇరుక్కున్న మృతదేహాలను బయటికి తీయించారు.క్షతగాత్రులను సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించారు. రెండు వాహనాలను ప్రొక్లెయినర్ల సహాయంతో పక్కకు తొలగించారు. టైరు పేలడంతో లారీని రోడ్డు పక్కకు నిలిపే సమయంలో లారీ డ్రైవర్ ఎలాంటి జాగ్రత్తలు పాటించలేదని తెలుస్తోంది. మంచు కురుస్తుండటం, బస్సు డ్రైవర్ అతివేగంగా రావడంతోనే ఆగి ఉన్న లారీని ఢీకొట్టి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.



ప్రమాదంలో ధ్వంసమైన ట్రావెల్స్ బస్సు

జనగామ జిల్లాలో ప్రమాదం.. ఇద్దరి మృతి

జనగామ జిల్లాలో గురువారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఇనుప రేకుల లోడ్‌తో ఉన్న డీసీఎం వాహనాన్ని తుఫాన్ వాహనం ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే దుర్మరణం చెందగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. అంతా ఒకే కుటుంబానికి చెందినవారు. సూర్యాపేట జిల్లా నాగారం మండలం ఈటూరు గ్రామానికి చెందిన పేరాల వెంకన్న(45), పేరాల లక్ష్మి(35)లు అక్కడికక్కడ మృతిచెందగా పేరాల ఉపయ్య, లావణ్య, ఉప్పలమ్మ, ముత్యాలు, వంగూరి నరసమ్మలకు తీవ్రగాయాలయ్యాయి. జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కడవెండిలో డోలారోహణ వేడుకలకు హాజరై తుఫాన్ వాహనంలో తిరిగి వెళ్తుండగా అర్ధరాత్రి కొడకండ్ల మండలంలోని మైదం చెరువుతండా సమీపంలో ఈ ప్రమాదం జరిగింది.

పట్నం బైలెల్లినాదో!

హైదరాబాద్ నుంచి పల్లెలకు చలో.. సంక్రాంతికి పిల్లాజెల్లాతో కదిలిన జనం

6432 ప్రత్యేక బస్సులు.. 366 ప్రత్యేక రైళ్లు

బస్సుల్లో 50% అధిక చార్జీ.. ప్రజల గగ్గోలు

3 రెట్లు పెరిగిన విమాన టిక్కెట్ల ధరలు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

సంబురాల సంక్రాంతి కోసం పట్నం జనాలు కదిలారు పల్లెల వైపు! పుట్టి పెరిగిన ఊళ్లోనైతే తల్లిదండ్రులు, బంధువుల మధ్య జరుపుకొంటేనే అసలైన పండగ.. సిసలైన పండగ అంటూ పిల్లాజెల్లాతో కలిసి ఉత్సాహంగా బయలుదేరారు! ఫలితంగా దారులన్నీ హైదరాబాద్ శివార్లవైపు సాగుతున్నాయి. ప్రైవేటు వాహనాల వరుసతో ఆ రోడ్లన్నీ రద్దీగా మారాయి! బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లలోనూ జనమే జనం! బస్సులు, రైళ్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. శుక్రవారం మొదలైన ఈ సందడి.. శనివారం నుంచి విద్యాసంస్థలకు సెలవులు కావడంతో రద్దీ మరింతగా పెరగనుంది. సంక్రాంతి పండుగ నేపథ్యంలో ప్రయాణికుల సౌకర్యార్థం టీఎస్ఆర్టీసీ ప్రత్యేకంగా 6,432 బస్సులను నడపనుందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఎంజీబీఎస్, ఉప్పల్, ఎల్బీనగర్, ఆరంఘర్, బస్టాండ్లలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శనివారం తెలంగాణలోని జిల్లాలకు 1600, ఏపీవైపు 300 ప్రత్యేక బస్సులు నడిపేలా ప్రణాళిక వేశారు. అయితే ఈ స్పెషల్ బస్సుల్లో అదనంగా 50శాతం చార్జీలు వసూలు చేస్తున్నారని ప్రయాణికులు మండిపడుతున్నారు. పండుగ రద్దీని ఆసరాగా చేసుకొని ఎక్కువ చార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని ప్రైవేటు ట్రావెల్స్ నిర్వాహకులను పొన్నం హెచ్చరించారు. ఎక్కువ చార్జీలు వసూలు చేసే బస్సులను సీజ్ చేయాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐదు ప్రైవేటు బస్సులను అధికారులు సీజ్ చేయడం గమనార్హం. ఇక సంక్రాంతి సందర్భంగా 366 ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు పేర్కొన్నారు. చర్లపల్లి టెర్మినల్ నుంచి ఏపీలోని నర్సాపూర్, కాకినాడ, శ్రీకాకుళం తదితర ప్రాంతాలకు 59 ప్రత్యేక రైళ్లు వేశామని చెప్పారు. 11, 12 తేదీల్లో చర్లపల్లి- విశాఖపట్నం-చర్లపల్లి వరకు సాధారణ కోచ్‌లతో 16 జన సాధారణ రైళ్లు నడుస్తున్నట్టు పేర్కొన్నారు. అన్ రిజర్వ్‌డ్ కోచ్‌ల్లో వెళ్లే ప్రయాణికులు కౌంటర్ల వద్ద నిరీక్షించాల్సిన అవసరం లేకుండా మొబైల్ యాప్‌లో యూటీఎస్ ద్వారా టిక్కెట్ పొందడానికి అవకాశం ఉందని వెల్లడించారు.. అన్‌రిజర్వ్ కోచ్‌లతో ప్రత్యేక రైళ్లు నర్సాపూర్, కాకినాడ, విశాఖపట్నం, శ్రీకాకుళం, మచిలీపట్నం, తిరుపతి, బైరంపూర్, జైపూర్, గోరఖ్‌పూర్, కటక్, మధురై, అర్సికెరె తదితర ప్రాంతాలకు నడుస్తున్నట్టు తెలిపారు. అలాగే జోన్ నుంచి నెల్లూరు, విజయవాడ, రాజమండ్రి, వరంగల్ తదితర స్టేషన్‌ల మీదుగా ప్రత్యేక రైళ్లు నడుస్తున్నట్టు వివరించారు. చెన్నై, బెంగళూరు, మధురై జోన్‌ల నుంచి వచ్చే షాలిమార్, సంబల్పూర్, బరౌని, విశాఖపట్నం తదితర స్టేషన్‌లకు మరికొన్ని ప్రత్యేక రైళ్లు నడుస్తున్నాయన్నారు. పండుగ నేపథ్యంలో విమాన చార్జీలు మూడు రెట్లు పెరిగాయి. హైదరాబాద్ నుంచి విశాఖకు శని, ఆదివారాల్లో గరిష్ఠంగా రూ.17 నుంచి రూ. 18వేల మధ్య టిక్కెట్ ధరలు ఉన్నాయి. హైదరాబాద్ నుంచి విజయవాడకు ఆదివారం టిక్కెట్ ధర రూ. 16,976లు ఉండగా రాజమండ్రికి అదే రోజు టిక్కెట్ ధర రూ. 15,086లు ఉంది. ప్రతి గంటకు టిక్కెట్ ధరలు మారుతున్నాయి. బెంగుళూరు నుంచి విశాఖపట్నానికి టిక్కెట్ ధర రూ. 17,391 ఉండగా బెంగుళూరు నుంచి రాజమండ్రికి టిక్కెట్ ధర 16,357గా ఉంది. కాగా హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి, యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌గేటు వద్ద సంక్రాంతి పండుగ నేపథ్యంలో వాహనాల రద్దీ నెలకొంది. టోల్‌గేటు వద్ద వాహనాలు బారులు తీరాయి. ఉదయం, సాయంత్రం రద్దీ ఎక్కువగా కనిపించింది. 16 గేట్లకు 10 గేట్ల ద్వారా విజయవాడ వైపు వాహనాలను పంపించారు. మరో రెండు గేట్ల ద్వారా ద్విచక్ర, త్రిచక్ర వాహనాలను పంపిస్తున్నారు. సాధారణ రోజుల్లో 30వేల నుంచి 35వేల వాహనాలు రాకపోకలు సాగిస్తుండగా శుక్రవారం పండుగ నేపథ్యంలో 8000 వాహనాలు అదనంగా రాకపోకలు సాగించినట్లు సిబ్బంది తెలిపారు. నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం కొర్లపహాడ్, టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ ఎక్కువగా ఉంది.



యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలో జాతీయ రహదారిపై వాహనాల బారులు

ఏపీవైపు ప్రత్యేక హైటెక్ వోల్వో బస్సులు

హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని వేర్వేరు ప్రాంతాలకు ప్రత్యేకంగా హైటెక్, వోల్వో బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ (టీజీటీడీసీ) అధికారులు తెలిపారు. ఏపీలోని విజయవాడ, ఏలూరు, కాకినాడ, విశాఖపట్నం, తిరుపతి ప్రాంతాలకు ఈ బస్సులు నడుస్తాయని చెప్పారు. ఈ బస్సులు సికింద్రాబాద్ యాత్రినివాస్, బషీర్‌బాగ్ సీఆర్‌వో, ఎల్బీనగర్ నుంచి బయలుదేరుతాయని చెప్పారు. మరిన్ని వివరాలకు 9848540371, 9848125720లో సంప్రదించాలని, వెబ్‌సైట్ (టీటీడీఎస్.టీజీ.జీవ్) ద్వారా సీట్లు బుకింగ్ చేసుకోవచ్చునని చెప్పారు.

హరీశ్‌కు హైకోర్టులో ఊరట

- ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టు వద్దంటూ ఇచ్చిన ఉత్తర్వులు పొడిగింపు

హైదరాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడిగా ఉన్న మాజీ మంత్రి హరీశ్‌రావుకు హైకోర్టులో మరోమారు ఊరట లభించింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆయనను అరెస్ట్ చేయరాదంటూ గతంలో ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు ఈనెల 28 వరకు పొడిగించింది. ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి హరీశ్‌రావు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్ జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం ఎదుట శుక్రవారం విచారణకు వచ్చింది. హరీశ్‌రావు తరఫున సీనియర్ న్యాయవాది జే రామచంద్రరావు వాదిస్తూ.. పంజాగుట్ట పోలీసులు దాఖలు చేసిన కౌంటర్‌కు బదులు దాఖలు చేస్తామని, నాలుగు వారాపాటు మధ్యంతర ఉత్తర్వులను పొడిగించాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం విచారణను 28కి వాయిదా వేసింది.

తెలంగాణ బార్ కౌన్సిల్ ఎన్నికల షెడ్యూల్ ఇవ్వండి : హైకోర్టు

హైదరాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదుల నమోదు ప్రక్రియ, వృత్తిపరమైన వ్యవహారాలను నిర్వహించే తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికల షెడ్యూల్‌ను సమర్పించాలని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ), రాష్ట్ర బార్ కౌన్సిల్‌కు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుత బార్ కౌన్సిల్ కార్యవర్గం ఐదేళ్ల పదవీకాలం పూర్తిచేసుకోవడంతోపాటు అత్యవసర పరిస్థితుల్లో వినియోగించుకోవాల్సిన ఆరు నెలల పొడిగింపు కాలాన్ని కూడా పూర్తి చేసుకున్నారని.. అయినా ఎన్నికలు నిర్వహించకుండా కాలయాపన చేస్తున్నారని పేర్కొంటూ కొక్కుల అశోక్ అనే న్యాయవాది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. బీసీఐ, పిటిషనర్ తరఫున వాదనలు విన్న ధర్మాసనం ఈనెల 31 నాటికి తెలంగాణ బార్ కౌన్సిల్ ఎన్నికల షెడ్యూల్ సమర్పించాలని స్పష్టం చేసింది.

కాంగ్రెస్, బీఆర్ఎస్ కుమ్మక్కు రాజకీయాలు

- కాంగ్రెస్ పెద్దలకు కప్పం కడుతున్న కేసీఆర్
- అందుకే కేటీఆర్‌ను రేవంత్ ఏం చేయలేకపోతున్నారు
- ఫార్ములా-ఈ రేసు కేసులో చర్యలెందుకు చేపట్టడం లేదు
- కేటీఆర్ జైలుకెళ్తే గొడవ చేయడానికి ఆయన స్వాతంత్ర్య సమరయోధుడా?
- కేంద్ర మంత్రి బండి సంజయ్



కరీంనగర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విషయంలో కాంగ్రెస్ చేస్తున్నది హంగామా వ్యవహారమేనన్నారు. శుక్రవారం కరీంనగర్ రైల్వేస్టేషన్ పనులను పరిశీలించిన అనంతరం మీడియాతో సంజయ్ మాట్లాడారు. క్యాబినెట్ ఆమోదం లేకుండా కోట్ల రూపాయలు విడుదల చేసినప్పటికీ కేటీఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు ఎందుకు చేపట్టడం లేదని నిలదీశారు. రూ.700 కోట్ల లాభం వచ్చినట్లు డ్రామాలాడుతున్నారని, ఆ లాభం ఎలా వచ్చిందో, ఆ డబ్బులు ఎక్కడ ఉన్నాయో ప్రజలకు వివరించాలని ఆయన డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డిని కేటీఆర్ అడ్డగోలుగా తిడుతున్నా పట్టించుకోకపోవడం వెనుక అంతర్యమేంటని ఆయన ప్రశ్నించారు. కేసీఆర్ ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలకు కప్పం కడుతున్నందువల్లనే రేవంత్ రెడ్డి... కేటీఆర్‌ను ఏం చేయలేకపోతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ డ్రామాలు, కేసీఆర్ కుటుంబ అవినీతిపై రాజీలేని పోరు కొనసాగిస్తామన్నారు. ఫార్ములా-ఈ రేస్ స్కాంలో కేటీఆర్ తీరుపై బండి సంజయ్ ధ్వజమెత్తారు. క్యాబినెట్ అనుమతులు లేకుండా సర్కారు సొమ్మును అప్పనంగా విడుదల చేయాల్సిన అవసరం ఏముందని నిలదీశారు. ఈ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం కేటీఆర్‌పై చర్యలు ఎందుకు తీసుకోవడంలేదన్నారు. విచారణ పేరుతో అరెస్టు చేయకుండా జాప్యం చేస్తున్నారంటే అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. కేసీఆర్‌తో రేవంత్‌రెడ్డి లోపాయికారి ఒప్పందం చేసుకున్నట్లు అనుమానం ఉందన్నారు. చిట్టినాయుడు అంటూ బూతులు తిడుతున్నా రేవంత్ చర్యలు ఎందుకు చేపట్టడం లేదన్నారు. కేటీఆర్ జైలుకు వెళ్తే బీఆర్ఎస్ నేతలు గొడవ చేయడానికి ఆయనేమైనా స్వాతంత్ర్య సమరయోధుడా అని ప్రశ్నించారు. కేటీఆర్ బావమరిది ఫాంహౌస్ కేసులో డ్రగ్స్‌తో దొరికినా హడావుడి చేసి చివరకు వ్యవహారాన్ని నీరు గార్చారన్నారు. కేసీఆర్ కాంగ్రెస్ నుంచి వచ్చినోడేనని.. స్కామ్‌లు తెరమీదకు రాగానే ఢిల్లీకి వెళ్లి కప్పం కట్టి వస్తున్నాడన్నారు.బీఆర్ఎస్ అవినీతి, కేసీఆర్ కుటుంబ బండారాన్ని ప్రజల ముందుంచి తీరుతామన్నారు.

సంక్రాంతికి సాఫీగా ప్రయాణం!

నేటి నుంచి వాహనాల రద్దీ పెరిగే చాన్స్.. రెండు టోల్‌ప్లాజాల వద్ద అదనపు సిబ్బంది

- ప్రమాదాల నివారణపై నజర్
- జాతీయరహదారిపై నిరంతర పెట్రోలింగ్
- క్రేన్లు, టోయింగ్ వాహనాల ఏర్పాటు
- పోలీస్, ఎన్‌హెచ్ఏఐ ఆధ్వర్యంలో చర్యలు

సూర్యాపేటక్రైం/చౌటుప్పల్ రూరల్/కేతేపల్లి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ వేళ జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు అటు పోలీస్ శాఖ.. ఇటు ఎన్‌హెచ్ఏఐ ప్రత్యేక చర్యలు చేపట్టాయి. వాహనాల వేగ నియంత్రణతో పాటు టోల్ ప్లాజాల వద్ద వాహనాల రద్దీని అరికట్టేందుకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నాయి. గత ఏడాది బోగికి ముందు రెండు రోజుల్లో 1.45లక్షల వాహనాలు పంతంగి టోల్‌గేటు మీదుగా వెళ్లినట్లు లెక్క తేలింది. ఈ సారి అంతకుమించి ట్రాఫిక్ ఉంటుందని, నేటి నుంచి వాహనాల రద్దీ పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. ఈ మేరకు ఎన్‌హెచ్ఏఐ అధికారులు, టోల్‌గేట్ నిర్వాహకులు, స్థానిక పోలీసులతో రాచకొండ సీపీ సుధీర్‌బాబు ఇటీవల ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. సీపీ సూచన మేరకు జాతీయ రహదారులపై ప్రయాణం సాఫీగా సాగేలా చర్యలు చేపట్టారు. తూప్రాన్‌పేట, దండుమల్కాపురం, ధర్మాజీగూడెం, చౌటుప్పల్, అంకిరెడ్డిగూడెం ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్‌ల నివారణకు ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయించారు. పంతంగి, కొర్లపహాడ్ టోల్‌గేట్ల వద్ద వాహనాలు బారులు తీరకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వాహనాల వద్దకే సిబ్బంది వచ్చి ఫాస్టాగ్‌ను స్కాన్ చేసేందుకు వీలుగా హ్యాండ్ మిషన్లు, స్టిక్ మిషన్లను అందుబాటులో ఉంచారు. మూడు సెకన్లలోనే ఫాస్టాగ్‌ను స్కాన్ చేసి, వాహనాలను పంపిస్తున్నారు. నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని ఉప్పలపహాడ్, చీకటిగూడెం, కేతేపల్లి ఎస్సీ కాలనీ, కేతేపల్లి డీపౌల్ స్కూల్, కొర్లపహాడ్, ఇనుపాముల వద్ద స్థానికులు రోడ్డు దాటేందుకు జంక్షన్లను ఏర్పాటు చేశారు. సూర్యాపేట రూరల్, మునగాల, కోదాడ రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు 24 గంటలూ పెట్రోలింగ్ చేయనున్నారు. ప్రతి సర్కిల్ పరిధిలో ఒక సీఐతో పాటు ఇద్దరు ఎస్సైలు, సిబ్బంది విధుల్లో ఉంటారు. ఎక్కడైనా వాహనం మరమ్మతుకు గురైతే వెంటనే రోడ్డు మీది నుంచి పక్కకు తీయించేందుకు జాతీయ రహదారిపై రెండు క్రేన్లను అందుబాటులో ఉంచారు. ఎవరైనా గాయపడితే.. వెంటనే ఆస్పత్రికి తరలించేందుకు 108 అంబులెన్స్‌లు, జీఎంఆర్ సంస్థకు చెందిన అంబులెన్స్‌లు అందుబాటులో ఉండనున్నాయి. వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు సూర్యాపేట, మునగాల, కోదాడ ప్రాంతాల్లో స్పీడ్ గన్లతో జరిమానాలు విధిస్తున్నారు. తరుచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో ఇప్పటికే రోడ్డు స్టాపర్లు ఏర్పాటు చేశారు. సూర్యాపేట శివారు నుంచి కోదాడ సరిహద్దు వరకు ప్రధాన రహదారిపై హోటళ్ల వద్ద వాహనాల పార్కింగ్‌పై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. రోడ్డు సమీపంలో వాహనాలు నిలపకుండా చూడాలని హోటళ్ల యజమానులను పోలీసులు ఇప్పటికే హెచ్చరించారు. జాతీయ రహదారులపై నాలుగు ప్రాంతాల్లో బ్రీత్ ఎనలైజర్ ద్వారా పరీక్షలు చేస్తున్నారు. రోడ్ల పక్కన భారీ వాహనాలను ఆపకుండా చర్యలు తీసుకుంటున్నారు.

మహా అప్పు కావాలి!

(మొదటిపేజీ తరువాయి)

టెండర్లను ఆహ్వానించింది. ప్రభుత్వం గ్యారెంటీ ఉన్నా.. లేకున్నా రుణాలు ఇప్పించాలంటూ ఈ టెండర్లలో హెచ్ఎండీఏ స్పష్టం చేసింది.

నగరాభివృద్ధిలో కీలకపాత్ర

రాష్ట్రంలోని ప్రభుత్వ సంస్థల్లో హెచ్ఎండీఏ ప్రత్యేకం. సొంతంగా ఆదాయ వనరులు సమకూర్చుకుంటూ హైదరాబాద్ మహానగర విస్తరణలో కీలకంగా వ్యవహరిస్తోంది. గతంలో హుడాగా ఉన్నప్పుడుగానీ, ఆ తర్వాత హెచ్ఎండీఏగా అవతరించిన అనంతరంగానీ నగర విస్తరణలో మౌలిక సదుపాయాలను కల్పిస్తోంది. దేశంలో ఏ మెట్రోపాలిటన్ నగరానికి లేనివిధంగా 15 ఏళ్ల క్రితమే హైదరాబాద్‌కు ఔటర్ రింగ్ రోడ్డును హెచ్ఎండీఏ నిర్మాణం చేసింది. ఏటా కనీసం రూ.500 కోట్ల ఆదాయం వచ్చే విధంగా ఓఆర్ఆర్‌ను రూపకల్పన చేసింది. అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు నిర్మాణంలోనూ కీలకంగా వ్యవహరించి.. పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వేను నిర్మించింది. తెలుగుతల్లి, బషీర్‌బాగ్, హైటెక్ సిటీ తదితర పదికి పైగా ఫ్లైఓవర్లను నిర్మించి నగరవాసులకు ట్రాఫిక్ చిక్కులు లేకుండా చేసింది. గత ప్రభుత్వ హయాంలో కోకాపేట, బుద్వేల్, మోకిల్లా, బాచుపల్లి, మేడిపల్లి, బహదూర్‌పల్లి, తొర్రూర్, కుర్మల్‌గూడ, తుర్కయాంజల్.. ఇలా నగరం నలువైపులా రూ.వేల కోట్ల విలువ చేసే స్థలాలను లేఅవుట్లుగా తీర్చిదిద్ది విక్రయించింది. సుమారు రూ.13 వేల కోట్ల ఆదాయాన్ని హెచ్ఎండీఏ సమకూర్చగా.. నాటి ప్రభుత్వం ఆ నిధులను ఇతర పనులకు మళ్లించింది. ఓఆర్ఆర్‌ను రూ.7,380 కోట్లకు ఓ ప్రైవేటు సంస్థకు విక్రయించింది. ఇలా దాదాపు రూ.20వేల కోట్ల వరకు గత ప్రభుత్వానికి హెచ్ఎండీఏ సమకూర్చింది. గత పదేళ్లలో ప్రభుత్వం నుంచి హెచ్ఎండీఏకు వచ్చిన నిధుల కంటే హెచ్ఎండీఏ నుంచి ప్రభుత్వానికి వచ్చిన రాబడియే అధికంగా ఉండటం విశేషం.

ఆదాయం లేక పెండింగులో ప్రాజెక్టులు

హెచ్ఎండీఏ ఆధీనంలో ఉన్న భూములు, స్థలాలను ఆన్‌లైన్ వేలం వేసి విక్రయించారు. అలాగే, ఓఆర్ఆర్‌నూ ప్రైవేటు సంస్థకు కట్టబెట్టారు. దీంతో హెచ్ఎండీఏకు ఆదాయ మార్గాలు కరవయ్యాయి. దీంతో నగర విస్తరణలో మౌలిక సదుపాయాల కల్పన హెచ్ఎండీఏకు పెనుభారంగా మారింది. మీరాలం చెరువుపై కేబుల్ బ్రిడ్జి నిర్మాణానికి సుమారు రూ.3వేల కోట్లు కావాల్సి ఉండగా, సికింద్రాబాద్ నుంచి శామీర్‌పేటకు, సికింద్రాబాద్ నుంచి డైరీఫామ్ రోడ్డు వరకు డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్లను నిర్మించటానికి మరో రూ.6 వేల కోట్లకు పైగా నిధులు అవసరం. అదే విధంగా ఓఆర్ఆర్ నుంచి ఫ్యూచర్ సిటీకి నిర్మించతలపెట్టిన ప్రధానమైన గ్రీన్ ఫీల్డ్ రోడ్డుకు రూ.4 వేల కోట్లు అవసరం. వీటితో పాటు శివారు ప్రాంతాల్లో రోడ్ల విస్తరణ, ఫ్లైఓవర్ల నిర్మాణం పనుల ప్రతిపాదనలూ ఉన్నాయి. దీంతో అప్పులు సేకరించడానికి హెచ్ఎండీఏ సిద్ధమైంది. ప్రస్తుతం హెచ్ఎండీఏ భవన నిర్మాణ, లేఅవుట్ అనుమతుల జారీ ద్వారా ఏటా రూ.1500-1800 కోట్ల మేర ఆదాయం వస్తోంది. హెచ్ఎండీఏ పరిధిలో శరవేగంగా జరుగుతున్న అభివృద్ధితో మును ముందు ఆదాయం పెరిగే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలోనే, తమకు వస్తున్న ఆదాయం, వివిధ ప్రాంతాల్లో గల స్థిరాస్తులను చూపించి రుణాలు సేకరించేందుకు హెచ్ఎండీఏ కసరత్తు చేస్తోంది.

రుణమార్కెట్ ద్వారా సేకరణ!

పలు ప్రాజెక్టులను పట్టాలెక్కించేందుకు 18 నెలల వ్యవధిలోనే రూ.20వేల కోట్ల రుణాలను సేకరించడానికి హెచ్ఎండీఏ చర్యలు చేపట్టింది. రుణ మార్కెట్ ద్వారా నిధులను సేకరించాలని భావిస్తోంది. ఈ నెలాఖరుకు సలహాదారును గానీ, బ్యాంకు మర్చెంట్‌నుగానీ నియమించే అవకాశాలున్నాయి. ఎంపికయ్యే సంస్థ కానీ, సలహాదారుకానీ నాలుగు నెలల్లోనే రూ.5వేల కోట్ల రుణాన్ని సేకరించాలని నిబంధన కూడా విధించారు. ప్రభుత్వం గ్యారంటీ ఇచ్చినా.. ఇవ్వకపోయినా రుణాలను ఇప్పించాలంటూ షరతు కూడా పెట్టారు. సంబంధిత సంస్థకు సేకరించే రుణంపై కమీషన్ చెల్లించే అవకాశం ఉంది. ఇటీవల టెండర్లను ఆహ్వానించడంతో పాటు ఆసక్తి కలిగిన సంస్థలు, వ్యక్తులతో హెచ్ఎండీఏలో ప్రీబిడ్ సమావేశాన్ని నిర్వహించారు. పలువురు తమ సందేహాలను వ్యక్తం చేయగా అధికారులు నివృత్తి చేశారు. బిడ్డర్‌ను క్వాలిటీ అండ్ కాస్ట్ పద్ధతిలో ఎంపిక చేయడానికి హెచ్ఎండీఏ అధికారులు చర్యలు చేపడుతున్నారు.

అంకుర సంస్థలకు కేరాఫ్ తెలంగాణ

- రాయదుర్గంలో ఆరిక్ట్ గ్లోబల్ ఇన్నోవేషన్ సెంటర్ ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు


ఆరిక్ట్ గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): నూతన ఆవిష్కరణలకు ప్రపంచ కేంద్రంగా, అంకుర సంస్థలకు చిరునామాగా తెలంగాణ దూసుకుపోతోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ప్రభుత్వం ప్రారంభించిన స్కిల్స్ యూనివర్సిటీతో నైపుణ్యమున్న మానవ వనరులకు తెలంగాణ కేరాఫ్ అడ్రస్‌గా నిలవబోతుందని, దీంతో రాష్ట్రంలో ప్రతీ ఏటా వేలాది మంది నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు. నెదర్లాండ్స్‌కు చెందిన ఆరిక్ట్ సంస్థ రాయదుర్గంలో ఏర్పాటు చేసిన గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్‌ను మంత్రి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆరిక్ట్ నూతన కార్యాలయంతో 300 మందికి కొత్తగా ఉద్యోగాలు దొరుకుతాయని తెలిపారు. హైదరాబాద్ అంటే టాలెంట్ సిటీ, టెక్ సిటీ, ఇన్నోవేషన్ సిటీ, స్టార్టప్స్‌కు కేరాఫ్ అడ్రస్.. ఒక్క సాఫ్ట్‌వేర్ రంగంలోనే కాదు ఫార్మా, బయోటెక్ తదితర రంగాల్లోనూ అనేక పరిశ్రమలున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో 6వేల అంకుర సంస్థలు ఏర్పాటయ్యాయని, చిన్న, మధ్య తరహా సాఫ్ట్‌వేర్ సంస్థలు 1500 దాకా ఉన్నాయని తెలిపారు. గడచిన రెండు దశాబ్దాల కాలంలో ఐటీ రంగం సాధించిన విప్లవాత్మక వృద్ధి వల్ల రాష్ట్ర జీడీపీ, తలసరి ఆదాయం జాతీయ సరాసరిని మించిపోయిందని శ్రీధర్ బాబు తెలిపారు. ఐటీ వార్షిక ఎగుమతులు 30 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని చెప్పారు. అన్ని రకాల పరిశ్రమల ఏర్పాటుకు కావాల్సిన మౌలిక సదుపాయాలు, మానవ వనరులు ఇక్కడ అందుబాటులో ఉన్నాయని, ఈ ప్రక్రియలో భాగస్వామ్యం కావాలనుకునే కంపెనీలు మాతో కలిసి పనిచేసేందుకు మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నామని చెప్పారు.

ఎస్సీ విద్యార్థుల స్కాలర్‌షిప్‌కు కొత్త మార్గదర్శకాలు

హైదరాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) తెలంగాణలోని ఎస్సీ విద్యార్థుల పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల నమోదు కోసం నూతన మార్గదర్శకాలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్కాలర్‌షిప్‌ల మంజూరు, రిజిస్ట్రేషన్ ప్రక్రియలో కొత్త విధానాన్ని తీసుకొచ్చింది. విద్యార్థులు కొత్త మార్గదర్శకాలను పరిశీలించి రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని ఎస్సీ అభివృద్ధి శాఖ కమిషనర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా విద్యార్థులు ఈ పాస్ వెబ్‌సైట్‌లో ప్రమాణపత్రాన్ని సమర్పించి.. ఎస్ఎస్‌సీ మెమోలో ఉన్న విధంగా తమ పేరు, ఆధార్ కార్డు వివరాలను పేర్కొనాలి. మీ సేవ కేంద్రానికి వెళ్లి బయోమెట్రిక్ గుర్తింపు ప్రక్రియను పూర్తి చేయాలి. ఆ తర్వాత ఈ పాస్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలి.

కేంద్ర పన్నుల్లో వాటాగా రాష్ట్రానికి 3,637 కోట్లు

హైదరాబాద్, జనవరి10(ఆంధ్రజ్యోతి): కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు రావాల్సిన వాటాలను కేంద్ర ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసింది. అన్ని రాష్ట్రాలకు కలిపి కేంద్ర మొత్తం రూ.1,73,030 కోట్లను విడుదల చేయగా ఇందులో తెలంగాణ వాటాగా రూ.3,637 కోట్లు కేటాయించింది. పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు రూ.7,002 కోట్లు ఇచ్చింది. ఈ కేటాయింపుల్లో ఉత్తరప్రదేశ్‌కు అత్యధికంగా రూ.31,039 కోట్లు ఇచ్చింది. మూలధన వ్యయం, అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు కోసం ఈ నిధులను విడుదల చేస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో కేంద్ర పన్నుల వాటా కింద రూ.18,384.19 కోట్లు వస్తాయని రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో అంచనా వేసింది. నవంబరు నాటికి రూ.11,472.79 కోట్లు(62.41%) అందాయి. తాజాగా వచ్చిన నిధులతో కలిపి రాష్ట్రానికి ఇప్పటివరకు రూ.15,109.79 కోట్లు వచ్చినట్లయింది.

ఈ నెలాఖరు వరకు ధాన్యం కొనుగోళ్లు!

హైదరాబాద్, జనవరి10(ఆంధ్రజ్యోతి): జనవరి 31 తేదీ వరకు ధాన్యం సేకరణ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈనెల పదో తేదీ వరకు ధాన్యం కొనుగోళ్లు చేపడతామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తొలుత ప్రకటించారు. అయితే కొనుగోలు కేంద్రాలకు ఇప్పటికీ ధాన్యం వస్తున్న నేపథ్యంలో మరో మూడు వారాలపాటు వరి ధాన్యం సేకరణ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం తాజాగా నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 10 లక్షల మంది రైతుల నుంచి 52.35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. వీటిలో దొడ్డు ధాన్యం 29.40 లక్షల టన్నులు, సన్న ధాన్యం 22.95 లక్షల టన్నులున్నాయి. మొత్తం 10 లక్షల మంది రైతులకు రూ. 11,583 కోట్ల చెల్లింపులు చేసినట్లు రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ వెల్లడించింది. ఈనెలాఖరు వరకు కొనుగోలు కేంద్రాలు తెరిచి ఉంచితే, మరో 3- 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేస్తున్నారు. ఇప్పటివరకు అత్యధికంగా నిజామాబాద్ జిల్లాలో 4,91,407 లక్షల టన్నుల ధాన్యం సేకరించారు.

ఉన్నతాధికారులు చెప్పినట్టు చేశా !

- ఏసీబీ ఎదుట హెచ్ఎండీఏ మాజీ సీఈ బీఎల్ఎన్‌రెడ్డి
- ఫార్ములా-ఈ కేసులో ఆరున్నర గంటల పాటు విచారణ

హైదరాబాద్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ఫార్ములా-ఈ కారు రేసు కేసుకు సంబంధించి హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి శుక్రవారం ఏసీబీ విచారణకు హాజరయ్యారు. సుమారు ఆరున్నర గంటల పాటు సాగిన విచారణలో ఏసీబీ అధికారులు ఆయన్ను వివిధ అంశాలపై ప్రశ్నించారు. హెచ్ఎండీఏ నుంచి విదేశీ కంపెనీ అయిన ఎఫ్ఈఓకు రెండు ఇన్వాయిస్‌లకు గాను రూ.45,71,60,625 ఎందుకు చెల్లించారు? ఆ సమయంలో పన్ను మినహాయింపు ఇవ్వడం వల్ల రూ.8,06,75,404అదనపు భారం పడినప్పటికీ ప్రొసీడింగ్ ఆర్డర్ ఎందుకు ఇచ్చారు? ఎఫ్ఈఓకు బ్రిటన్ పౌండ్ల రూపంలో డబ్బు చెల్లించడానికి మీకు అధికారం ఉందా? ఫెడరేషన్ ఆఫ్ మోటార్ స్పోర్ట్స్ క్లబ్‌కు రూ.1,10,51,014 ఎందుకు చెల్లించారు ? మీ వల్ల హెచ్ఎండీఏ జనరల్ ఖాతాలో రూ.54,88,87,043 దుర్వినియోగం అయ్యాయి కదా? హెచ్ఎండీఏ నిధుల నుంచి రూ.10కోట్లు కన్నా ఎక్కువ చెల్లించాల్సి వస్తే ఆర్థిక శాఖ అనుమతి తీసుకోవాలి కదా.. నిబంధనలు ఎందుకు ఉల్లంఘించారు? సీనియర్ అధికారి అయిన మీకు నిబంధనలు తెలియవా? అంటూ ఏసీబీ అధికారులు బీఎల్ఎన్ రెడ్డిని ప్రశ్నించినట్టు తెలిసింది. అయితే, తాను ప్రొసీడింగ్ ఆర్డర్ ఇవ్వాలంటే తన ఉన్నతాధికారి, హెచ్ఎండీఏ చైర్మన్ అనుమతి కావాలని.. చైర్మన్ అనుమతించినందునే ప్రొసీడింగ్ ఆర్డర్ ఇచ్చానని బీఎల్ఎన్ రెడ్డి బదులు చెప్పినట్టు సమాచారం. నాటి పురపాలకశాఖ మంత్రి కేటీఆర్, పురపాలక శాఖ ప్రత్యేక కార్యదర్శి అర్వింద్ కుమార్ ఆదేశాల ప్రకారమే తాను వ్యవహరించానని, తన తప్పేమీ లేదని, లిఖిత పూర్వక ఆదేశాలు ఉన్నాయని చెప్పినట్టు తెలిసింది. ఆదేశాలను అమలు చేసే అధికారాలే తప్ప తనకు నిర్ణయాధికారం లేదని వివరించినట్టు సమాచారం. నిబంధనల ఉల్లంఘనలపై మీరు అభ్యంతరం వ్యక్తం చేయలేదా ? అని ప్రశ్నించగా.. న్యాయపరమైన సమస్యలు వస్తాయని చెప్పానని బీఎల్ఎన్ రెడ్డి బదులిచ్చారని తెలిసింది. అయినా, మంత్రి నుంచి ఆదేశాలు వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడం తప్ప తన స్థాయిలో వారు ఏం చేయగలరని అన్నారు. అంతా నాటి మంత్రి ఆదేశాల ప్రకారమే జరిగిందని ఆయన పదేపదే చెప్పారని తెలిసింది.

ముగిసిన తొలి దశ విచారణ !

బీఎల్ఎన్ రెడ్డి విచారణతో ఫార్ములా- ఈ కారు రేసులో తొలి దశ విచారణ ముగిసినట్టు అయింది. దీంతో ఫిర్యాదుదారుడు దాన కిషోర్, నాటి పురపాలకశాఖ ప్రత్యేక కార్యదర్శి అర్వింద్ కుమార్, నాటి పురపాలకశాఖ మంత్రి కేటీఆర్, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి విచారణలో చెప్పిన అంశాలను ఏసీబీ అధికారులు విశ్లేషిస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత నిందితులను మరోసారి విచారణకు పిలవాలా ? వద్దా ? అనే అంశంపై ఏసీబీ నిర్ణయం తీసుకోనుంది.

ఆదివాసీలకు సీఎం కోటాలో ఇళ్లు

- ఎమ్మెల్యే కోటాతోపాటు అదనంగా మంజూరు.. ఐటీడీఏ ప్రాంతాల్లో ప్రత్యేక కోటా కింద ఇస్తాం
- సమస్యలుంటే చెప్పండి.. ఆందోళన చేయొద్దు.. ఆదివాసీ సంఘాలతో భేటీలో సీఎం రేవంత్

హైదరాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఆదివాసీలకు ఎమ్మెల్యేల కోటా కింద ఇచ్చే ఇళ్లతో సంబంధం లేకుండా ముఖ్యమంత్రి కోటా కింద ప్రత్యేకంగా ఇళ్లు మంజూరు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. నాన్ ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసీలకు కూడా ఇళ్లు కేటాయిస్తామన్నారు. ఐటీడీఏ ప్రాంతాలకు ప్రత్యేక కోటాలో ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని అధికారులకు సూచించారు. ఆదివాసీ రైతుల వ్యవసాయ బోర్లకు సోలార్ పంపుసెట్లను ఉచితంగా అందిస్తామన్నారు. ఇందిర జలప్రభ ద్వారా ఉచితంగా బోర్లు వేయడంపై దృష్టి పెట్టాలని, దీనిని స్పెషల్ డ్రైవ్‌గా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆదివాసీ సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులతో సచివాలయంలో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. రాజకీయాల పరంగా కూడా ఆదివాసీలకు అన్యాయం జరగకుండా చూస్తున్నామని తెలిపారు. ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని, ఆందోళనలు చేపట్టాల్సిన అవసరం లేదని అన్నారు. ఆదివాసీలపై ఉద్యమాల సమయంలో పెట్టిన కేసులు ఎత్తివేస్తామని, ఈ విషయంలో అవసరమైతే శాసనసభలో చర్చ పెట్టి తీర్మానం చేస్తామని ప్రకటించారు. తాను పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టినప్పుడు మొట్టమొదటి సభను ఇంద్రవెల్లిలో నిర్వహించామని రేవంత్ గుర్తు చేశారు. ఆ సమయంలో చర్చించుకున్న అంశాలన్నింటినీ అధికారంలోకి వచ్చిన వెంటనే పూర్తి చేశామని తెలిపారు.

ఆదివాసీ విద్యార్థులకు ప్రత్యేక స్టడీ సర్కిల్..

ఆదివాసీల విద్య, ఉద్యోగ, ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఆదివాసీ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. దీని భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకున్న ఆదివాసీ విద్యార్థులందరికీ మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. స్కిల్ యూనివర్సిటీలో ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తామని, ఏజెన్సీలోని ఐటీఐలను ఏటీసీలుగా మారుస్తామని అన్నారు. విద్యార్థులకు ప్రాథమిక విద్యను గోండు భాషలో అందించే అంశంపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఉట్నూరు, భద్రాచలంలోని ట్రైబల్ బీఈడీ కళాశాలల్లో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. ఆదివాసీ రైతుల కోసం రాయ్ సెంటర్ల నిర్మాణానికి అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాలు, ఎన్ని భవనాలు అవసరమనే దానిపై నివేదిక సమర్పించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, మాజీ ఎంపీ సోయం బాపురావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ప్రొఫెసర్ గుమ్మడి అనురాధ, ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కలెక్టర్లూ.. మారండి!

(మొదటిపేజీ తరువాయి)

మంచి పేరు తీసుకురావాలి. ప్రభుత్వానికి పూర్తిస్థాయిలో సహకరించాలి" అని సీఎం రేవంత్ అన్నారు. మహిళా ఐఏఎస్‌లతోపాటు ఐపీఎస్ అధికారులు కూడా నెలలో ఒక్కసారైనా బాలికల హాస్టళ్లను సందర్శించాలని, అక్కడే రాత్రి బస చేసి.. విద్యార్థుల అవసరాలను, సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని సూచించారు. వారి సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలు, పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేది కలెక్టర్లేనని, వారి పనితీరే ప్రభుత్వ పనితీరుకు కొలమానం అవుతుందని అన్నారు. ఎప్పటికప్పుడు తమ పనితీరును మెరుగుపరచుకోవాలని సూచించారు. ఇటీవల కులగణన సర్వేను విజయవంతంగా పూర్తి చేశారంటూ అన్ని జిల్లాల కలెక్టర్లను అభినందించారు.


సచివాలయంలో జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్లు; (ఇన్‌సెట్‌లో) సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

26 నుంచి ఆ నాలుగు పథకాలు..

భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు అయినందున.. ఈ నెల 26న జరిగే గణతంత్ర వేడుకలకు అత్యంత ప్రాధాన్యం ఉందని సీఎం రేవంత్ అన్నారు. ఆరోజు రాష్ట్ర ప్రభుత్వం.. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లు వంటి నాలుగు ప్రతిష్ఠాత్మకమైన పథకాలను ప్రారంభించబోతున్నట్లు తెలిపారు. కలెక్టర్లు ఈ నెల 15లోగా ఈ పథకాల అమలుకు కావాల్సిన సన్నాహకాలను పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రుల సారథ్యంలో అన్ని జిల్లాల్లో నోడల్ అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలని, 24వ తేదీలోగా గ్రామ సభలు పూర్తి చేయాలని అన్నారు. ఈ నెల 26 తర్వాత తాను జిల్లాల్లో పర్యటిస్తానన్నారు. ఆకస్మిక తనిఖీలు చేస్తానని, ప్రభుత్వ వ్యవస్థలో ఎక్కడ నిర్లక్ష్యం కనిపించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. క్షేత్ర స్థాయి అధికారులను కూడా అప్రమత్తం చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. పేదల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి తమ ప్రభుత్వానికి రెండు కళ్ల లాంటివని సీఎం పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం పేదల కోసం పని చేస్తుందనే విశ్వాసం కల్పించాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్లపైనే ఉందన్నారు. ఈ నెల 26న ప్రారంభించనున్న నాలుగు పథకాల అమలుకు రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో గ్రామ సభలు, మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో వార్డు సభలను నిర్వహించాలని అన్నారు. ఈ పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం సేకరించిన వివరాలు, తయారు చేసిన జాబితాలను గ్రామ సభల్లోనే వెల్లడించాలన్నారు.

అలాంటి పొరపాటు జరగొద్దు..

గతంలో రైతుబంధు పేరిట భారీ ఎత్తున ప్రజాధనం దుర్వినియోగం అయిందని, గత ప్రభుత్వం వ్యవసాయ యోగ్యం కాని భూములకు పంట పెట్టుబడి సాయం అందించిందని సీఎం రేవంత్ అన్నారు. ఈసారి అలాంటి పొరపాటు జరగకూడదని హెచ్చరించారు. అర్హులైన రైతులందరికీ రైతు భరోసా సొమ్మును చెల్లించాలని, అదే సమయంలో అనర్హులు ఒక్కరు కూడా లబ్ధి పొందకుండా చూడాలని అన్నారు. ప్రతి జిల్లాకు, మండలానికి ఓ నోడల్ అధికారిని నియమించాలని, అధికారుల బృందాలు క్షేత్ర స్థాయికి వెళ్లి అనర్హులను గుర్తించాలని ఆదేశించారు. వ్యవసాయ యోగ్యమైన భూములన్నింటికీ రైతు భరోసా సొమ్మును చెల్లించాలని, వ్యవసాయానికి అక్కరకురాని భూములను గుర్తించి, వాటిని మాత్రమే ఈ పథకం నుంచి మినహాయించాలని అన్నారు. రియల్ ఎస్టేట్ భూములు, లే-అవుట్ భూములు, నాలా కన్వర్షన్ అయిన భూములు, మైనింగ్ భూములు, గోదాములు, ఫంక్షన్ హాళ్లు నిర్మించిన భూములు, వివిధ ప్రాజెక్టులకు, అభివృద్ధి పనులకు ప్రభుత్వం సేకరించిన భూములు ఈ అనర్హత జాబితాలోకి వస్తాయని వివరించారు. గ్రామ పంచాయతీలు, మునిసిపాలిటీల రెవెన్యూ రికార్డులు, డీటీసీపీ లే-అవుట్ రికార్డులు, సంబంధిత విభాగాల రికార్డుల్లో ఉన్న వివరాల ఆధారంగా ఈ జాబితాలను తయారు చేయాలన్నారు. విలేజ్ మ్యాప్‌లతో పాటు అధికారులు క్షేత్ర స్థాయికి వెళ్లి వీటిని ధ్రువీకరించుకుని, వీటిని గ్రామ సభలో ప్రచురించాలని చెప్పారు. రైతులు ఎలాంటి అనుమానాలు, అపోహలకు గురికావొద్దని, పంట వేసినా.. వేయకున్నా.. వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఎకరానికీ రైతు భరోసా అందుతుందని స్పష్టం చేశారు.

20 రోజులు ఉపాధి పనులు చేస్తేనే..

భూమి లేని నిరుపేద, ఉపాధి కూలీ కుటుంబాలను ఆదుకునేందుకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని ప్రారంభించినట్లు సీఎం రేవంత్ చెప్పారు. ఆ కుటుంబానికి ఏడాదికి రూ.12 వేల నగదు సాయం అందిస్తామన్నారు. ఏడాదిలో కనీసం 20 రోజులు ఉపాధి హామీ పనులు చేసిన భూమి లేని కుటుంబాలకు ఈ పథకం వర్తిస్తుందని చెప్పారు. ఇక కొత్త రేషన్ కార్డులను.. గతంలో ఉన్న అర్హత నిబంధనల ప్రకారమే జారీ చేస్తామన్నారు. ఒకే వ్యక్తికి వేర్వేరు ప్రాంతాల్లో రేషన్ కార్డులు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో 'వన్ రేషన్- వన్ స్టేట్' విధానాన్ని తీసుకురాబోతున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల లబ్ధిదారుల జాబితాలను కూడా గ్రామ సభల్లో వెల్లడించాలన్నారు. ఇక ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా గూడు లేని నిరుపేదలకు ఇళ్లను నిర్మించి ఇవ్వాలనేది తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఇప్పటికే ఇందిరమ్మ యాప్ ద్వారా గుర్తించిన 18.32 లక్షల మంది వివరాలను జిల్లాలకు పంపించామన్నారు. అందులో అత్యంత నిరుపేదలుగా గుర్తించిన వారికి మొదటి ప్రాధాన్యమివ్వాలని చెప్పారు. తొలి విడతలో నియోజకవర్గానికి 3500 ఇళ్లను మంజూరు చేశామని, ఇందిరమ్మ ఇళ్లకు అరు?లైన వారి జాబితాలను వెంటనే సిద్ధం చేయాలని సూచించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రుల ఆమోదంతో ఈ అర్హుల జాబితాను గ్రామసభల్లో ప్రచురించాలన్నారు. సదస్సులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధికారులు పాల్గొన్నారు.

చేనేతకు అభయహస్తం!

- నేతన్న పొదుపు, నేతన్న భద్రత, నేతన్న భరోసా పథకాల అమలు
- జీవో జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం అభయహస్తం పథకాన్ని ప్రకటించింది. నేతన్న పొదుపు, నేతన్న భద్రత, నేతన్న భరోసా పేరుతో మూడు రకాల పథకాలను అమలు చేయాలని నిర్ణయించింది. ఈమేరకు మార్గదర్శకాలు జారీ చేయడంతో పాటు నిధులు కేటాయిస్తూ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ శుక్రవారం జీవో 3ను జారీ చేశారు. ఈ ఏడాది తెలంగాణ నేతన్న పొదుపు పథకానికి రూ.15 కోట్లు, చేనేత, పవర్‌లూమ్ కార్మికుల బకాయిలకు రూ.15 కోట్లు, నేతన్న భద్రతలో భాగంగా నేతన్న బీమా పథకానికి రూ.5.25 కోట్లు, నేతన్నకు భరోసా పథకానికి రూ.31 కోట్లు, వేతన ప్రోత్సాహకాలకు రూ.31 కోట్లు మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ నేతన్న పొదుపు పథకం కింద చేనేత, పవర్‌లూమ్, అనుబంధ కార్మికులు వేతనాల నుంచి నెలవారీగా 8శాతం వాటాధనం జమ చేస్తారు. దీని గరిష్ఠ పరిమితి రూ.1,200. ఇందుకు ప్రభుత్వం 16శాతం అందిస్తుంది. తెలంగాణ నేతన్న భద్రత పథకంలో నమోదైన కార్మికుడు ఏ కారణంగానైనా మృతిచెందినా రూ.5 లక్షలు అతని నామినీకి అందుతుంది. ఈ పథకంలో 65 ఏళ్ల గరిష్ఠ వయో పరిమితిని ఎత్తివేశారు. 59 ఏళ్లు దాటిన వారికి ఇది వర్తిస్తుంది. ఈ పథకం అమలుకు ఏడాదికి బడ్జెట్ అంచనా వ్యయం రూ.9కోట్లు. తెలంగాణ నేతన్న భరోసా పథకం.. జియో ట్యాగ్ అయిన మగ్గాల నుంచి నిర్దిష్ట ఉత్పత్తి ప్రమాణాల ఆధారంగా చేనేత కార్మికులకు ఏడాదికి గరిష్ఠంగా రూ.18 వేలు, అనుబంధ కార్మికులకు రూ.6 వేల వేతన సహాయం అందిస్తారు. ఈ పథకం అమలుకు వార్షిక బడ్జెట్ అంచనా రూ.44 కోట్లు. ఇక తెలంగాణకు ప్రత్యేక చేనేత మార్క్ లేబుల్ రూపొందించారు. ఈ లేబుల్ ఉన్న వస్త్రాలకు ప్రోత్సాహం అందించనున్నారు. తెలంగాణ హ్యాండ్లూమ్ మార్క్ లేబుళ్లకు వార్షిక బడ్జెట్ రూ.4 కోట్లు కేటాయించారు.

రూ.168కోట్లతో అమలు: తుమ్మల

రాష్ట్రంలోని చేనేత, మరమగ్గాల కార్మికుల సంక్షేమం, అభివృద్ధికి రూ.168 కోట్లతో చేనేత అభయహస్తం పథకాన్ని అమలు చేస్తున్నట్లు చేనేత-జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఈ పథకం అమలుకు ఆమోదముద్ర వేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. రూ.115 కోట్లతో తెలంగాణ నేతన్న పొదుపు, రూ.9 కోట్లతో తెలంగాణ నేతన్న భద్రత, రూ.44 కోట్లతో తెలంగాణ నేతన్న భరోసాను అమలు చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే చేనేత రంగానికి రూ.874 కోట్లు విడుదల చేశామని, ఇందులో గత ప్రభుత్వం బకాయిపెట్టిన రూ.465 కోట్లు ఉన్నాయన్నారు.

తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి

పారిశ్రామికవేత్తలకు సీఎం రేవంత్ పిలుపు.. దేశంలో గొప్ప నగరాన్ని నిర్మించాలన్నదే మా లక్ష్యం

- న్యూయార్క్ లండన్, దుబాయ్‌తో పోటీ పడతాం
- తెలంగాణ రైజింగ్ లక్ష్యంతో ఫోర్త్ సిటీ నిర్మాణం
- సీఐఐ జాతీయ కౌన్సిల్ భేటీలో సీఎం రేవంత్



సీఐఐ జాతీయ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్

హైదరాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి తమకు ఒక కల ఉందని, అదే 'తెలంగాణ రైజింగ్' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఫ్యూచర్ సిటీ పేరుతో దేశంలో ఒక గొప్ప నగరాన్ని నిర్మించాలన్నది తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. న్యూయార్క్, లండన్, సియోల్, టోక్యో, దుబాయ్ లాంటి ప్రపంచ నగరాలతో పోటీ పడాలనే ఆంకాక్షలకు అనుగుణంగా పారిశ్రామికవేత్తలు పెట్టుబడులతో ముందుకు రావాలని కోరారు. శుక్రవారం హైదరాబాద్ గ్రీన్ బిజినెస్ సెంటర్‌లో నిర్వహించిన భారత పారిశ్రామిక సమాఖ్య (సీఐఐ) జాతీయ కౌన్సిల్ సమావేశాన్ని సీఎం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పారిశ్రామిక అభివృద్ధిలో రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలను వివరించారు. రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందడానికి, స్వేచ్ఛా వాణిజ్యం, మార్కెట్లు పని చేయడానికి పారిశ్రామిక రంగం సహకరించాలని కోరారు. ప్రపంచంలోనే అత్యుత్తమ సులభతర వాణిజ్య విధానాలను అమలు చేయడానికి తెలంగాణ రాష్ట్రం సిద్ధంగా ఉందని తెలిపారు. తెలంగాణ రైజింగ్ లక్ష్యంతో సేవల రంగం కేంద్రీకృతంగా ఫోర్త్ సిటీ నిర్మాణం చేపట్టాలనేది తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. హైదరాబాద్‌లో సంపూర్ణ నెట్ జీరో లక్ష్యాలతో పని చేస్తున్నామని, నగరాన్ని కాలుష్య రహితంగా మార్చడంలో భాగంగా 3200 ఆర్టీసీ బస్సుల స్థానంలో విద్యుత్తు బస్సులను సమకూర్చబోతున్నామని వివరించారు. వరదలు లేని నగరంగా దేశంలోనే పర్యావరణ హితంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. అందులో భాగంగా 55 కిలోమీటర్ల పొడవైన మూసీ పునరుజ్జీవ పనులను ప్రారంభించామన్నారు. 2050 నాటికి తాగునీటి అవసరాలకు అనుగుణంగా కార్యాచరణ చేపట్టామని తెలిపారు. రీజినల్ రింగ్ రోడ్డు, ఔటర్ రింగ్ రోడ్డుకు మధ్యలో ఫార్మా లైఫ్‌సైన్స్, ఏరోస్పేస్, డిఫెన్స్, ఈవీ, సోలార్ పవర్ వంటి పరిశ్రమలను ఏర్పాటు చేయబోతున్నామని వివరించారు.

చైనా తరహా క్లస్టర్ వ్యవస్థ ఏర్పాటు

చైనా తరహాలో రకరకాల క్లస్టర్లను సృష్టించాలని తమ ప్రభుత్వం భావిస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఒక లైట్ సిటీ, మార్బుల్ సిటీ, గ్రానైట్ సిటీ, ఫర్నిచర్ సిటీ.. ఇలా ప్రత్యేక తరహాలో రీజినల్ రింగ్ రోడ్డు చుట్టూ మార్కెటింగ్ కార్యకలాపాలను విస్తరిస్తామన్నారు. ఇది పూర్తయితే తెలంగాణ ప్రాంతంలో 70 శాతం పట్టణీకరణ జరుగుతుందన్నారు. గ్రామీణ తెలంగాణ సమగ్రాభివృద్ధి లక్ష్యంగా వ్యవసాయం, సేంద్రియ సాగు, రైతుల కోసం గోదాములు, కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేయడంపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని చెప్పారు. యువతకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు నైపుణ్యావకాశాలపై దృష్టి పెట్టామన్నారు. చైనా ప్లస్ వన్ వ్యూహంలో హైదరాబాద్‌ను ప్రపంచంలో ప్రధాన పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సీఐఐ జాతీయ కౌన్సిల్ సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహించడం శుభపరిణామమని, అందరం కలిసి అద్భుతాలు సాధించవచ్చునని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీఐఐ జాతీయ అధ్యక్షుడు సంజీవ్ పురి తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఆర్ఆర్‌కు రూ.2వేల కోట్లు!

(మొదటిపేజీ తరువాయి)

నిర్మాణానికి సంబంధించి గత ఏడాది డిసెంబరు 27న కేంద్రం టెండర్లను ఆహ్వానించగా.. ఈ ఏడాది ఫిబ్రవరి 14వరకు గడువు ఉంది. ఫిబ్రవరి 17న టెండర్లను ఓపెన్ చేయనున్నారు. ఉత్తర భాగం రోడ్డు సంగారెడ్డిలో మొదలై నర్సాపూర్, తూప్రాన్, గజ్వేల్, యాదాద్రి, ప్రజ్ఞాపూర్, భువనగిరి మీదుగా చౌటుప్పల్ వద్ద ముగియనుంది. మొత్తం 161 కిలోమీటర్ల మేర.. 5 ప్యాకేజీల్లో పనులు చేపట్టనున్నారు. భూ పరిహారం మినహా రూ.7,104 కోట్లతో రోడ్డు పనులు చేపట్టనున్నారు. అయితే, టెండర్ల ప్రక్రియ పూర్తయ్యేలోపు రహదారికి అవసరమైన భూ సేకరణ పరిహారం విలువ కూడా తేలాల్సి ఉంది. దాని ప్రకారం కేంద్ర, రాష్ట్ర వాటాలు ఎంతనేది తేలనుంది. ఈ లోపు రహదారి పనులను ప్రారంభించేందుకు రాష్ట్ర వాటాగా చెల్లించాల్సిన దానిలో కొంతమొత్తాన్ని ఎన్‌హెచ్ఏఐకు చెల్లించాలని కేంద్రం ఎప్పటినుంచో చెబుతోంది. గత ప్రభుత్వ హయాంలోనూ ఈ విషయం దగ్గరే సమస్య తలెత్తగా.. పరిష్కారం కాలేదు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర వాటాలో కొంతమొత్తాన్ని ఎన్‌హెచ్ఏఐ వద్ద డిపాజిట్ చేసింది. ఉత్తర భాగం నిర్మాణానికి మొత్తం 1,895 హెక్టార్ల భూమి అవసరం పడుతుండగా... సేకరణ వ్యవహారం దాదాపుగా కొలిక్కి వచ్చింది. ఇప్పటికే కొన్ని చోట్ల భూ సేకరణ వివరాల అవార్డులను సైతం ప్రకటించారు. వివిధ ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న భూ సేకరణ అంశమూ పరిష్కారమైనట్టు తెలుస్తోంది. వాటికీ త్వరలోనే అవార్డులను ప్రకటించనున్నారు. అయితే, సేకరిస్తున్న భూములకు చెల్లించే పరిహారం చాలా తక్కువగా ఉందని భూయజమానులు వాపోతున్నారు. ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం... గరిష్ఠ పరిహారాన్ని అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించింది. ప్రస్తుతం ఈ అంశంపై కసరత్తు జరుగుతోంది. ఇది పూర్తయితే.. వెంటనే భూయజమానులకు చెల్లింపుల ప్రక్రియ ప్రారంభిస్తారు. ఉత్తరభాగం నిర్మాణానికి కేంద్ర అటవీ అనుమతులు వచ్చినప్పటికీ.. పర్యావరణ అనుమతులు రాలేదని సమాచారం. ఈ అంశాలన్నింటినీ కొలిక్కి తెచ్చి, ఏప్రిల్-మే నెల్లో ఉత్తరభాగం రహదారి పనులను ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తోంది.

గత సర్కారు తీరు వల్లే జాప్యం

రీజినల్ రింగ్ రోడ్డు ప్రాజెక్టు విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం పలు మార్లు కేంద్రంతో విభేదించింది. ఉత్తరభాగం భూ సేకరణ పూర్తిచేసుకుని 3డీ గెజిట్ ప్రకటనకు సిద్ధమైన సమయంలో పరిహారం వాటా చెల్లించకుండా జాప్యం చేసింది. 3డీ గెజిట్‌ను జారీ చేస్తేనే తమ వాటా చెల్లిస్తామని కేంద్రంతో వాదించింది. అలా చేస్తే.. న్యాయ పరమైన సమస్యలు ఎదురవుతాయంటూ కేంద్రం తోసిపుచ్చింది. పరిహారం వాటా చెల్లింపుల కోసం 2022-23, 2023-24 బడ్జెట్లలో రూ.500 కోట్ల చొప్పున కేటాయించినా...నిధులు విడుదల చేయలేదు. భూపరిహారంలో రాష్ట్ర వాటాగా రూ.2,585కోట్లు, యుటిలిటీ షిఫ్టింగ్‌కు రూ.363.43కోట్లు చెల్లించాలని ప్రాథమికంగా అంచనా వేశారు. ఇక, గత ఏడాది డిసెంబరులో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక.. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం పనులపై దృష్టి పెట్టింది. రహదారి నిర్మాణం విషయంలో ఆటంకాలను తొలగించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి స్వయంగా ఢిల్లీ వెళ్లారు. ఆ సందర్భంలోనే యుటిలిటీ చార్జీలను భరిస్తామంటూ కేంద్రం హామీ ఇచ్చింది. మొత్తంగా భూపరిహారం వాటాలో సింహభాగాన్ని ఎన్‌హెచ్ఏఐకు అందించడం ద్వారా ఆర్ఆర్ఆర్ నిర్మాణంలో రాష్ట్ర ప్రభుత్వం.. మరో అడుగు ముందుకేసింది.

'ఫార్ములా ఈ'తో హైదరాబాద్ ఇమేజ్ పెరిగింది

- హైడ్రా కారణంగా ప్రజలకు నష్టం కలుగుతోంది
- ఆ డీసీపీ తీరుతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోంది
- ఆయన ఒళ్లు దగ్గర పెట్టుకుని పనిచేస్తే సంతోషం
- ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): "ఫార్ములా ఈ రేస్'తో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెరిగిందనడంలో ఏమాత్రం అనుమానం లేదు. ఈ రేస్ నిర్వహణతో అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించగలిగాం. ఇందులో అవినీతి ఉందా? లేదా? అనేది ఇప్పుడే చెప్పలేం. అవినీతి లేదని కేటీఆర్ చెబుతున్నారు కదా..?" అని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ తరఫున గెలిచి అనంతరం కాంగ్రెస్‌లో చేరిన ఆయన.. ఓ ఇంటర్వ్యూలో మాట్లాడడం కలకలం సృష్టిస్తోంది. హైడ్రా విషయంలో గతంలో తాను అన్న మాటలకు కట్టుబడి ఉంటానని కూడా దానం స్పష్టం చేశారు. ఓటు బ్యాంక్ అయిన ప్రజలను కాపాడుకోవాలని, హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ ఒక్క సీటు కూడా గెలవని సంగతిని గుర్తు చేశారు. "మన మీద నమ్మకం లేదు. ఇప్పుడైనా నమ్మకాన్ని పెంపొందించేందుకు ప్రయత్నించాలి. అదీ చేయలేకపోతున్నాం. ఇది ప్రభుత్వానికి ప్రమాదం కాదా?" అని వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లోని ఒక డీసీపీ స్థాయి అధికారిని ఉద్దేశించి మాట్లాడుతూ.. ఆయన ఒళ్లు దగ్గర పెట్టుకుని పనిచేస్తే సంతోషం అని, ఎవరి మీదైనా కేసులు పెడతానంటూ వెళ్లడం వల్ల ప్రభుత్వం, ముఖ్యమంత్రికి చెడ్డ పేరు వస్తుందని దానం నాగేందర్ అన్నారు. "ఇలాంటి అధికారులు వస్తుంటారు.. పోతుంటారు. నేనెంతోమందిని చూశా (తలపై జుట్టును చూపుతూ)" అని పేర్కొన్నారు. కాగా, ఫార్ములా ఈ రేస్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ విచారణ జరుగుతుండగా, ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా దానం చేసిన వ్యాఖ్యలు సంచలనం సృష్టిస్తున్నాయి. వీటిపై నిఘా వర్గాలు ప్రభుత్వానికి నివేదిక అందించాయని తెలిసింది.

టికెట్ రేట్ల పెంపు ఎవరి కోసం..!

- మీ మాటలను చూసి ఊసరవెల్లి సిగ్గుపడుతోంది:హరీశ్



హైదరాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఇకపై సినిమాలకు ప్రత్యేక ప్రివిలేజ్ ఇచ్చేది లేదంటూ అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి, ఇప్పుడు ఎవరి కోసం టికెట్ రేట్లను పెంచారని మాజీమంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. రెండు వారాలు కూడా కాక ముందే సీఎం మాట మార్చారని, ఆయన్ను చూసి ఊసరవెల్లి కూడా సిగ్గుపడుతోందని ఎద్దేవా చేశారు. మాటతప్పం, మడమ తిప్పమంటూ బీరాలుపలికి ఇప్పుడు టికెట్‌రేట్ల పెంపునకు ఎలా అనుమతి ఇచ్చారు? ఎవరికి లబ్ధి చేకూర్చేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారో చెప్పాలన్నారు. సీఎం అసెంబ్లీలో ప్రకటించినదానికే విలువ లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. అసెంబ్లీని కూడా తప్పుదోవ పట్టిస్తూ టికెట్ రేట్లు, అదనపు షోలకు అనుమతివ్వడం సభను అవమానించడం కదా అని నిలదీశారు. సీఎంతో పాటు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చెప్పిన మాటలు కూడా స్వల్ప వ్యవధిలోనే నీటి మూటలయ్యాయని దుయ్యబట్టారు. అసెంబ్లీని తప్పుదోవ పట్టించినందుకు ముఖ్యమంత్రి రేవంత్, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిపై సభా హక్కుల ఉల్లంఘన కింద ప్రివిలేజ్ మోషన్ పెడతామని పేర్కొన్నారు.

ఫన్ బకెట్ భార్గవ్‌కు 20 ఏళ్ల జైలు

- బాలికపై అత్యాచారం కేసులో పోక్సో కోర్టు తీర్పు

పెందుర్తి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): వెబ్ సిరీస్‌లో అవకాశం కల్పిస్తానంటూ బాలికను మభ్యపెట్టి అత్యాచారానికి పాల్పడిన యూట్యూబర్, ఫన్ బకెట్ భార్గవ్‌కు 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.4 లక్షల జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు శుక్రవారం తీర్పు చెప్పింది. విజయనగరం జిల్లా కొత్తవలసకు చెందిన భార్గవ్ టిక్ టాక్ వీడియోలతో గుర్తింపు పొందాడు. ఈ క్రమంలో విశాఖ జిల్లా పెందుర్తి మండలానికి చెందిన 14 ఏళ్ల బాలిక అతనికి పరిచయమైంది. వెబ్ సిరీస్‌లో అవకాశాలు కల్పిస్తానంటూ ఆమెకు ఆశ చూపించి శారీరకంగా లోబరుచుకున్నాడు. బాలికలో వచ్చిన శారీరక మార్పులను తల్లి గుర్తించి వైద్యులకు చూపించగా నాలుగు నెలల గర్భవతి అని తేలింది. దీంతో బాలిక తల్లి 2021 ఏప్రిల్ 16న పెందుర్తి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అప్పటి సీఐ అశోక్‌కుమార్ కేసు నమోదుచేసి దిశ పోలీసు స్టేషన్‌కు బదిలీ చేశారు. విశాఖ దిశ స్టేషన్ ఏసీపీ కాజల్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు జరిగింది. భార్గవ్ బాలికను మోసం చేసి గర్భవతిని చేశాడని నిర్ధారణ కావడంతో ముద్దాయికి శిక్షపడింది.

అనిరుధ్ రెడ్డి.. ప్రజాకోర్టులో శిక్ష తప్పదు

- జడ్చర్ల ఎమ్మెల్యే స్వగ్రామంలో మావోయిస్టుల లేఖ ?

జడ్చర్ల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రజాకోర్టులో శిక్ష తప్పదు తస్మాత్ జాగ్రత్త అంటూ.. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డిని హెచ్చరిస్తూ ఆయన స్వగ్రామం రాజాపూర్ మండలం రంగారెడ్డిగూడలో మావోయిస్టుల పేరుతో కనిపించిన ఓ లేఖ శుక్రవారం కలకలం రేపింది. భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) తెలంగాణ రాష్ట్ర కమిటీ పేరుతో లచ్చన్నదళం కార్యదర్శి వెంకటయ్య హెచ్చరిస్తున్నట్లుగా ఉన్న లేఖ గ్రామంలోని ఓ ఇంటి గోడకు అతికించి ఉంది. బూటకపు హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ప్రవర్తన బాగాలేదని ఆ లేఖలో పేర్కొన్నారు. ఎమ్మెల్యే తన సొంత గ్రామంలో పట్టాదారులను బెదిరించి పట్టా భూములను రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, లక్ష్మీనారాయణ గుడిలో విగ్రహాలు దొంగిలించి, ఎక్కడ అమ్ముకున్నారో తెలుసునని రాసి ఉంది. ఎమ్మెల్యేకు బినామీగా ఉన్న కోమటి రవికుమార్ కంపెనీలను బెదిరించి వసూళ్లకు పాల్పడుతున్నారని, ఎమ్మెల్యే అనుచరులు ఈడ్గి రాములుగౌడ్, లక్ష్మీనారాయణగౌడ్, ఉప్పరియాదయ్య, గొల్ల లక్ష్మీనారాయణ, కటిపాగ సాయి, దుష్యంత్‌రెడ్డిని హెచ్చరిస్తున్నామంటూ లేఖలో పేర్కొన్నారు. అయితే, సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో గిట్టనివారు ఎవరో ఈ లేఖతో తనకు నష్టం కలిగించే ప్రయత్నం చేశారని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఆరోపించారు.

కొత్త చెరువును దత్తత తీసుకున్న జీఈఎఫ్ఐ

హైదరాబాద్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ఫ్రీడమ్ హెల్తీ వంట నూనెల తయారీదారు జెమినీ ఎడిబుల్, ఫ్యాట్స్ ఇండియా లిమిటెడ్(జీఈఎఫ్ ఇండియా), హెచ్ఎండీఏ- తెలంగాణ సోషల్ ఇంపాక్ట్ గ్రూప్ టీ-ఎస్ఐజీ, సంబంధిత ప్రభుత్వ సంస్థలతో కలిసి కోకాపేట ప్రాంతంలోని కొత్త చెరువును దత్తత తీసుకుంది. కొత్త చెరువును పునరుజ్జీవింపచేయటానికి కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్)లో భాగంగా ధ్రువంష్ స్వచ్ఛంద సంస్థతో కలిసి సహజ వనరుల పరిరక్షణ కార్యక్రమం చేపట్టినట్లు జీఈఎఫ్ ఇండియా వెల్లడించింది. ఇందుకుగాను రూ. 1.20 కోట్ల చెక్కును అందజేసింది. కొత్త చెరువును పునరుద్ధరించే బాధ్యతను తీసుకున్న జీఈఎఫ్ ఇండియా కంపెనీ యాజమాన్యాన్ని హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ ఈ సందర్భంగా ప్రశంసించారు.

నీటిపారుదలశాఖలో పదోన్నతులకు లైన్‌క్లియర్

నీటిపారుదలశాఖలో పదోన్నతులకు లైన్ క్లియర్ అయింది. తెలంగాణలో జోన్-5, జోన్-6లలో పనిచేస్తున్నవారు ఒకే రోజు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా పదోన్నతులు పొందితే, వీరిలో ఎవరు సీనియర్ అయితే వారికే ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా పదోన్నతి కల్పించాలనేది మెమో నెం.11656 సారాంశం. 2022లో దీన్ని జారీ చేయగా ఇది అమలు కాలేదు. ఆ తర్వాత 2024 జూన్‌లో ఇదే నెంబరుతో మెమో జారీ చేశారు. దీన్ని 2024 జూన్ తర్వాత ఇచ్చే పదోన్నతుల ప్రక్రియలో అమలు చేయాలని జారీ చేశారు. దీన్ని సవాలు చేస్తూ కొందరు ఇంజనీర్లు హైకోర్టును ఆశ్రయించగా మూడునెలల పాటు దీనిపై వాదనలు జరిగాయి. అంతిమంగా ఈ మెమోలు చెల్లుబాటు అవుతాయని శుక్రవారం హైకోర్టు తీర్పు వెలువరించింది. దాంతో పదోన్నతుల ప్రక్రియ అమలుకు ఉన్న అడ్డంకులన్నీ తొలగిపోవడంతో వారం రోజుల్లోపు పదోన్నతులు ఇచ్చే అవకాశాలు ఉన్నాయని సమాచారం.

నేలమ్మను సింగారించెను ముగ్గమ్మ!

కన్నుల పండుగగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' రాష్ట్రస్థాయి ముగ్గుల పోటీ ఫైనల్స్

హైదరాబాద్ జిల్లాకు చెందిన మాధురి నేమకు ప్రథమ బహుమతి

ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం జిల్లాల మహిళలకు ద్వితీయ స్థానం

విజేతలకు బహుమతులు అందజేసిన నటీనటులు వైష్ణవీ చైతన్య, వడ్లమాని శ్రీనివాస్



ప్రథమ బహుమతి విజేతకు చెక్కును అందజేస్తున్న వైష్ణవీ చైతన్య, వడ్లమాని సత్యసాయి శ్రీనివాస్ తదితరులు

హైదరాబాద్ సిటీ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): చుక్కల వరుస.. నేలంతా పరుచుకొని చక్కని ముగ్గయింది! చూపు.. మనసూ తనవైపు లాక్కొని కదలనీయనంటూ కాళ్లకూ బంధాలేసింది! మేమూ తీరొక్క రంగులనద్దుకొని నేలను సింగారించాం అంటూ ఇంకొన్ని ముగ్గులు సైగ చేశాయి! గొబ్బెమ్మలు, చెరుకు ముక్కలను అద్దుకొని సంక్రాంతి శోభను ముందే తెచ్చాయి! ఇదంతా సనత్‌నగర్ జీహెచ్ఎంసీ గ్రౌండ్‌లో నిర్వహించిన ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీల తాలూకు రమణీయతే! 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డీగిసెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) తెలంగాణ రాష్ట్రస్థాయి ఫైనల్స్ శుక్రవారం జరిగాయి. ముఖ్య అతిథులుగా సినీనటి వైష్ణవీ చైతన్య, సినీనటుడు వడ్లమాని సత్యసాయి శ్రీనివాస్ హాజరయ్యారు. ఫైనల్స్‌లో రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లాల నుంచి ఒకరు చొప్పున 10 మంది మహిళలు పాల్గొన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రథమ విజేతగా హైదరాబాద్‌కు చెందిన మాధురి నేమ, ద్వితీయ విజేతగా ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ఎస్.హేమలత, కరీంనగర్ జిల్లాకు చెందిన కె.లహరి, ఖమ్మం జిల్లాకు చెందిన ఆర్.లక్ష్మీ ప్రవంతి నిలిచారు. ప్రథమ విజేతకు రూ.30 వేల చెక్కు.. ద్వితీయ విజేతలకు రూ.10వేల చొప్పున చెక్కులు అందజేశారు. మిగిలిన ఆరుగురికి రూ.3 వేల చొప్పున చెక్కులు అందజేశారు. విజేతలకు బహుమతులను వైష్ణవీ చైతన్య, వడ్లమాని సత్యసాయి శ్రీనివాస్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మహిళామణులు పరిచిన ముత్యాల ముగ్గుల్లో సంక్రాంతి సందడి, సంస్కృతి, సంప్రదాయాలు కనిపించాయని వైష్ణవి అన్నారు. నిజమైన సంక్రాంతి అంటే తెలియచేప్పే ప్రయత్నం 'ఆంధ్రజ్యోతి- ఏబీఎన్' చేస్తోందని వడ్లమాని శ్రీనివాస్ అన్నారు. ముగ్గులు వేయడమే మరిచిపోతున్న ఈ రోజుల్లో తెలుగు సంస్కృతి ప్రతిబింబించేలా ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ముగ్గుల పోటీకి న్యాయ నిర్ణేతలుగా బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ పి.రజని, యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ పీజీ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.పి.శ్రీలక్ష్మి వ్యవహరించారు. కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ వక్కలంక రమణ, ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్ ఇన్‌చార్జి, అసిస్టెంట్ ఎడిటర్ కృష్ణ ప్రసాద్, ఆంధ్రజ్యోతి అడ్వర్టైజ్‌మెంట్ డీజీఎం ఆర్.ఆర్ నాయుడు, సంతూర్ ఏపీ, తెలంగాణ రీజనల్ సేల్స్ మేనేజర్ నాగరాజు, సంతూర్ హైదరాబాద్ ఏరియా మేనేజర్ సంజీవ్ మోదీ తదితరులు పాల్గొన్నారు.



ప్రథమ బహుమతి గెలుచుకున్న ముగ్గు ఇదే..

ద్వితీయ బహుమతి గ్రహీతలు


లహరి(కరీంనగర్)


లక్ష్మీప్రవంతి (ఖమ్మం)


హేమలత (ఆదిలాబాద్)

బెనిఫిట్ షోలు రద్దంటూ.. స్పెషల్ షోకు అనుమతులా?

- 'గేమ్ చేంజర్' అదనపు షోలు, టికెట్ల రేట్ల పెంపునకు ఎలా అనుమతిస్తారు?
- పునఃసమీక్షించాలంటూ హోంశాఖ ముఖ్య కార్యదర్శికి హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సినిమా బెనిఫిట్ షో, స్పెషల్ షోలకు అనుమతులు, టికెట్ల రేట్ల పెంపు అంశంలో రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టులో ఇబ్బందికర పరిస్థితి ఎదురైంది. గేమ్ చేంజర్ సినిమాకు తెల్లవారుజామున 4 గంటలకు స్పెషల్ షోతోపాటు అదనపు షోలు వేయడానికి, టికెట్ల రేట్లు పెంచుకోవడానికి అనుమతినిస్తూ హోంశాఖ ముఖ్య కార్యదర్శి ఇచ్చిన మెమోను పునఃసమీక్షించి మళ్లీ నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. పుష్ప-2 సినిమా తొక్కిసలాట నేపథ్యంలో బెనిఫిట్ షోలకు అనుమతివ్వబోమని చెప్పి స్పెషల్ షో పేరిట అనుమతివ్వడాన్ని తప్పుబట్టింది. అలాగే ఏ నియమ నిబంధనల ఆధారంగా టికెట్ రేట్లు పెంచారని నిలదీసింది. తాము ఇచ్చే ఆదేశాలతో ప్రభుత్వం కళ్లు తెరవాలని వ్యాఖ్యానించింది. అసలు రాత్రి 12 గంటల తర్వాత సినిమాలను, పబ్బులను నిషేధించాలని.. 16 ఏళ్ల లోపు పిల్లలు సినిమాలకు అనుమతించకుండా రూల్స్ తేవాలని పేర్కొంది. బెనిఫిట్ షోలకు అనుమతి ఇవ్వమని పేర్కొంటూనే గేమ్ చేంజర్ సినిమాకు అదనపు షోల ప్రదర్శనకు, టికెట్ల రేట్ల పెంపునకు అనుమతినిస్తూ హోంశాఖముఖ్య కార్యదర్శి మెమో జారీచేయడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో వేర్వేరు పిటిషన్‌లు దాఖలయ్యాయి. వీటిపై జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. సినిమాటోగ్రఫీ చట్టం, జీవో 120 రూల్స్‌కు విరుద్ధంగా తెల్లవారుజామున 4 గంటల షోకు అనుమతించడం చెల్లదని పిటిషనర్ల తరఫున న్యాయవాదులు మామిండ్ల మహేశ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు కోర్టు దృష్టికి తెచ్చారు. లైసెన్సింగ్ అథారిటీ కేవలం జిల్లా కలెక్టర్‌లకు, పోలీసు కమిషనర్‌లకు మాత్రమే ఉంటుందని.. అందుకు విరుద్ధంగా అధికార పరిధి కాకపోయినా హోంశాఖ ముఖ్యకార్యదర్శి మెమో జారీ చేశారని.. సదరు మెమోను కొట్టేయాలని విజ్ఞప్తి చేశారు. పుష్ప-2 సినిమా తొక్కిసలాట తర్వాత స్వయంగా సీఎం అసెంబ్లీ వేదికగా బెనిఫిట్ షోలకు అనుమతివ్వబోమన్నారని చెప్పారు. అందుకు విరుద్ధంగా స్పెషల్ షో పేరిట తెల్లవారుజామున 4 గంటలకు అనుమతిచ్చారన్నారు. అసెంబ్లీ వేదికగా శాసన వ్యవస్థ జారీ చేసిన ఆదేశాలు కార్యనిర్వాహక వ్యవస్థకు తెలియకపోవడమేంటన్నారు. రెండు వ్యవస్థల మధ్య ఉన్న ఈ దూరాన్ని హైకోర్టు సవరించాలని కోరారు.

మళ్లీ ఇలాంటి నిర్ణయమా..?

వాదనలు నమోదు చేసుకున్న అనంతరం కోర్టు స్పందిస్తూ.. 'హోంశాఖ ముఖ్య కార్యదర్శి నిర్ణయం తీసుకునే ముందు ప్రజాప్రయోజనం, భద్రత, ప్రజారోగ్యం వంటి అంశాలను దృష్టిలో పెట్టుకోవాల్సింది. తెల్లవారుజామున 4 గంటలకు సినిమా ప్రదర్శన అవసరం ఏముంది? బెనిఫిట్ షోలకు అనుమతి లేదంటూనే మళ్లీ స్పెషల్ షోలకు అనుమతివ్వడం ద్వారా బెనిఫిట్ షో వద్దన్న నిర్ణయంపై వెనక్కి మళ్లారు. పుష్ప-2 తొక్కిసలాట తర్వాత ఇలాంటి నిర్ణయం ఎలా తీసుకున్నారు. అర్ధరాత్రి తల్లిదండ్రులతో పాటు సినిమాలకు వెళ్లే పిల్లల పరిస్థితి ఏంటి? భవిష్యత్తులో నిర్మాతలు పెట్టిన ఖర్చంతా రికవరీ చేయడానికి 24 గంటలు నిర్విరామంగా సినిమా ప్రదర్శించాలని అడుగుతారు.. అలా అనుమతిస్తారా?' అని ప్రభుత్వాన్ని నిలదీసింది. పౌరుల జీవించే హక్కును కాపాడటానికి ఎంతదూరం వరకైనా ఆదేశాలు జారీ చేస్తామని వ్యాఖ్యానించింది.. కేసును ఈనెల 24వ తేదీకి వాయిదా వేసింది.

అనారోగ్యం.. వారసత్వం!

కుటుంబంలో వ్యాధుల పరంపర ఉంటే.. పిల్లలకూ సంక్రమిస్తాయి.. గుర్తించి ముందు జాగ్రత్తలు తీసుకోవాలి

- పిల్లల్లో ఫ్యాటీలివర్ సమస్య పెరుగుతోంది
- తీవ్రమైన జబ్బులున్న వాళ్లు పిల్లల్ని కనకపోవటం మంచిది
- మద్యం క్యాన్సర్ కారకం
- ఆరోగ్య పరిరక్షణ కుటుంబం సమష్టిగా చేయాల్సిన పని
- మీ శరీరానికి మీరే బాస్‌లు.. డాక్టర్లకు ఔట్‌సోర్సింగ్‌కు ఇవ్వొద్దు
- ప్రముఖ కాలేయ నిపుణులు ప్రొఫెసర్ శివకుమార్ సరీన్
- "ఓన్ యువర్ బాడీ" పుస్తకావిష్కరణలో ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వర్ రెడ్డితో సంభాషణ


"ఓన్ యువర్ బాడీ' పుస్తకావిష్కరణలో ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వర్ రెడ్డి, చిత్రంలో ప్రొఫెసర్ శివకుమార్ సరీన్

హైదరాబాద్ సిటీ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల నుంచి పిల్లలకు ఆస్తులు లభించటం అటుంచితే.. అనారోగ్య సమస్యలు కూడా వారసత్వంగా సంక్రమిస్తాయని ప్రముఖ హెపటాలజిస్ట్ (కాలేయ నిపుణులు), ఢిల్లీలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లివర్ అండ్ బైలియరీ సైన్సెస్ డైరెక్టర్ ప్రొఫెసర్ శివకుమార్ సరీన్ తెలిపారు. అందువల్లే, ఆస్తుల విషయాలే కాకుండా కుటుంబంలో తరతరాలపాటు కొనసాగుతున్న జబ్బుల గురించి కూడా తెలుసుకుని సంతానానికి అవి సోకకుండా ముందుజాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. హైదరాబాద్‌లోని ఏఐజీ హాస్పిటల్‌లో నిర్వహించిన 'వెల్ బీయింగ్ షో'లో.. శివకుమార్ సరీన్ రాసిన 'ఓన్ యువర్ బాడీ' పుస్తకావిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వర్ రెడ్డి.. సరీన్‌తో సంభాషించారు.

నాగేశ్వర్‌రెడ్డి: ఈ మధ్య ఫ్యాటీ లివర్ సమస్యపై ఎక్కువగా దృష్టి సారించినట్లున్నారు.

సరీన్: ఇప్పుడు ఫ్యాటీ లివర్ సమస్య తీవ్రంగా తయారైంది. ప్రతి ముగ్గురిలో ఒకరు ఫ్యాటీ లివర్‌తో బాధపడుతున్నారు. ఇది అంతర్జాతీయంగా సమస్యగా మారుతోంది. 1999-2000లోనే ఫ్యాటీ లివర్ సమస్య చిన్నతనంలోనే వస్తుందని గుర్తించాం. తల్లిదండ్రులతోపాటు స్కూల్స్ కూడా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచిస్తున్నప్పటికీ ఎవరూ దీని గురించి ఆలోచనే చేయడం లేదు. ప్రస్తుతం ఫ్యాటీ లివర్ జీవనశైలి సమస్యగా మారింది. రోజుకు 40-45 నిమిషాలపాటు వ్యాయామాలు చేయాలి. కానీ చాలా మందికి ఆ ఊసే ఉండటం లేదు. అటువంటప్పుడు వారు ఆరోగ్యంగా ఎలా ఉండగలరు?

స్కూల్స్ సమీపంలో జంక్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లపై నిషేధం విధిస్తే మంచిదా?

మనం చదువుకున్న రోజుల్లో జంక్ ఫుడ్ అంటూ ఉండేది కాదు. పాలు, మజ్జిగ, పళ్లరసాలు మాత్రమే ఉండేవి. ప్రస్తుతం జంక్ ఫుడ్ పెరిగిపోయింది. అయితే, ఆ సెంటర్లను నిషేధించమని చెప్పను. ఏది తినాలి, ఏది తినకూడదనే అంశం పట్ల ప్రజల్లోనే అవగాహన లేదు. ఎందుకంటే మన దగ్గర సరైన సమాచారం లేదు. అమెరికాలో సగటున ఒక విద్యార్థి తాగే కోలాల (శీతల పానీయాల) ద్వారా సంవత్సరానికి 24 కిలోల ఫ్రక్టోజ్ ఆ విద్యార్థి శరీరంలో చేరుతోందని తేలింది. అదే ఫ్యాటీ లివర్‌కు అతి ప్రధానకారణం.

మద్యం మంచిదా? కాదా?.. దేశంలో మద్యం వినియోగం పంజాబ్ తర్వాత హైదరాబాద్‌లోనే అధికంగా ఉంది.

అప్పుడప్పుడూ మద్యం తీసుకున్నా ఆరోగ్యానికి ఇబ్బందే. కానీ సామాజికంగా అంగీకరించిన విషమది. అది క్యాన్సర్ కారకం. ఇటీవలనే సర్జన్ జనరల్ ఆఫ్ అమెరికా ఆల్కహాల్‌ను కార్సినోజెనిక్ (క్యాన్సర్ కారకం)గా ప్రకటించింది.

ఆరోగ్యంపై 3 ముఖ్యమైన అంశాలు అంటే ఏం చెబుతారు?

ఆరోగ్యం అనేది కుటుంబానికి సంబంధించిన అంశం. అందరూ ఆరోగ్యంగా ఉండాలి. కనీసం 15 రోజులకు ఓసారైనా కుటుంబ సభ్యుల ఆరోగ్యం గురించి చెర్చించాలి. ఈ విషయంలో ఇంటి పెద్ద.. అంటే ఆడవాళ్లు బాస్‌లా వ్యవహరించాలి. ఆమె ఎప్పుడూ బాసే కదా! ఎవరు ఏం తినాలి? ఎవరు ఎంత సమయం వ్యాయామం చేయాలో నిర్ణయించి అమలు చేయాలి. రెండవది.. మధుమేహం, రక్తపోటు తదితర సమస్యలున్న దంపతులు పిల్లలను కనే విషయంలో పునరాలోచించుకోవాలి. భావి తరం ఆరోగ్యంగా ఉండాలంటే ఈ జాగ్రత్త తప్పదు. ఓ పదేళ్ల కుర్రాడు తన ఊబకాయం, మధుమేహానికి తన తల్లిదండ్రులే కారణమంటే.. ఆ బాలుడి పరిస్థితిని ఊహించుకోవచ్చు. అందుకే మీరు ఆరోగ్యంగా లేకపోతే పిల్లలను కనవద్దు. మూడవది లాంగిటివిటీ.. డెత్ ఆఫ్ ఏజింగ్ (దీర్ఘకాలం ఆరోగ్యంగా జీవించటం). దేహం స్లిమ్‌గా, ఫిట్‌గా ఉంచుకునే కృషి చేయాలి. అప్పట్లో ఒనిడా టీవీ ప్రకటనలా 'ఓనర్స్ ప్రైడ్.. నైబర్స్ ఎన్వీ' (యజమానికి గర్వం.. పొరుగువారికి అసూయ కలిగించే టీవీ) అనిపించేలా మీ శరీర తీరు ఉండాలి. మీ శరీరానికి మీరే బాస్‌లు. దాన్ని డాక్టర్లకు ఔట్ సోర్స్ చేయొద్దు.

హెపటాలజీ ఓ ప్రత్యేక విభాగంగా లేని రోజుల్లోనే మీరు ఆ రంగంలో కృషి చేయడం, తొలుత గ్యాస్ట్రో ఎంటరాలజీలోకి ప్రవేశించి ఆ తర్వాత హెపటాలజిస్ట్‌గా మారడానికి స్ఫూర్తి ఎవరు?

1978లో నేను డాక్టర్‌గా బాధ్యతలు చేపట్టినప్పుడు కాలేయ ఇబ్బందులపై దృష్టి పెట్టా. పరిశోధన కూడా చేశాను. ఆ తర్వాత హెపటాలజీ పట్ల ఆసక్తి కలిగింది. ప్రొఫెసర్ బీ ఎన్ టాండన్ ప్రభావం నాపై చాలా ఉంది. ఆయన ఆలోచనా విధానం, క్రమశిక్షణ నాకు ఎంతో స్ఫూర్తి కలిగించాయి. జీబా నీడిల్ ఆవిష్కర్త కునియో ఖుడా కూడా నాకు స్ఫూర్తినిచ్చారు.

'ఓన్ యువర్ బాడీ' పుస్తకం రాయడానికి కారణం?

నా అనుభవాలే కారణం. ఈ పుస్తకంలో 21 కేసుల గురించి చర్చించాం. నా దగ్గరకు వచ్చిన రోగులలో ఒకరు కాలేయ మార్పిడి చేయించుకున్నారు. అతని సోదరునికి కూడా అదే సమస్య. అప్పుడే కుటుంబ ఆరోగ్య చరిత్ర ఎంత మేరకు కారణమవుతుందనే ఆలోచన చేశాను. అలాగే పిత్తాశయంలో రాళ్ల సమస్యతో ఒక పాప వచ్చింది. ఆ పాప తల్లిదండ్రుల్లోనూ ఆ సమస్య ఉంది కానీ వారికి నొప్పి లేదు. అది 1989లో. మేం పరిశోధనలు చేసి ఐదేళ్ల తర్వాత పిత్తాశయంలో రాళ్లను కాలేయ వ్యాధిగా గుర్తించాం. అది జన్యుపరమైనదని చెప్పాం. 1995లో అలా చెప్పిన మొట్టమొదటి పరిశోధనా పత్రం మాదే. మరో కేసులో ఓ ఏడేళ్ల బాలికకు పాంక్రియాస్ సమస్య వచ్చింది. ఇప్పటికీ ఆమె ఆ సమస్యతో ఉంది. ఊబకాయంతోనూ బాధపడుతోంది. ఆమె తల్లిదండ్రుల జన్యువుల కారణంగా ఆమెకు మధుమేహమూ ఉంది. ఆమె కథ కూడా దీంట్లో ఉంది.

మీ ఆరోగ్య రహస్యం ఏమిటి?

చక్కగా నిద్రపోతాను. మా అమ్మనాన్నల నుంచి వచ్చిన జన్యువులు మరో కారణం. రోజుకు ఒకసారి మాత్రమే తింటాను. తినే ఆహారంలో 60% వండని ఆహారపదార్థాలు (పచ్చివి) తింటాను. విందులకు వెళ్తే ముందే తిని వెళ్తాను. వ్యాయామాలు గంట పాటు చేస్తాను.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.